# ఐక్య ఉపాధ్యాయ

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

సంపుటి - 7 సంచిక -03 కృష్ణా/విజయవాడ మార్చి - 2026 పేజీలు - 36 రూ.20.00





## యుటియఫ్ రణభేరి 2.0

# యుటియఫ్ రణభేరి 2.0



యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు



యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్



పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి



మాజీ ఎమ్మెల్సీ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు



మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



ఏపిఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షులు ఎ.సాగర్



సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి



ఏపిఎన్‌జిఓ రాష్ట్ర ప్రధానకార్యదర్శి



ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి



యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.ఎన్.కుసుమకుమారి

# ఐక్య ఉపాధ్యాయ

## విద్యా విషయక మాసపత్రిక

### సంపాదక వర్గం

**కె.సురేష్ కుమార్**
ప్రధాన సంపాదకులు

**సంపాదకవర్గ సభ్యులు**

కె.ఎస్.ఎస్.ప్రసాద్
నక్కా వెంకటేశ్వర్లు
సిహెచ్.శ్రీహరి
సిహెచ్.శ్రీనివాసరావు
ఎం. లలితశ్రీ


### ఈ సంచికలో...


| | |
|---|---|
| పద వికాసం | - 04 |
| మహా ప్రస్థానం శ్రీ.శ్రీ | - 05 |
| జాతీయం - అంతర్జాతీయం | - 06 |
| టెట్ మినహాయించాలని ... | - 07 |
| కార్మికవర్గ ప్రయోజనాలను బలి.. | - 08 |
| రణభేరి 2.0 | - 09 |
| ప్రాథమిక విద్యపై నీలి నీడలు | -12 |
| ఉద్యోగుల ప్రయోజనాలు కాలరాసే..- | 13 |
| అమెరికన్ సామ్రాజ్యవాద వల | - 15 |
| పని చేస్తేనే - తినే హక్కు | - 16 |
| 12వ పిఆర్‌సి, ఆర్థిక సమస్యలపై... | - 17 |
| వాస్తవిక దృక్పథంస్త్రీ శక్తి సమస్య | - 21 |
| మంచి బడి | - 24 |
| బ్లాక్ బోర్డు నుంచి బంగారు... | - 25 |
| మేచర్ల ఏసురత్నం 44వ వర్థంతి | - 26 |
| అంతర్జాతీయ పాఠ్యాంశ పుస్తకాల.. | - 27 |
| అమ్మా, నేను వస్తున్నా...(చిన్న కథ) | - 29 |
| వివక్షతను విడనాడితేనే... | - 30 |
| ప్రశ్నోత్తరాలు | - 31 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | - 32 |



| | | |
|---|---|---|
| 5 సం॥ చందా | : ` | 850-00 |
| 2 సం॥ చందా | : ` | 375-00 |
| సం॥ చందా | : ` | 200-00 |

**Union Bank Online**
A/c No. 346402010025027
IFSC Code : UBIN0534641

**ఐక్య ఉపాధ్యాయ**



యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2973763
MobileNo. : 9494112533
Website : www.aputf.org
E-mail : ikyopadhyaya1975@gmail.com


# మహిళా లోకం మేల్కొనాలి

ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటాం. దాని ఏర్పాటుకు కారణం 1910లో అంతర్జాతీయ సోషలిస్టు మహిళా సదస్సు చేసిన తీర్మానం. 'మార్చి8' కి నిజమైన మూలం 1917 మార్చి 8న మహిళా కార్మికులు ప్రారంభించిన రష్యా విప్లవం. 'మార్చి8' ని అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి శాశ్వతమైన తేదీగా నెలకొల్పిన నిజమైన సంఘటన 1921లో కమ్యూనిస్టు ఉమెన్స్ ఇంటర్నేషనల్ సదస్సు చేసిన నిర్ణయం.

స్త్రీ పురుష సమానత్వాన్ని ఆచరణకు తెచ్చిన మూడవవంతు ప్రపంచం సోషలిస్టు ప్రపంచం. మనిషిని మనిషి, స్త్రీ జాతిని పురుషజాతి, ఒక వర్గాన్ని మరొక వర్గం దోపిడీ చేయడాన్ని రూపుమాపే సమాజం సోషలిస్టు సమాజం. ఇందుకు రష్యా విప్లవం ఒక్కటే కారణం కాదు, మానవజాతి చరిత్రలో అందుకు ఆనలు తొడిగింది, నాందీ వాచకం పలికింది పారిస్ కమ్యూన్. ఆ మహత్తర విప్లవ పోరాటంలో మహిళల పాత్ర అనన్య సామాన్యమైనది.

మన తెలుగు ప్రాంతంలో ఇటీవల కాలంలో తెలంగాణా పోరాటంలో మహిళలు చాలా ప్రముఖ పాత్ర వహించారు. భూమి కోసం, భుక్తి కోసం, దాస్య విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనే కాదు, ఇప్పుడు జరుగుతున్న వేతనాల పెంపుదల, ఇళ్ళ స్థలాలు, సంక్షేమ పథకాలు సహా హక్కులు, రాయితీల కోసం జరిగే అన్ని పోరాటాలలో వారు పురుషులకు తీసిపోలేదు. అయినా మన సమాజంలో మహిళా వివక్ష తగ్గడం లేదు, ఉద్యమాల్లో వారి ప్రాతినిధ్యం తగినంతగా ఉండడం లేదు. అందుకు కారణాలు లేకపోలేదు.

చారిత్రకంగా చూస్తే వర్గపరమైన అసమానతలకు, స్త్రీలపై లైంగికపరమైన అణచివేతకు చట్టబద్ధత కల్పించడానికి మతం ఉపయోగపడింది. దీనికి తోడు భారతదేశంలో కుల వ్యవస్థ పై నుండి క్రింది వరకు పారంపరిక అసమానతలకు చట్టబద్ధమైన, ఆచారపరమైన ఆమోదముద్ర వేసింది. దీనికి ఆర్థిక సామాజిక కోణాలు రెండూ ఉన్నాయి. ఇది హిందూ మతంలో భాగంగా పెరిగినప్పటికీ ఇతర మత బృందాలపైనా ప్రభావం చూపించింది.

మరోవైపు ప్రపంచీకరణ నయా ఉదారవాద విధానాలు మొత్తం కార్మికులపై దోపిడీని పెంచి వారి హక్కులను దెబ్బతీశాయి. కాగా మహిళా శ్రామికులు మరింత ఘోరంగా నష్టపోయారు. దుర్భరమైన ఆర్థిక పరిస్థితి వల్ల మరింత ఎక్కువమంది మహిళలు శ్రామికులుగా మారవలసి వస్తున్నది. ఒకవైపున ప్రభుత్వ విధానాల వలన ఉద్యోగావకాశాలు తగ్గిపోతున్న స్థితిలో ఇది జరుగుతున్నది. స్త్రీలకు అత్యధికంగా ఉద్యోగాలు కల్పించవలసింది ప్రభుత్వం. ప్రభుత్వ ఉద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతులు ప్రవేశ పెడుతున్నారు. ఇవన్నీ స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తున్నవి.

ఈనాటి భారతదేశంలో పెట్టుబడిదారీ భూస్వామ్య దోపిడీకి అత్యంత దారుణంగా బలవుతున్నవారు మహిళలే. గత దశాబ్దికాలంలో మొత్తంగా స్త్రీల ప్రతిపత్తి తీవ్రంగా క్షీణించింది. మరీ ముఖ్యంగా దళిత, ఆదివాసి, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళల విషయంలో ఇది మరింత ఎక్కువగా జరిగింది. ప్రభుత్వం ప్రకటించిన గణాంకాలే దిగజారుతున్న స్త్రీల పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయి.

చరిత్ర గమనంలో ప్రజాబాహుళ్యం తమను అణచివేస్తున్న వ్యవస్థపై తిరుగుబాటు చేసి నిర్మూలించిన ప్రతి సమయంలోను, మార్పుకోసం జరిగిన ఆ విప్లవోద్యమంలో మహిళలు పురుషులతో పాటు సమానంగా పాల్గొన్నారు. లెనిన్ చెప్పినట్లు, "అణిచివేతకు వ్యతిరేకంగా జరిగే ఏ ఉద్యమము దాని శ్రేణుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో లేకుండా విజయవంతం కాలేదు." ఆయన ఇంకా ఇలా చెప్పారు. "మహిళల విముక్తిని పూర్తిగా సాధించనంతవరకు కార్మికవర్గం తన విముక్తిని కూడ సాధించుకోజాలదు."

ఇటీవల కాలంలో మూఢత్వం, అంధవిశ్వాస పద్ధతులు, మతతత్వ భావాలు త్వరితగతిన వ్యాపిస్తున్నాయి. ఇవి ప్రత్యేకించి మహిళలను దెబ్బతీస్తున్నాయి. మహిళలను తక్కువ స్థాయికి నెట్టడానికి వ్యతిరేకంగా సమైక్య సమీకరణ ద్వారా జరిగే పోరాటానికి ఆటంకాలవుతున్నాయి. శాస్త్రీయ అవగాహనను వ్యాపింపచేయాలి. మహిళా ఉపాధ్యాయులు మరింత చైతన్య మూర్తులై ఉద్యమాల్లోకి ఉప్పెనలా రావాలి. ఇటీవల ప్రభుత్వాలు అమలు చేయ సాహసిస్తున్న లేబర్ కోడ్ లు అమలైతే ఇంత కాలం సాధించుకున్న సౌకర్యాలు, హక్కులు కోల్పోతారు. ఇవి మహిళలకు మరింత నష్టాన్ని కలిగించేవి.

గనుక, మహిళల హక్కులపై జరుగుతున్న బహుముఖ దాడులను ప్రతిఘటించి, మహిళా విముక్తి కోసం జరిగే పోరాటానికి దోహదపడటం సామాజిక చైతన్య ప్రతీకలైన ఉపాధ్యాయుల అందరి కర్తవ్యం. ముఖ్యంగా మహిళా లోకం మేలుకోవాలి.

PRINTED AND PUBLISHED BY **KANDALA SATYA SUBRAHMANYA PRASAD**, ON BEHALF OF A. P.UNITED TEACHERS FEDERATION, PRINTED AT PRAJASAKTI PRINTERS&PUBLISHERS PVT LTD, D.NO.27-30-4, AKULAVARI STREET, GOVERNERPET, VIJAYAWADA- 520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT A. P.UNITED TEACHERS FEDERATION, 27-31-11, PALAPARTHIVARI VEEDHI, GOVERNERPET, VIJAYAWADA.520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH. **EDITOR : K SURESH KUMAR**

# పద వికాసం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | | | 3 | 4 | | |
| 5 | | | | 6 | | | | 7 |
| 8 | | | 9 | | | | 10 | |
| | | 11 | | | | 12 | | |
| 13 | | | | | 14 | | | |
| | | | | 15 | | | | |
| 16 | | | 17 | | | | 18 | 19 |
| | | 20 | | | | 21 | | |
| | 22 | | | | 23 | | | |

## గత ఫిబ్రవరి నెల సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 బం | 2 జ | రు | | 3 ఋ | 4 జు | వు | |
| 5 ప | | డ్జి | | 6 బం | | న్న | | 7 ప |
| 8 సి | ధి | | 9 సిం | ధు | వు | | 10 పా | త |
| | | 11 ప | | వు | | 12 ఝు | | గ |
| 13 అం | గ | ర | కా | | 14 న | ర | క | ము |
| | | క | | 15 మి | | ము | | |
| 16 మి | న్న | | 17 మ | రా | ఠీ | | 18 ల | 19 వం |
| న్న | | 20 స్తు | | శ | | 21 వ | | ట |
| | 22 అ | తి | ధి | | 23 వే | స | ట | |

## ఆధారాలు

- యం. జోగిరాజు

**అడ్డం**

1) సిరివెన్నెల సీతారామ శాస్త్రి ఇంటిపేరు
3) గీము కి ప్రకృతి
8) జనరేషన్,25 నుండి 30 సం॥ల కాలం
9) పాపము
10) ఒకప్పటి ప్రసిద్ధ తల నూనె
13) మసజసతతగ పద్య వృత్తం
14) పుట్టుకలు తడబడితే
16) అవును కు వ్యతిరేకం
17) పగుళ్ళు
18) వ్యాజ్యం
22) కార్తి, నాగార్జున నటించిన సినిమా
23) ఫ్యాట్ మాన్ బాంబును ఏనగరం పై వేశారు.

**నిలువు**

2) జ్ఞానోదయం
4) తేనె ఆంగ్లమున
5) తండ్రి తండ్రి
6) వంద పద్యాల రచన
7) తాళ పత్రాలు
11) స్త్రీ
12) రామకృష్ణ కవి ఈ ఇంటిపేరుతో ప్రసిద్ధి.
15) ముల్లు
16) కలకత్తా అమ్మోరు
19) కవిగా మారిన బోయవాడు
20) రాసే శైలి
21) వైరం

- (సమాధానాలు వచ్చే సంచికలో)

## పాఠకులకు సూచన

పూర్తి చేసిన పదవికాసం 2026 మార్చి 20లోగా ఐక్య ఉపాధ్యాయ పత్రికకు పోస్టు ద్వారా పంపాలి. కరెక్టుగా పూర్తి చేసి పంపిన పాఠకుల పేర్లు వచ్చే సంచికలో ప్రచురించ బడతాయి. సమాధానాలు పంపిన మొదటి పదిమందికి తగిన బహుమతి

## పద వికాసం ఫిబ్రవరి నెల విజేతలు

1. **ఈడే వెంకటభరత కుమారి** తిరువూరు, ఎన్.టి.ఆర్.జిల్లా
2. **కర్ర వరప్రసాద్** మెయిల్
3. **షేక్ షావలి** విడవలూరు (మం), నెల్లూరు (మెయిల్)
4. **డా॥ మొర్రీ పిచ్చయ్య** గిద్దలూరు (మం), మార్కాపురం (మెయిల్)
5. **షేక్ బాజీ** తిరువూరు (మం), ఎన్.టి.ఆర్. (మెయిల్)
6. **షేక్ అబ్దుల్ ఖాదర్** హనుమంతుని పాడు(మం), మార్కాపురం (మెయిల్)
7. **వై. నరేష్‌బాబు** (మెయిల్)


విజేతలకు అభినందనలు. బహుమతి త్వరలో అందజేయ బడుతుంది.

# మహిళా మేలుకో

ఈడె వెంకట భరత కుమారి, తిరువూరు, ఎన్.టి.ఆర్. జిల్లా

మహిళా మేలుకో
మనుగడమార్చుకో
విశ్వవేదికపై ఖ్యాతి నీదే
అంతరిక్షంలో, అత్యున్నత స్థానాలలో
ఆటలో పాటలో విశ్వవిఖ్యాతి నీవే
అయినా ఓర్పు నేర్పులతో
బాధ్యతలు పంచుకొని
అవిశ్రాంతంగా సాగిపోయే
ఓ మహిళ మేలుకో
సబలలని సైతం అబలలుగా మార్చాలని
అహంకారుల అహం
సాంప్రదాయం ముసుగులో
పాతాళానికి నెట్టి వేసే ప్రయత్నం
నీవున్నతికి వేసే అడ్డుకట్ట తెంచుకుని
పోరాడు సమానత్వం కోసం
మహిళా మేలుకో
మనుగడ మార్చుకో
నేడు లేరిక సంఘ సంస్కర్తలు
అందుకే స్త్రీ చదవాలి ఎదగాలి
పురుషుల ఎత్తుకు పై ఎత్తు
వేసే స్థాయికి మహిళా మేలుకో
మనుగడ మార్చుకో

## పుస్తక సమీక్ష



ఎం.జోగిరాజు
కృష్ణాజిల్లా

శ్రీశ్రీ అంటూ పిలవబడే శ్రీరంగం శ్రీనివాసరావు 1910 ఏప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించారు. తల్లి తండ్రులు పూడి పెద్ది వెంకటరమణయ్య, అటప్పకొండ. చిన్నతనంలోనే శ్రీరంగం సూర్య నారాయణ గారు దత్తత తీసుకోవటంతో వారింటి పేరు 'శ్రీరంగం'గా మారింది. బాల్యం విద్యాభ్యాసం అంతా విశాఖపట్నంలోనే, తండ్రి వెంకటరామయ్య గారు గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పాఠశాలలోనే జరిగింది.

**రచనాసాహిత్యం:-** సంప్రదాయ పద్య కవిత్వానికి భిన్నంగా, ఆధునిక, స్వేచ్ఛా కవితా ప్రక్రియను ప్రోత్సహించారు. విప్లవ కవిగా, ప్రజాస్వామ్య భావ జాలాన్ని, సామాజిక న్యాయాన్ని తన కవితల్లో ప్రతిబింబించేవారు.

**రచనలు:-** ప్రభవ (1928లో ) మహా ప్రస్థానం ( 1950లో), అమ్మ (1952లో) వంటి నాటకాలు.

**విశేషాలు:-** శ్రీశ్రీ హేతువాదిగా, నాస్తికుడిగా ప్రసిద్ధి చెందారు. శ్రీశ్రీ వ్రాసిన 'మహాప్రస్తానం' నాటికీ, నేటికీ ఒక సంచలనం. ఆయన స్వదస్తూరితో ప్రచురణకర్త 'కృష్ణమూర్తి గారికి అంకితం', 'చలంగారికి యోగ్యతా పత్రం' అంటూ వ్రాసిన ముందు మాటలతో మొదలవుతుంది ఈ పుస్తకం.

"మహాప్రస్థానంలో నేను చేసిందంతా సామాజిక రుగ్మతను నిదానించటం మాత్రమే. ఇది మన ప్రపంచం! ఇలా ఉన్నారు ఇచ్చటి ప్రజలు. ఇది సరైన రోగ నిదానమే కానీ అంతటితో ఆగిపోకూడదు. జబ్బులకు తగ్గ మందు వెతకాలి. పై పై పూతలతో ఈ జబ్బులు కుదరవు. కావలసింది శస్త్ర చికిత్స. దాన్నే విప్లవం అంటున్నాను.

మహాప్రస్థానంలో అభ్యుదయ కవిత్వమూ, విప్లవ బీజాలూ ఉన్నాయి. కానీ, విప్లవ సాహిత్యం లేదు. "విప్లవ సాహిత్యం" అంటే ఏమిటి? సామాన్య ప్రజానీకాన్ని విప్లవాచరణ కుద్యుక్తుల్ని చేసే విధంగా సాగేదే!" అంటూ శ్రీశ్రీ మాటలతో పుస్తకం ప్రారంభమవుతుంది.

మిత్రులు కొంపెల్ల జనార్ధన రావుగారి స్మృతిలో" తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం" అంటూ సాగిన శ్రీ శ్రీ విషాద కవితతో మొదలై ఈ నిరాశా మయ లోకంలో కదనశంఖం పూరిస్తున్నాను! ఇక్కడ నిలబడి నిన్ను ఇవాళ అవాహనం చేస్తున్నాను, అందుకో చాచిన హస్తం ఆవేశించు నాలో, ఇలా చూడు నీకోసం ఇదే నా మహాప్రస్థానం అనే కొత్త పదబంధంతో మొదటి పుట ప్రారంభం అవుతుంది.

1930 దశకము నుండి స్వతంత్రం వచ్చే వరకు అనగా 1947 వరకు శ్రీ శ్రీ వ్రాసిన కవితా సంపుటాలన్నీ ఒకచోట చేర్చిన ప్రయత్నమే ఈ మహాప్రస్థానం.

"మరో ప్రపంచం.. మరో ప్రపంచం పిలిచింది.. పదండి ముందుకు.. పదండి తోసుకు.." అంటూ మహాప్రస్థానం మొదలౌతుంది. నేను సైతం "ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను..." అంటూ సాగే జయభేరి, "కుక్కపిల్ల, అగ్గిపుల్లా, సబ్బు బిళ్ళా... కాదేది కవిత కనర్హం" అంటూ మేల్కొలిపే ఋక్కులు, "కూటి కోసం.. కూలి కోసం... పట్టణంలో బ్రతుకు దామని... తల్లి మాటలు చెవిన పెట్టక బయలుదేరిన.." అంటూ బాటసారిలో, "పాపం.. పుణ్యం.. ప్రపంచ మార్గం కష్టం... సౌఖ్యం శ్లేషార్థాలు ఏమీ ఎరుగని పూవుల్లారా.. పాపల్లారా..." అంటూ పాడిన శైశవగీతి పద్యాలు ఈ మహాప్రస్థానంలో ఉన్నాయి.

రానీ.. రానీ.. వస్తే రానీ... కష్టాల్ నష్టాల్, కోపాల్ తాపాల్.." అనే కళారవి, "నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే నిబిడాశ్చర్యంతో వీరు, నెత్తురు కక్కుకుంటూ నేలకు నేల రాలిపోతే.."

"పొలాలనన్నీ.. హలాలదున్నీ.. ఇలాతలంలో హేమం పిండగ.. జగానికంతా సౌఖ్యం నిండగ.. విరామమెరుగక పరిశ్రమించే, బలం దరిత్రికి బలికావించే.. కర్షక వీరుల కాయం నిండా కాలువ కట్టే ఘర్మ జలానికి, ధర్మ జలానికి ఖరీదు లేదోయ్..." అనే ప్రతిజ్ఞ

"ఓహో! ఓ రసధుని! మణిఖని! జననీ! ఓ కవితా! కవితా! కవితా! ఓ కవితా!.." అంటూ సాగిన అమృత వాక్కులు మహాప్రస్తానంలో భాగాలు.

ఇవేకాక "పులి చంపిన లేడి నెత్తురు... ఎగరేసిన ఎర్ర జెండా.. రుద్రాలిక నయన జ్వాలిక.. కలకత్తా కాళిక నాలిక.. కావాలోయ్ నవకవనానికి" అంటూ సాగే నవ కవిత, "ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం?.. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" "తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు.. ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అది మోసిన బోయీ లెవ్వరు.." అని ప్రశ్నించే దేశ చరిత్రలు, "ఇటు చూస్తే అప్పులవాళ్లూ.. అటు చూస్తే బిడ్డల ఆకలి!.. ఉరిపోసుకు చనిపోవడమో.. సముద్రమున పడిపోవడమో.. సమస్యగా ఘనీభవించిందొక సంసారికి!.." అనే సంధ్యా సమస్యలు శ్రీశ్రీ మహాప్రస్తానంలో చోటుచేసుకున్నాయి.

"లే..లేలే.. రష్యా రా..రారా రష్యా.." అంటూ గర్జించు రష్యా కవితలు. "పతితులారా.. భ్రష్టులారా.. బాధా సర్ప దష్టులారా.. ఏడవకేడవకండి.. వస్తున్నాయి.. జగన్నాధ రధచక్రాలు వస్తున్నాయి.." అంటూ సాగే ఉత్తేజిత కవితలే కాకుండా, "ఒకరాత్రి, గంటలు, ఆకాశ దీపం, అవతారం, ఆశా దూతలు, ఐ, అవతలి గట్టు, సాహసి, భిక్షు వర్షీయసి, ఒక క్షణంలో, పరాజితులు, ఉన్మాది, స్విర్ల్ కవికి, అద్వైతం, వాడు, అభ్యుదయం, వ్యత్యాసం, మిధ్యావాది, చేదుపాట, జ్వాలా తోరణం, మానవుడా, దేనికొరకు, కేక, పేదలు, నిజంగానే, నీడలు, అన్నీ దేనికవే సాటిగా పోటీగా ఉండే మాత్రా ఛందస్సు కవితా తోరణాలు ఆయన రచనలు.

శ్రీశ్రీ కేవలం కవి మాత్రమే కాదు.. సినిమా పాటల రచయితగా కూడా సుప్రసిద్ధులు. గంభీరమైన మిస్సయిల్స్ వంటి పదకవితలు రాసే వారు. నిజజీవితంలో ఎంతో చమత్కారంగా మాట్లాడేవారు.

ఒకనాడు ఒక మిత్రుడు స్టేషన్‌లో కనపడి ఉరికేనా (మీ ఊరికి)... అని అడిగితే "హా ఊరికే".. (ఏదో తమాషాగా) అన్నారట.

ఒక నాటిక రాసిపెట్టమని అడిగిన మిత్రుడికి ఏనాటికైనా (ఎప్పటికైనా) రాసేస్తాను అన్నారట.

హోటల్‌కి మిత్రుడి తో వెళ్ళినప్పుడు అట్లు (దోశలు ) చెప్పనా అంటే అట్లే కానిమ్ము అన్నారట.

ఒక నాడు మిత్రులతో హోటల్‌కు వెళ్ళినప్పుడు అక్కడ "ఇక్కడ వేడి తేనీరు దొరకును" అనే బోర్డు చూసి "అరే! ఇక్కడ వేడితేగాని నీరు దొరకదా.." అంటూ చమత్కరించారు. అల్లూరి సీతారామ రాజు చిత్రం లోని "తెలుగు వీర లేవరా" అనే పాటకు తొలి ప్రాంతీయ ఉత్తమ గీతం అవార్డు కేంద్ర ప్రభుత్వం నుండి అందుకున్నారు.

తరలి రాదా తనే వసంతం.. తన దరికి రాని వనాల కోసం .. అన్నట్లుగా ఎప్పటికీ కష్టజీవులకు అంకితం శ్రీశ్రీ రచనలు.

# జాతీయం - అంతర్జాతీయం



డి. రాము
రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యులు

### శాన్ ఫ్రాన్సిస్కో టీచర్లకు అభినందనలు

50 సంవత్సరాల తర్వాత అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో మొట్టమొదటిసారిగా ఉపాధ్యాయులు నాలుగు రోజులు పాటు సమ్మె చేశారు ఐదవ రోజున చర్చలు జరిగి సమ్మె విజయవంతమైంది. ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలని, ఉపాధ్యాయులకు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భీమా కల్పించాలని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మరిన్ని సౌకర్యాలు పెంచాలని, ఉపాధ్యాయులకు ప్రత్యామ్నా యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ)ని ఉపయో గించరాదని తదితర డిమాండ్లతో ఉపాధ్యాయులు సమ్మెలో దిగారు. ఉపాధ్యాయుల సమ్మె పోరాటానికి తల్లితండ్రులు పూర్తి మద్దతునిచ్చి పోరాటంలో పాల్గొన్నారు. 120 పబ్లిక్ స్కూల్స్ మూతపడ్డాయి. 50వేలమంది విద్యార్థులు తరగతులకు దూరమయ్యారు. సమ్మెలో ఉన్న ఉపాధ్యాయులు చైతన్య వంతంగా నిలబడి, బెదిరింపులకు లొంగకుండా ఐక్యంగా పోరాడారు. తప్పనిసరి పరిస్థితుల్లో శాన్ ఫ్రాన్సిస్కో యూనిఫైడ్ స్కూల్ డిస్ట్రిక్ట్ అధికారులు, యునైటెడ్ ఎడ్యుకేటర్స్ ఆఫ్ శాన్ ఫ్రాన్సిస్కో (ఉపాధ్యాయ సంఘాల) నాయకులకు 13 గంటల పాటు చర్చలు తాత్కాలిక ఒప్పందం కుదుర్చు కోవడం జరిగింది.

భవిష్యత్తులో పాఠశాలల మూసివేతలు లేదా ఉద్యోగ కోతలు ఉంటే ప్రతిఘటన కొనసాగుతుందని యూనియన్ నాయకులు హెచ్చరిక చేయడం జరిగింది. ఐక్యంగా పోరాడి సాధించుకున్న శాన్ ఫ్రాన్సిస్కో ఉపాధ్యాయులకు రెడ్ సెల్యూట్.

### విద్య కోసం వీధుల్లోకి.. గ్రీస్ విద్యార్థుల భారీ నిరసనలు.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మద్దతు

ఏథెన్స్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. "విద్య కోసం వీధుల్లోకి" నినాదంతో రాజధాని ఏథెన్స్‌తోపాటు దేశవ్యాప్తంగా 40 నగరాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఏథెన్స్‌లో లక్షలమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన జరిగింది. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరసనల్లో భాగస్వాములయ్యారు. ఫిబ్రవరిలో ఎన్నికైన దేశ అధ్యక్షుడు తసౌలాస్ అమలు చేస్తున్న కార్పొరేట్ విధానాలను వారు వ్యతిరేకిస్తున్నారు. విద్య వస్తువు కాదు, మార్కెట్ ప్రయోజనాలకు బదులుగా సమాజ ప్రయోజనాల కోసం, విజ్ఞానం కోసం చదువు వుండాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సిబ్బంది కొరతతో ప్రమాణాలు దిగజారుతున్నాయని, తక్షణమే టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగిపోయిందని, అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్నా మని మీడియాకు వివరించారు. ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలు విద్యను ఆధునీకరించకపోగా పేదలకు విద్య దూరమైపోయిందని ఉపాధ్యాయ యూనియన్లు విమర్శించాయి. సరిపడా తరగతి గదులు లేవని, భవనాలు శిథిలమైపోయి పనికిరాకుండా పోయాయని, పాఠశాలల విలీనం పేరుతో 10 కిలోమీటర్ల దూరంలోకి పాఠశాలను తరలించారని, దాంతో రవాణా ఖర్చులు పెరిగాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాలు ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాయి. 'మా విద్య ప్రభుత్వానికి అనవసర ఖర్చు, మా కలలు వారికి ఖర్చు, అందుకే విద్యావసరాలకు నిధులు కేటాయించకూడదని ప్రభుత్వం నిర్ణయించు కుంది. మేము పోరాటాన్ని నేర్చుకున్నాం. విద్య కోసం, మెరుగైన అవసరాలకోసం పోరాటం కొనసాగిస్తామని' విద్యార్థి సంఘాలు ప్రకటించాయి.

### పోర్చుగల్ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి సెగురో ఘన విజయం

పోర్చుగల్ అధ్యక్ష ఎన్నికలలో వామపక్ష అభ్యర్థి ఆంటోనియో జోస్ సెగురో అఖండ విజయం సాధించారు. ఆదివారం రెండోరౌండ్ అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. యీ ఎన్నికలలో మొత్తంగా 95.37 శాతం ఓట్లు పోలయ్యాయి. వీటిని లెక్కించినపుడు సోషలిస్టు పార్టీ (పి.ఎస్)కి చెందిన అధ్యక్ష అభ్యర్థి సెగురో కి 66.14 శాతం ఓట్లు రాగా, మితవాద చేగా పార్టీకి చెందిన వెంచురాకు 33.86 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి.

ప్రస్తుత ఫలితాలు ప్రకారం ఆంటోనియో సెగురో అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో ఎన్నిక అయ్యారని ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. యీ సందర్భంగా కాల్డాస్ దరైన్హాలో తన నివాసంలో సెగురో విలేఖరులతో మాట్లాడుతూ... పోర్చుగీసు ప్రజలు అపారమయిన పౌర బాధ్యత, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్నందునే తనకు యీ విజయం దక్కిందని అన్నారు.

### సూపర్ రిచ్ పై పన్ను విధించండి

2026 జనవరి 20,21తేదీలలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన కొందరు శతకోటీశ్వరులు తమపై తక్షణమే సంపదపన్ను విధించాలంటూ ఆయాదేశాల ప్రభుత్వాలను కోరుతూ బహిరంగ లేఖ విడుదల చేసారు.

24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 400 మంది సంపన్నులు ఆ లేఖపై సంతకం చేసారు. అంతటితో ఆగకుండా TIME TO WIN పేరిట ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న శతకోటీశ్వరులను సంతకాలు చేయాలని కోరారు. దీనిని బట్టి సంపద అంతా కొంతమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం, అత్యధికమంది అత్యంత పేదవారిగా మారుతుండటం భవిష్యత్తులో రాబోతున్న పెనుప్రమాదానికి సూచికగా వారంతా గుర్తించారు. అయితే మన దేశంలో సంపద పన్నును విధించాలన్న డిమాండ్‌ను కేంద్రప్రభుత్వం పట్టించుకోని విషయం తెలిసినదే. పైగా తాజాగా విడుదలైన ఆలేఖపై భారతదేశానికి చెందిన శతకోటీశ్వరులు ఎవరూ సంతకాలు చెయ్యకపోవడం గమనార్హం.

### దశాబ్దకాలంలో దేశంలో మూతపడ్డ బడులు 93 వేలు

తగినంతమంది విద్యార్థులు లేక దేవవ్యాప్తంగా గత పదేళ్లకాలంలో 93 వేలకు పైగా పాఠశాలలు మూతపడ్డాయి. మూతపడిన పాఠశాలలు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు అగ్రభాగాన ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర విద్యాశాఖా సహాయమంత్రి జయంత్ చౌదరి లోక్ సభలో వెల్లడించారు. గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని బడులు అధికంగా మూతపడ్డాయి. ప్రజల వలసలతోపాటు హేతుబద్ధీ కరణ కింద పాఠశాలలను విలీనం చేయడం కూడా ఇందుకు కారణం. కొన్ని చోట్ల పాఠశాలలు కొనసాగుతున్నా వాటిలో విద్యార్థులు లేనే లేరు. యిలాంటి జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 70% తెలంగాణ, ప.బెంగాల్ లోనే ఉండడం గమనార్హం.

### తెలుగు రాష్ట్రాల్లోనే కెజిబివి విద్యార్థినులు అత్యధికం: కేంద్రం

దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవి) అత్యధికంగా బాలికలు విద్యనభ్యసిస్తున్నారని కేంద్రం స్పష్టం చేసింది. లోక్ సభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిస్తూ, తెలంగాణాలోని కెజిబివిలలో 1,41,771 మంది బాలికలు విద్యనభ్య సిస్తున్నారని బాలికల ఎన్రోల్మెంట్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్లో 1,03,738 మంది బాలికలు కేజీబీవిల్లో విద్యను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. అన్ని రాష్ట్రాల లోని 5,316 కేజీబీవిల్లో 7.58 లక్షలమంది బాలికలు చదువు కుంటున్నారని మంత్రి తెలిపారు.



# టెట్ మినహాయించాలని

## జంతర్‌మంతర్ వద్ద కదం తొక్కిన ఉపాధ్యాయులు

ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా 'టెట్' (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) ఉత్తీర్ణులు కావాలన్న సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, విద్యాహక్కు చట్టం 2010లోని సెక్షన్ 23 సవరించాలని కోరుతూ ఆల్‌ఇండియా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక (AIJACTO) 05.02.2026 ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాకు జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు సి.ఎన్.భారతి, చావ రవి, కత్తి నరసింహారెడ్డి, సదానందగౌడ్‌లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. వేలాదిమంది ఉపాధ్యాయులు పాల్గొని నినాదాలతో హోరెత్తించారు. కేరళ రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు జాన్ బ్రిటీష్, శివదాసన్, తమిళనాడు నుండి సెల్వరాజ్, కర్ణాటక నుండి కుమార్‌నాయక్, బీహార్ నుండి రాజారామ్ సింగ్, సిపిఐ నాయకులు నారాయణ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.వెంకట్, ప్రపంచ ఉపాధ్యాయ సమాఖ్య అధ్యక్షుడు అమియకుమార్, వివిధ జాతీయ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు ధర్నాకు సంఘీభావం పలికారు. ఈ సందర్భంగా హాజరైన ఎం.పి.లు మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులను పరీక్షల పేరుతో ఆందోళన గురి చేయడం సరికాదని, సుప్రీంకోర్టు తీర్పు అమలు జరపకుండా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని చట్టాన్ని సవరించాలని, అందుకు పార్లమెంటులో ఉపాధ్యాయుల పక్షాన పోరాడు తామని భరోసానిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుండి యుటియఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌పి మనోహర్ కుమార్, ఎస్.ఎన్.నాయుడు, ఎస్.జ్యోతిబసు, బి.సుభాషిణి, వి.శ్రీలక్ష్మి, ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు సహా 563మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టానికి తగిన సవరణలు చేసి సీనియర్ టీచర్లకు టెట్ పరీక్ష బెడద తప్పించాలని యుటియఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు.

### కేంద్ర విద్యామంత్రికి ప్రాతినిధ్యం

ధర్నా మరుసటి రోజు జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు సి.ఎన్. భారతి, చావ రవి, కత్తి నరసింహారెడ్డి, సదానందగౌడ్, బసవరాజ్ గురికార్, కమలకాంత త్రిపాఠిలు రాజ్యసభ సభ్యులు వి.శివదాసన్ సహకారంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో కలిసి వినతి పత్రం అందజేయారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "విద్యాహక్కు చట్టం అమలుకు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులంతా రెండేళ్ళలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ పాస్ కావాలని లేకపోతే ఉద్యోగాల నుండి తొలగించాలని సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వలన దేశవ్యాప్తంగా 30 లక్షల మంది ఉపాధ్యాయులు ప్రభావితం అవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సత్వరమే జోక్యం చేసుకుని, సుప్రీంకోర్టులో రివ్యూపిటిషన్ వేయాలని, అవసరమైతే విద్యాహక్కు చట్టానికి తగిన సవరణ చేయడం ద్వారా అయినా సీనియర్ ఉపా ధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని కోరారు. కాని పక్షంలో టెట్ సిలబస్, అర్హత మార్కుల విషయంలో రెగ్యులర్ ఉపాధ్యాయులకు సడలింపు ఇవ్వాలని" కోరారు.

సుప్రీంకోర్టు ఉపాధ్యాయులు అందరూ టెట్ పాస్ అయ్యేందుకు రెండు సంవత్సరాలు గడువు ఇచ్చినందున ఈలోపు సమస్యను ఎలా అధిగమించాలో న్యాయ నిపుణులతో ఆలోచన చేస్తున్నామని కేంద్ర విద్యాశాఖ మంత్రి బదులు ఇవ్వడంతో "ఇప్పటికే ఆరు నెలలు గడిచాయని, దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులంతా మానసికంగా ఆందోళనలో చెందుతున్నారని, ఫిబ్రవరి 5న జరిగిన ధర్నాకు దేశం నలుమూలల నుండి వేలాదిమంది ఉపాధ్యాయులు తరలి వచ్చారని, కాబట్టి జాప్యం లేకుండా నిర్ణయం తీసుకుని ఉపాధ్యాయులకు ఊరట కలిగించాలని జాక్టో నాయకత్వం కోరింది. అయినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి పరిశీలిస్తామని అన్నారేతప్ప సమస్య పరిష్కారానికి నిర్దిష్టమైన హామీని ఇవ్వలేదు.

అలాగే సిపిఎస్ రద్దు, ప్రాథమిక ఉపాధ్యాయులకు ఓటు హక్కు, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు, జాతీయ విద్యా విధానంలో ప్రభుత్వ విద్యకు నష్టం కలిగించే అంశాల రద్దు తదితర సమస్యలను ప్రస్తావించగా అవన్నీ ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలంటూ దాటవేసారు. మంత్రి వైఖరి పట్ల ఐక్యవేదిక నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు.

అనంతరం పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున ఖర్గేను కలిసి టెట్ సమస్యను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరగా తాను పార్లమెంట్‌లో సమస్యను లేవనెత్తుతానని, సాను కూలంగా పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# కార్మికవర్గ ప్రయోజనాలను బలి చేయడమే లక్ష్యమా!




జి.వెంకటేశ్వరరావు
జిల్లా కార్యదర్శి, గుంటూరు

ప్రస్తుతం అమలులో ఉన్న 29 కార్మిక చట్టాల స్థానే కేంద్ర ప్రభుత్వం కొత్తగా నాలుగు కార్మిక చట్టాలను 2025 నవంబర్ నుండి అమలులోకి తెచ్చింది. ఈ చట్టాలు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కార్మికులకు అత్యంత మేలు చేసే కార్మిక అనుకూల సంస్కరణలుగా ప్రచారం చేసింది. ప్రస్తుత కార్మిక చట్టాలలో ఉన్న సంక్లిష్టతను తొలగిస్తూ సులభతరం చేయడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి, సామాజిక భద్రతను విస్తృతంగా అందించడానికి ఈ లేబర్ కోడ్‌లను తీసుకొచ్చామని అధికార పార్టీ నేతలు ఊదరగొడుతున్నారు.

అయితే చట్టాల సరళతరం పేరుతో తీసుకువచ్చిన ఈ కోడ్‌లు ఏళ్ళ తరబడి దేశంలోని రెక్కాడితేగాని డొక్కాడని కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నాయి. ఉద్యోగ భద్రతను గాలిలో దీపంలా నిలబెడుతున్నాయి. కార్మిక సంఘాలను బలహీన పరిచేలా, అసంఘటిత రంగ కార్మికుల సంఖ్యను మరింత పెంచేలాగా ఉపయోగ పడుతున్నాయి. ఆంగ్లేయుల పాలనలో, స్వాతంత్ర్యానంతర తొలిదశలో తీసుకువచ్చిన పాత చట్టాల స్థానంలో ప్రస్తుతం మార్పులకు అనుగుణంగా కార్మిక చట్టాలను నవీనకరించటంగా పాలకులు ప్రచారం చేస్తున్నారు కానీ వాస్తవంలో ఈ మార్పులు పెట్టుబడికి మరియు శ్రమకి మధ్య సమతూకం పాటించలేదు. పెట్టుబడి వైపు ఒరిగాయి అని స్పష్టమవుతుంది.

### ప్రమాదంలో ఉద్యోగ భద్రత

కంపెనీలకు పారిశ్రామిక అధిపతిలకు కార్మికుల నియామకాలను మరియు తొలగింపులను ఇవి సులభతరం చేస్తున్నాయి పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో ఇప్పటివరకు "లేఆఫ్" ప్రకటించడానికి వందమంది కార్మికులున్న పరిశ్రమలకు ప్రభుత్వ అనుమతి అవసరం. కాని, ఈ పరిమితిని ఇప్పుడు 300మంది కార్మికులకు పెంచడం ద్వారా కోట్లాది కార్మికులు సామాజిక రక్షణకు దూరమయ్యారు.

అనేక రంగాలలో పరిమితకాల నియామకాలను ఈ కోడ్‌లు అనుమతిస్తాయి. అంటే శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల నియామకాలను నిరుత్సాహపరిచి, కార్మికుల ఉద్యోగ భద్రతను గాలికి వదిలేస్తాయి. ఇది కోట్లమంది కార్మికుల ఉద్యోగ భద్రతను నిర్వీర్యం చేస్తుంది. నిరంతరం భయంతో, బానిసలాగా పనిచేయాల్సిన పరిస్థితులలోకి కార్మికులను నెట్టేస్తుంది. నాణ్యమైన శాశ్వత ఉద్యోగ నియామకాల స్థానంలో ఎటువంటి నిబంధనలు, ఉద్యోగ భద్రత లేని పొరుగు సేవల నియామకాలను మరింత వేగవంతం చేస్తుంది.

### సంఘాల హక్కులపై ఆంక్షలు

కార్మికులు వారి న్యాయమైన కోరికల కోసం అనేక రకాల ప్రయత్నాలు చేసిన తర్వాత చిట్టచివరి ఆయుధంగా సమ్మెను ప్రయోగిస్తారు. తద్వారా వారి హక్కులను కాపాడుకునే ప్రయత్నం చేస్తారు. అటువంటి బలమైన ఆయుధాన్ని కార్మికుల చేతి నుండి దూరం చేయడమే లక్ష్యంగా ఈ చట్టాలు రూపొందించబడ్డాయి. ఉదా:కు, నోటీసు ఇచ్చిన 14 రోజులకు తర్వాత మాత్రమే సమ్మెకు వెళ్లాలి అనేది పాత కార్మిక చట్టాల నిబంధన. కాని, కొత్త చట్టాల ప్రకారం కార్మికుల డిమాండ్లపై కోర్టుకేసు ఉంటే సమ్మెకు వెళ్లడాన్ని నిరాకరించవచ్చు. కాబట్టి ఈ పేరుతో యాజమాన్యాలు కోర్టులను ఉపయోగించి సమ్మె హక్కును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తాయి. 50%మందిపైగా కార్మికులు పాల్గొంటేనే దానిని సమ్మెగా పరిగణిస్తామని, పునఃనిర్వచించడం ద్వారా కార్మికులను జాతీయ స్థాయి సార్వత్రిక సమ్మెలో పాల్గొనకుండా నిరోధించే ప్రయత్నం చేసారు. అలాగే ఇతర వర్గాల వారు సమ్మెకు మద్దతుగా పాల్గొనకుండా ఈ చట్టాలు నిలుపుదల చేస్తాయి. ఫలితంగా సమ్మెహక్కు అనే కార్మికుల బలమైన ఆయుధం. యజమానుల చేతిలో కీలుబొమ్మగా మారిపోనుంది. కార్మికులు బేరం ఆడే శక్తిని నిర్వీర్యం చేసి, వారిని కట్టు బానిసలుగా మార్చే ప్రమాదం ఉంది.

1926 సంవత్సరం నుండి 7మంది, అంతకంటే ఎక్కువ కార్మికులు కలిసి సంఘాలను ఏర్పాటు చేసుకునే అవకాశం పాత చట్టాలలో ఉండగా, ఈ కొత్త చట్టాలలో 100మంది కార్మికులు లేదా ఒక పరిశ్రమంలోని మొత్తం కార్మికులలో 10%మంది కార్మికులు మాత్రమే కార్మిక సంఘం ఏర్పాటు చేసుకోవచ్చునని పేర్కొనడం ద్వారా భవిష్యత్‌లో కార్మిక సంఘాల ఏర్పాటును కూడా కఠినతరం చేసారు.

### హక్కులు నిరాకరిస్తూ గిగ్, వలస కార్మికుల గుర్తింపు

అసంఘటితరంగ కార్మికులు, గిగ్ కార్మికులకు గుర్తింపు ఇవ్వడం ద్వారా వారిని ఉద్యోగ భద్రత అనే రక్షణ పరిధిలోకి తీసుకురావడం చారిత్రాత్మక నిర్ణయంగా పాలకులు చేస్తున్న ప్రచారం ఒక బూటకం. వాస్తవానికి గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత పథకాలకు, పెన్షన్లకు, ఆరోగ్య పథకాలకు యజమాని నుండి ఎటువంటి చెల్లింపు లేకుండా వర్తింప చేయడం అంటే ఈ చట్టాలు పేరుకే రక్షణ తప్ప కార్మికులకు వాస్తవ రక్షణ ఉండదు.

### మహిళా కార్మికుల సమానత్వం

మహిళా కార్మికులు రాత్రి సమయంలో పని చేయడాన్ని ఈ చట్టాలు చట్టబద్ధం చేస్తున్నాయి. సమాన పనికి సమాన వేతనం, పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన హోదా అంటూ చేస్తున్న ప్రచారం కూడా బూటకంగా మారనుంది. సరైన రక్షణ చర్యలు, రవాణా సదుపాయాలు, గ్రీవెన్స్ యంత్రాంగాలను ఏర్పరచకుండా దీనిని అమలు చేయడం అంటే మహిళలను మరింత ప్రమాదంలోకి నెట్టడమే అవుతుంది.

### పారిశ్రామికవేత్తల అనుకూల ప్రచారాలు

అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఈ చట్టాలను అత్యంత అనుకూల సంస్కరణలుగా ఆకాశానికెత్తుతుంటే, దేశ సంపదకు సృష్టికర్తలైన కోట్లాది కార్మికులు, వారి ప్రతినిధి సంఘాలు ఈ చట్టాలను కార్మిక వ్యతిరేక చట్టాలుగా పేర్కొంటున్నాయి. వీటిని రద్దు చేయాలని, వీధిపోరాటాలు చేస్తున్నాయి అంటేనే ఇవి ఎవరి ప్రయోజనం కోసమో స్పష్టమవుతుంది. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" పేరుతో కార్మికుల ఈజ్ ఆఫ్ లివింగ్‌ని బలిపెట్టడం ద్వారా ఈ పాలకులు సంపద సృష్టికర్తలైనా కోట్లాదిమంది కార్మికులను పెట్టుబడి దారులకు వదిలేశారు.

1920 నుండి దేశంలోని కార్మికులు ఐక్యంగా వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. కొత్త చట్టాలను క్షుణంగా పరిశీలిస్తే అవి కార్మికుల వ్యతిరేక చట్టాలుగా గోచరిస్తాయి. రైతువ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ వీధులలో కోట్లాది వాటిని రైతు సంఘాలు రద్దు చేయించుకున్నాయి. ఆ స్ఫూర్తితోనే కార్మిక సంఘాలు కూడా ఈ నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయించేవరకు పోరాటం సాగించాలి. అప్పుడే కార్మికుల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది.

# ఆర్థిక సమస్యలపై యుటియఫ్ రణభేరి 2.0



ప్రభుత్వ తీరుపట్ల ఉపాధ్యాయుల్లో నానాటికీ పెరుగుతున్న అసంతృప్తి ఫిబ్రవరి 17న యుటియఫ్ చేపట్టిన "రణభేరి 2.0" కార్యక్రమంలో ప్రతిబింబించింది. ఒకవైపు విద్యాశాఖ అధికారుల వైఖరితో సతమతమవుతూ, సకాలంలో ఆర్థిక ప్రయోజనాలు అందక విసిగివేసారుతున్న ఉపాధ్యాయలోకం పోరాటబాట పట్టింది. అగ్ని పర్వతం ప్రేలినప్పుడు వెదజల్లే "లావా"లా విజయవాడ పురవీధులు జనసంద్రమయ్యాయి.

"12వ పిఆర్‌సి చైర్మన్‌ను నియమించాలి. 29% ఐ.ఆర్. ప్రకటించాలి, పెండింగ్ డిఏలు విడుదల చేయాలి. బకాయిల చెల్లింపుకు రూట్ మ్యాప్ ప్రకటించాలి. సిపిఎస్ రద్దు చేయాలి. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి. మెడికల్ రీయింబర్స్‌మెంట్, హెల్త్‌కార్డుల సమస్యలు పరిష్కరించాలి" మొ॥ ఆర్థిక సమస్యల పరిష్కారానికి యుటియఫ్ దశలవారీ పోరాటానికి పిలుపునిచ్చింది.

**పోస్ట్‌కార్డు క్యాంపెయిన్ :**




రణభేరి 2.0 పోరాట కార్యాచరణలో భాగంగా ఆర్థిక సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన పోస్టు కార్డు క్యాంపెయిన్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. దాదాపు లక్షమంది ఉపాధ్యా యులు పోస్టుకార్డు ద్వారా ముఖ్యమంత్రికి ఉత్తరాలు వ్రాసారు.

**వినతి పత్రాలు :**




12వ పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు, బకాయిల చెల్లింపుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరపాలని మంత్రులకు; ఆర్థిక డిమాండ్ల పరిష్కారానికి నిధులు కేటాయింపుపై బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందివ్వాలని నిర్ణయించిన కార్యాచరణ సైతం విజయవంతం అయింది. 17మంది మంత్రులు, 112మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జిల్లా నాయకత్వాలు వినతిపత్రాలు అందివ్వడమే కాక సకాలంలో ఆర్థిక ప్రయోజనాలు పొందడంలో ఎదురవుతున్న సమస్యలు, ప్రభుత్వ వైఖరి వారికి స్పష్టంగా వివరించారు. బడ్జెట్ సమావేశాల సందర్భం గా తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని, ప్రభుత్వంవైపు నుండి తగు స్పందన వచ్చేలా చూడాలని కోరారు.

**ఛలో విజయవాడ కార్యక్రమం :**

12వ పిఆర్‌సి ఏర్పాటు, బకాయిల చెల్లింపు, ఇతర ఆర్థిక సమస్యల పరిష్కారానికి తగిన కేటాయింపులు బడ్జెట్‌లో కానరావక పోవడంతో యుటియఫ్ ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపు ఇచ్చింది. వేలాదిమంది కార్యకర్తలు,ఉపాధ్యాయులు యుటియఫ్ జండాలు, ప్లకార్డులు చేతబట్టి విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌ను ముంచెత్తారు. మునుపెన్నడూ కానరాని రీతిలో అలంకార్ సెంటర్ యావత్తు ఉపాధ్యా యులతో నిండిపోయింది.

**ఉత్తేజపూరిత ప్రసంగాలు**



ధర్నాకు అధ్యక్షత వహించిన యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "శాసన సభలో చర్చించవలసింది బిల్‌గేట్స్ గురించో, ఆదానీ గురించో కాదు ప్రజల గురించి మాట్లాడాలి. ప్రజా సమస్యల గురించి మాట్లాడాలి. లేదంటే సమాజ ప్రగతిలో కీలక భూమిక పోషించే ఉద్యోగ, ఉపాధ్యా యుల గురించి, మాకు రావలసిన పిఆర్‌సి, డిఏలు, చెల్లించాల్సిన బకాయిల గురించి మాట్లాడాలి. "మేము బడిలో ఉంటే భవిష్యత్ తరాన్ని తయారుచేసే ఉపాధ్యా యులం. రోడ్డు మీదకు వస్తే హక్కుల కోసం రణభేరి మ్రోగించే ఉద్యమ కారులం... మాకు అరెస్టులంటే భయం లేదు. భయం లేని భావితరాన్ని తయారు చేసే వాళ్ళం.. పిఆర్‌సి కమిటీ చైర్మన్‌ను నియమించేవరకు ఈ పోరు ఆగదు..." అంటూ చేసిన

ఉద్వేగ భరిత ప్రసంగం వేలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. “12వ పిఆర్‌సి కమీషన్ వేయాలి. 29% ఐ.ఆర్. ప్రకటించాలి” నినాదాలతో సభాప్రాంగణం హోరెత్తింది.



తూర్పు-పశ్చిమగోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి “ఉద్యోగ, ఉపాధ్యాయులు కూటమికి దన్నుగా ఓట్లువేసి గెలిపించడం, మా కడుపు సంతోషంతో నిండిపోయింది. అధికారం చేపట్టిన వెంటనే వారి సమస్యలు తీర్చేస్తాం. మంచి పిఆర్‌సి ఇస్తాం... ఐ.ఆర్. ఇస్తాం.. డిఏలు, పాత బకాయిలు చెల్లిస్తాం...” అని చెప్పారు. 20 నెలలు గడచినా తన వాగ్దానాన్ని నెరవేర్చలేదు. గత ప్రభుత్వం రివర్స్ పిఆర్‌సి అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని తుంగలో తొక్కినందుకే వారిని ఇంటికి సాగనంపారని, ఈ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తే ఈ ప్రభుత్వాన్ని కూడా సాగనంపుతారని హెచ్చరించారు.

ఉద్యోగులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలన్నీ ప్రభుత్వం చెల్లించేవరకు శాసనమండలిలో తన గళం వినిపిస్తూనే ఉంటానని చెప్పారు.



పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ మూడు లక్షల ముఫైరెండు వేలకోట్ల రూపాయాలతో అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయు, పెన్షనర్లకు సంబంధించి ఎలాంటి కేటాయింపులు జరుపక పోవడం బాధాకర మన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు మధ్య ఓట్ల వ్యత్యాసం 8% మాత్రమేనని, ఆ 8% ఓట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులవేనని ప్రభుత్వం మరువరాదన్నారు.

ప్రభుత్వం 12వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని, బకాయిల చెల్లింపుకు రోడ్‌మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేసారు. కరోనా సందర్భంగా చనిపోయిన 953మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలను కారుణ్య నియామకాలు కల్పించి ఆదుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సమస్యను పరిష్కరించేందుకు విద్యాశాఖ మంత్రి కృషి చేయాలని కోరారు.



పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రివర్స్ పిఆర్‌సి ప్రకటించి పిఆర్‌సి, డిఏ అరియర్లు చెల్లించ కుండా బకాయిలు పెట్టిందని, 12వ పిఆర్‌సి నియామకం పేరుతో ఉత్తుత్తి జీఓలు ఇచ్చి ఉద్యోగులను మోసం చేసిందని అన్నారు. అంతేకాక అడుగడుగునా నిర్బంధాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్వేచ్ఛ లేకుండా చేసిందన్నారు. అయితే గత ప్రభుత్వాన్ని ఓడించినందు ఆనంద పడాలా? లేక ప్రస్తుత ప్రభుత్వాన్ని గెలిపించినందుకు సిగ్గుపడాలా? తెలియకుండా ఉందని, ఈ ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులకు వ్యతిరేకంగానే వ్యవహరిస్తోందని అన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల దగ్గరే నిర్బంధిస్తే, ఈ ప్రభుత్వం ఇక్కడి వరకు రావడానికి అనుమతించిందని, రెండు ప్రభుత్వాలకు ఇదొక్కటే తేడా అని విమర్శించారు.

బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యా యులకు తగిన కేటాయింపులు చేయకపోతే అలంకార్ థియేటర్ వరకు వచ్చిన వారికి, అసెంబ్లీ దాకా రావడం పెద్ద కష్టమేమీ కాదు అని హెచ్చరించారు.



ఏపి జెఏసి చైర్మన్ ఎ.విద్యా సాగర్ మాట్లాడుతూ కొత్త పిఆర్‌సి కమీషన్ నియామకం, రావలసిన ఆర్థిక బకాయిలకోసం ఏపిజెఏసి నిర్మాణాత్మకంగా అడుగులు వేస్తోం దని పేర్కొన్నారు. 12వ పిఆర్‌సి సాధన కోసం రణభేరితో యుటియఫ్ “తొలి కూత” కూసిందని, దాని కొనసాగింపుగా మలి కూత జెఏసి కుస్తుందని పేర్కొన్నారు.

12 లక్షలమంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రాతినిధ్యం వహించే జెఏసి నిర్మాణాత్మక నిర్ణయాలు తీసుకుంటుందని, ప్రభుత్వం ఆర్థిక డిమాండ్లు పరిష్కరించకుంటే మరో బిఆర్‌టిఎస్ ఉద్యమానికి సైతం వెనుకాడ బోమని ఉద్ఘాటించారు.



రాష్ట్ర యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై లక్ష ఉత్తరాలు రాసినా? వందమంది ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతర ప్రజా ప్రతినిధులను కలిసి వివరించినా రాష్ట్ర ప్రభుత్వం మన సమస్యల పట్ల నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అందుకే రణభేరి 2.0 మ్రోగించటం అనివార్యమైందని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో సమస్యల పట్ల రగులుతున్న అశాంతిని ప్రభుత్వం గుర్తించకుంటే ఉద్యమం ఉధృతి పరవళ్ళు తొక్కి అసెంబ్లీని తాకుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రతిసారి ప్రభుత్వాలు ఆలస్యంగా పిఆర్‌సిని అమలు చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. కాని ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన అంశాలకు చివరి ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఉన్న కేంద్ర ప్రభుత్వం కూడా 2026 జనవరికి ఎనిమిదో పిఆర్‌సిని అమలు చేయవలసి ఉండగా ఆలస్యంగా పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి ఆది 2027 తర్వాత అమలు చేయడానికి వ్యూహాలు చేస్తుందన్నారు. దీని కారణం 2029లో జెమినీ ఎన్నికల రావటమే. జెమిలి ఎన్నికల ముందు పిఆర్‌సి ఇస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆ ప్రభుత్వాలకు అనుకూలంగా ఉంటారనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచన. కేంద్ర ప్రభుత్వంతో జతకట్టిన మన ప్రభుత్వం కూడా అదే ఆలోచనలో ఉండి పిఆర్‌సి ఆలస్యం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని అన్నారు.

పిఆర్‌సిని అలా 2029 వరకు సాగదీస్తే! వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని కూడా తప్పనిసరిగా ఇంటికి సాగనంపు తామని ప్రసాద్ హెచ్చరించారు.

ముఖ్యమంత్రి ఇటీవల ఉద్యోగ ప్రతినిధులతో మాట్లాడుతూ పిఆర్‌సి కమిషన్ వేయడం పెద్ద పని కాదని, ఐఆర్ ఇవ్వాలంటే ప్రభుత్వం దగ్గర సొమ్ములు లేవని సంపద సృష్టించే పనిలో ఉన్నామని, ఆ తర్వాత పిఆర్‌సి ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ఆదాయం పెరిగినట్టు అసెంబ్లీలో బడ్జెట్ లెక్కలు చూపించారని అంటే ప్రభుత్వం ఆర్థికంగా అంత ఇబ్బందుల్లో లేదని, కావాలనే ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను ఆలస్యం చేస్తోందని, జాప్యం జరిగేకొద్ది ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అసంతృప్తి పెరిగితే ప్రభుత్వం తట్టుకోలేదని ఆయన ఉద్ఘాటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి "ప్రభుత్వం మా దగ్గరికి "వస్తుందా? లేక మమ్మల్నే రమ్మంటారా?" అంటూ ప్రశ్నించారు. నిరసనకు వేలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయులంతా ఒక్కసారిగా లేచి పిడికిళ్ళు బిగించి, జెండాలెత్తి "రమ్మంటారా!? మీరొస్తారా?" అంటూ నినాదాలు పలికారు.

ప్రభుత్వం నుంచి సరైన సమాధానం వచ్చేంతవరకు ఈ ఉద్యమం కొనసాగించాలని నిర్ణయించడంతో సాయంత్రం 4 గంటల వరకు ధర్నా శిబిరం నిర్వహించారు. అయితే అసెంబ్లీలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకంటే కల్తీ లడ్డు వ్యవహారంపై చర్చకు ప్రాధాన్యమివ్వడంతో ప్రభుత్వ స్పందన తెలియరాలేదు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలలోపు 12వ పిఆర్‌సి కమీషనర్‌ను ప్రకటించకుంటే త్వరలోనే సెక్రటేరియట్ ముట్టడికి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.


ఫారం IV

**ఐక్యఉపాధ్యాయ**

**యాజమాన్యం, తదితర వివరాలు స్టేట్‌మెంట్**

| | | |
|---|---|---|
| ప్రచురణ స్థలం | : | విజయవాడ |
| ప్రచురణ కాలం | : | మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | : | కె.ఎస్.ఎస్.ప్రసాద్ |
| జాతీయత | : | భారతీయుడు |
| చిరునామా | : | 27-31-11, చెన్నుపాటి భవన్<br>పాలపర్తివారి వీధి<br>రాఘవయ్యపార్క్ దగ్గర,గవర్నపేట<br>విజయవాడ-520002 |
| ప్రచురణకర్త | : | కె.ఎస్.ఎస్.ప్రసాద్ |
| జాతీయత | : | భారతీయుడు |
| చిరునామా | : | పైన తెలిపినదే |
| సంపాదకుడు | : | కె.సురేష్ కుమార్ |
| చిరునామా | : | పైన తెలిపినదే |
| యాజమాన్యం | : | పత్రిక ఆస్తులన్నీ ఆంధ్రప్రదేశ్<br>ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్<br>రాష్ట్ర కమిటీకి చెందినవి. |

కె.ఎస్.ఎస్.ప్రసాద్ అను నేను పైన ప్రకటించిన వివరములు యదార్థములని పేర్కొనుచున్నాను.

(సం॥) కె.ఎస్.ఎస్.ప్రసాద్
ప్రచురణకర్త


# అపురూపిణి




మండు వేసవిలో
మిట్ట మధ్యాహ్నం
ఎర్రటి నిప్పుల్ని
కాగుతోందామె
ఇంట్లోవాళ్ల కడుపు నింపే
వంటింటి పనిలో...
పురుడు ప్రాణ సంకటమని
తెలిసి కూడా
కన్నీళ్లు దిగమింగుకుంటూ
బిడ్డల్ని కంటోందామె
భావితరాల కోసం...
ఏం మాత్రం
ఏవగింపు లేకుండా
ఇంటి మురుగుని
బిడ్డల మరుగుని
కనుమరుగు చేస్తోందామె
ఇంటిళ్ళపాదికి
పారిశుధ్య సేవకియై!
తన అస్తిత్వాన్ని కోల్పోయి
కన్న వాళ్ళ దగ్గర కొన్నాళ్ళు
కట్టుకున్న వాడి దగ్గర ఇంకొన్నాళ్ళు
కాలాన్ని ముక్కలు చేసుకుని
గడుపుతోంది!
పుట్టుక నుంచి
సాగిపోయే వరకూ
ఆధిపత్య ప్రపంచం
రచించిన పాత్రల్లో
ఒదిగిపోవటం తప్ప
తనంటూ
స్వేచ్ఛా జీవితమెక్కడుంది?
ఆ అవిశ్రాంతి శ్రమకి
ఖరీదు కట్టే తాహత మనకుందా?!
ఆ నిస్వార్థ త్యాగాన్ని
కొలిచే సాధనం మన దగ్గరుందా?!
ఆమె అనంత ప్రేమను వల్లించే
భాష మనతెలుసా?!
ఆమె లేకపోతే సృష్టే శూన్యం
బతుకులే కళావిహీనం
చెల్లైనా?! తల్లైనా?!
అవ్వైనా?! అత్తైనా?!
శ్రీమతైనా?! స్నేహితురాలైనా?!
బంధమేదైనా
అనుబంధమేమైనా
ఆమెను గౌరవిద్దాం
ఆమెను మురిపిద్దాం
ఆమె అపురూపతని నిలబెడదాం!



చిలుకూరి శ్రీనివాసరావు
ఐక్యఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు

(మహిళా దినోత్సవం సందర్భంగా)




సంపూర్ణ మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు, నిష్పక్షికమైన, న్యాయబద్ధమైన సమాజాన్ని స్థాపించేందుకు,జాతీయ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు "విద్యే మౌలికమైనది" తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్ రూపుదిద్దుకుంటుంది. "భారత విద్యావేత్త, మాజీ రాష్ట్రపతి ఏ.పి.జె. అబ్దుల్ కలాం పేర్కొన్నట్లు" భారత యువతలో ప్రతి ఒక్కరికీ ప్రపంచస్థాయి విద్య లేదా ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందాలి. ఆ లక్ష్యానికిమొదటి అడుగు ప్రాథమిక విద్యే". ఇదే వాస్తవాన్ని అనేకమంది ప్రముఖ విద్యా తత్వవేత్తలు స్పష్టంగా ప్రవచించారు. అందుకే 6సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు, విద్యా సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం కృషి చేయాలని రాజ్యాంగంలోని 45వ అధికరణ చెబుతోంది.



కె.ప్రమీలరాణి
జెపిహెచ్ఎస్, వీరఘట్టం

**విద్యా దృక్పథం:**

భారత దేశాన్ని నిలకడగా ఒక సమాన శక్తి వంతమైన విజ్ఞాన వ్యవస్థగా మార్చేందుకు,భారతీయ విలువలను మౌలిక నీతి ప్రతిబింబించేందుకు విద్యావ్యవస్థ రూపొందించాలని భారతీయ విద్యా విధానం యొక్క ప్రాథమిక లక్షణం. అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తూ భారత దేశాన్ని ప్రపంచ విజ్ఞాన మహాశక్తిగా తయారు చేయడమే దీని ముఖ్య లక్ష్యం. మానవ హక్కులు,నిలకడతో కూడిన ప్రగతి, బాధ్యతాయుతమైన అంకిత భావాన్ని పెంపొందించి తద్వారా విద్యార్థులను నిజమైన ప్రపంచ పౌరులుగా తయారు చేయాలన్నదే విద్యా విధానపు దృక్పథం.



**పాఠశాల నేర్చుకొనే పరిస్థితులు:**

కొన్ని నివేదికల ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో కన్న ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లలు, ఒక్క చదువులోనే కాకున్నా అన్ని రంగాల్లో కూడా దృఢంగా ఉంటూ జీవితంలో ఎదురయ్యే ఆటు పోటులను ఎదుర్కొనే సామర్థ్యాలను కల్గి ఉంటున్నారు. వారు బట్టీ విధానంలో కాకుండా స్వేచ్ఛా వాతావరణంలో భయం లేని చదువులు అభ్యసిస్తున్నారు. వ్యక్తిత్వ పరంగా సొంతంగా నేర్చుకుంటూ భావోద్రేకాలను నియంత్రించుకోవడంలో కృతజ్ఞులుగా ఉంటున్నారు.

ఐతే ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మొదలగు అన్ని సౌకర్యాలు ఉన్నా విద్యార్థులు చదువుకోవడంలో వైఫల్యం చెందుతున్నారని గణాంకాలు చూపుతున్నాయి. 5వ తరగతి చదువుతున్న పిల్లలు చాలా మందికి 2వ తరగతి స్థాయి పఠన, గణిత నైపుణ్యాలు కూడా ఉండటం లేదన్నది చేదు నిజం. దీనికి కారణం విద్యావ్యవస్థ వైఫల్యమా? అమలులో లోపమా? ప్రభుత్వ విధానాలా?

**వైఫల్య కారణాలు:**

ఏళ్ళతరబడి మన విద్యావ్యవస్థ కంఠస్థ పద్ధతినే ప్రోత్సహించడం, పరీక్షలే లక్ష్యంగా బోధన, మార్కులు ప్రతిభకు కొలమానాలుగా చూపే విధానాలు, అన్నిటికన్నా ముఖ్యంగా మాతృభాషలో బోధనను పూర్తిగా తుడిచిపెట్టే ప్రభుత్వ విధానాలు.లౌకికవాదం, ప్రజాస్వామ్యం అన్నిటికీ భారతీయ విలువలే రక్షాకవచం. ఈ సాంప్రదాయ విలువలు తరతరాలకు అందించాలంటే మాతృభాషలో విద్య తప్పనిసరి. "ఆంగ్లం కోసం పోటీపడుతూ స్థానిక భాషలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం "అనే మేధావుల సూచనలు పెడచెవిన పెడుతూ, ప్రాథమిక స్థాయిలో ఆంగ్లమాధ్యమం ప్రవేశ పెట్టడం అమానుషం.ఆటపాటలు, అభ్యాసనా కార్యకలాపాలు, కథలు, పాఠ్య విషయాలకు ప్రాధాన్యత లేని పాఠ్యపుస్తకాలు, పాఠ్య ప్రణాళికలు, తల్లికివందనం లాంటి పథకాలు ప్రాథమిక విద్యను తూట్లుపొడుస్తున్నాయి.

ఒత్తిడి గురిచేసే సమయపట్టికలు పిల్లల శారీరక, మానసిక అవసరాలకు అనుగుణంగానే ఉన్నాయా?? అన్నదానికి నిజాయితీగా సమాధానం చెప్పుకోవలసి ఉంది. ప్రాథమిక విద్య చదువుతున్న చిన్నపిల్లలను 5 గంటలకు పైగా నిరంతరం తరగతి గదుల్లో కూర్చోబెట్టడం ఎంత వరకు సమంజసం?? పట్టణీకరణ, చిన్న కుటుంబాలు, ఉచితపథకాలు ప్రాథమిక విద్యార్థుల ప్రవేశాలను నిర్వీర్యం చేస్తున్నాయి.

**ఉపాధ్యాయుని పాత్ర:**

విద్యావ్యవస్థ మౌలిక సంస్కరణలలో ఉపాధ్యాయుడు తప్పని సరిగా కేంద్ర బిందువుగా ఉండాలి. ఎంత మంచి విద్యా విధానం ఉన్నా, దాన్ని తరగతి గదుల్లో అమలు చేసేవారు ఉపాధ్యాయులే. ఉపాధ్యాయుడు కేవలం బోధకుడు మాత్రమే కాదు మార్గదర్శి. ఇంతటి ప్రాధాన్యత గల ఉపాధ్యాయుని పాత్రను నేడు బోధనలోనూ, విద్యార్థితో గడిపే సమయాన్ని కుదిస్తూ, రకరకాల యాపులతో గుమస్తా పనులతో ఉక్కిరిబిక్కిరికి గురిచేస్తున్న విధానాలు అమలు చేస్తున్నారు.ఉపాధ్యాయుని శక్తిమంతుడిగా తీర్చిదిద్దకుండా విద్యా వ్యవస్థను ప్రభావశీలంగా మార్చలేము. ప్రాథమిక స్థాయిలో పరీక్షలు విద్యార్థులలో భయాన్ని పెంచుతాయి. వారు ఎంత నేర్చుకున్నారు, ఏది గుర్తుపెట్టుకోగలరు అన్నవి ఉపా ధ్యాయుడు మాత్రమే నిరంతర మూల్యాంకనం ద్వారా గ్రహించగలడు.

భారత దేశం నిజంగా అభివృద్ధి చెందాలంటే ముందుగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలి. దీనికి ఒక బాధ్యతాయుత సంఘంగా "ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్" చేపడుతున్న "ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం. మన ఊరి బడిని కాపాడుకుందాం" దోహదపడేదే. ప్రాథమిక పాఠశాలలను ఆనంద భరిత అభ్యాసనా కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రణాళికలు చేపట్టాలి. దీనికోసం విద్యావేత్తల సూచనలు దిశానిర్దేశాలుగా అమలు చేయాలి. ప్రాథమిక విద్య పటిష్టమైనప్పుడే విద్యా వ్యవస్థ తద్వారా దేశభవిష్యత్తు మారుతుంది.

## ఉద్యోగుల ప్రయోజనాలు కాలరాసే దిశగా...

# 8వ కేంద్ర వేతన సవరణ ప్రశ్నావళి

వేదవ్యాసుడు పద్దెనిమిది పర్వాలుగా రచించిన మహాభారతం పద్దెనిమిది రోజుల కురుక్షేత్ర సంగ్రామం అనంతరం ముగిసిందనే చారిత్రక ఇతివృత్తాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారు కాబోలు! ఉద్యోగులు, కార్మిక సంఘాల ముందు ఎనిమిదవ వేతన సంఘం అధికారులు పద్దెనిమిది ప్రశ్నలతో సుదీర్ఘ ప్రశ్నావళిని ఆన్‌లైన్‌లో, ఇంగ్లీష్‌లో, అందుబాటులో ఉంచారు.

ప్రశ్నావళిపై స్పందనలు మార్చి పదహారులోగా ఇవ్వాలని గడువు విధించారు. ఆ ప్రశ్నలు పరిశీలిస్తే వాటి వెనక ఇన్ని కుతంత్రాలు న్నాయా? అని దిమ్మ తిరగటం ఖాయం.




“ఆకలి తీరేలా, నాలుగు నూకలు పెంచండి” అని ఇంటి పనివాళ్లు అడిగితే, దేశంలో వరదలొస్తున్నాయి, ప్రజలంతా కష్టాల్లో ఉన్నారు. పండిన పంటంతా ప్రభుత్వ ఖజానాకు చేర్చే పనిలో కష్టపడుతున్నాం, రోగాలతో ప్రజలు బాధపడుతున్నారు, వారి జబ్బుల్ని నయం చేయడానికి ఆసుపత్రులు కరువవుతున్నాయి. ఏ మాత్రం సత్తువ లేని మనుషులంతా విలవిల్లాడుతుంటే మీకు ఆకలి తీర్చడం ఎంత వరకు సబబు, ఆలోచించు” అని సమాధానమిస్తే అడిగిన వారి పరిస్థితి ఏమిటి?

ఎనిమిదవ వేతన సంఘం ద్వారా వెంటనే వేతనసవరణ జరిపించండని కోరుతున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. వారికి ఇచ్చిన 18 ప్రశ్నలు వారు ఇచ్చే సమాధానాల కోసం ఇచ్చినవి కావు. కేంద్ర ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలకు ఉద్యోగులను సంసిద్ధపరచటానికి ఒక ముందస్తు తంతు మాత్రమే. ఈ ప్రశ్నల ద్వారా ఉద్యోగులు తమ కన్ను తామే పొడుచు కునేలా, ప్రజలు ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ద్వేషాన్ని పెంచుకునేలా కేంద్ర పెద్దలు ప్రయత్నం చేస్తున్నారు.

### 18 ప్రశ్నల సారాంశమిదీ...

‘వేతన సవరణ ద్వారా దేశంలోని యాభై లక్షల మంది కొనుగోలు శక్తి పెరుగుతుంది, తద్వారా అనేక రంగాల వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది, నగదు సర్క్యులేషన్ పెరుగుతుంది, ఆర్థిక వ్యవస్థలో మంచి కదలిక వస్తుంది’ అంటూనే వేతన సవరణ కోరే వారి నోటికి తాళం వేసేలా..

వేతన సిఫారసు “గైడింగ్ ప్రిన్సిపల్”గా ఎలా ఉండాలో చెప్పండి, ఆ ప్రిన్సిపల్ ద్వారా దేశానికి లాభం జరగాలి అంటూ ప్రశ్నించారు. ఉద్యోగుల వేతనాలకు దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష సంబంధం ఉంటుందా? ఒకవేళ ఉన్నా అది పూర్తిగా పరిపాలనకు బాధ్యత వహిస్తామని ఎన్నికల ద్వారా గెలిచిన పార్టీ బాధ్యత కదా. వేతన సవరణకు గైడింగ్ ప్రిన్సిపల్ అనేది ఉండడమంటే వేతనాల పెరుగుదలలో నియంత్రణ పాటించడమేగా!

వేతనాల్లో యేటా ఇంక్రిమెంట్లు ఉండటం అవసరమా? ఎందుకంటే ఫిక్స్‌డ్‌టర్మ్, ఫ్లెక్సీటర్మ్ అనే కొత్త కాన్సెప్టులు ముందుకొచ్చాయి కాబట్టి, ఈ ఇంక్రిమెంట్లపై, నిర్దిష్ట వ్యవధిపై తగు సూచనలు ఇవ్వండి అన్నది మరో ప్రశ్న. దానిలోనే ఇంక్రిమెంట్లు ఏటేటా కాకుండా అధికారులకు నచ్చినప్పుడు గాని లేదా పని విధానాన్ని సమీక్షించినప్పుడు గాని ఉంటే ఎలా ఉంటుంది అని ప్రశ్నించారు. ఇక్కడ స్పష్టమయ్యేది ఏమిటంటే ఇకముందు పర్మనెంట్ ఎంప్లాయ్‌మెంట్ ఉండదు, నిర్దిష్ట కాలానికి లేదా అవసరమైన కాలానికి ఇష్టమొచ్చిన పనిని చేయించుకునే అవకాశముండే ఫిక్స్‌డ్‌టర్మ్, ఫ్లెక్సీటర్మ్ లాంటివన్నీ అమలు జరిపితే అప్పుడు ఇంక్రిమెంట్లు ఏటేటా ఇచ్చే అవసరం రాదు. అందుకని, ఇప్పుడే ఇంక్రిమెంట్లపై వాటి వ్యవధిపై అభిప్రాయాలు సేకరిస్తున్నారన్నమాట.

“బోనస్ చెల్లింపులు ఏ విధంగా ఉండాలి, అనగా పూర్తిగా ప్రొడక్టివిటీకి లింక్ చేసి ఉండాలా లేక సెక్టర్ వైజ్ ఉండాలా లేదా సంబంధిత క్యాడర్‌ను బట్టి ఉండాలా”అన్న ప్రశ్న మీమాంసకు వదిలేశారు.

జీతాలపెరుగుదల కొంత వ్యవధి తర్వాత అప్పటికి జమ కాబడిన డీఏ బేసిక్‌లో విలీనం చేసి కొత్త బేసిక్‌ని నిర్ణయించడం కన్నా, వేతన సవరణ గడువు కాలంలో ఉన్న ద్రవ్యోల్బణంతో పోల్చి ఇస్తే సరిపోదా! అంటూ మరో ప్రశ్న సంధించారు. అంటే దీనిద్వారా ధరల పెరుగుదల, దాని ఆధారంగా లెక్కించబడే కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ నంబర్ అన్న సాంకేతిక అంశాలకు చరమగీతం పాడి, రాజకీయ పలుకుబడికి భంగం వాటిల్లకుండా

అధికారపార్టీ అనుయాయులు లెక్కించే ద్రవ్యోల్బణం రేట్‌తో ఉద్యోగుల వేతన సవరణను ముడిపెట్టడానికి చూస్తున్నారన్న మాట.

"ఉద్యోగుల జీతాలు బాగా పెరిగిపోతే ప్రభుత్వ ఖజానాకు లోటు ఏర్పడి ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ పథకాలు దెబ్బతినే అవకాశం ఉందా అనే అంశాల్ని పరిశీలించండి" అని మరో ప్రశ్న. అనగా సంక్షేమ పథకాలకి, ప్రభుత్వాన్ని నడిపే యంత్రాంగ వేతన జీవుల వేతనాలకు ముడిపెట్టి అంతర్గత తిరుగుబాటుకు ఆజ్యం పోస్తున్నారా!. అనే అనుమానం కలుగకమానదు.

స్థిరమైన, దీర్ఘకాలం కొనసాగే మీ వేతనాలు అదే ప్రయివేటు రంగంలో పనిచేసేవారి వేతనాలతో పోల్చి చూసినప్పుడు ఎలాంటి పరిస్థితి ఉందో గమనించి సూచనలివ్వండి" అని ఇంకో ప్రశ్న. ప్రయివేటు వారితో ముడిపెట్టి ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు తగ్గించే కుట్ర ఇది.

ఒకే రంగంలో కూడా అన్ని కేడర్లకు సమాన వేతనాలుంటాయా? అలాంటప్పుడు రాజకీయ నాయకుల, ఉన్నతాధికారుల విలాసాలను ప్రజలందరికి ఎందుకు కల్పించరాదు! ప్రతి సంవత్సరం లేదా కాలపరిమితులను అనుసరించి ఇంక్రిమెంట్లు, కరువు భత్యాలు, ప్రమోషన్లు తీసుకునే ఉద్యోగులకు ఫిట్‌మెంట్ అవసరమా అంటూ మరో ప్రశ్న? అంటే ఇకనుంచి ప్రమోషన్‌తో క్యాడర్ మారినప్పుడు ఫిట్‌మెంట్ అడగకూడదన్నమాట.

అలవెన్సులన్నీ కేఫటేరియా పద్ధతిలో ఇస్తే ఎలా ఉంటుంది? అని మరో ప్రశ్న. కెఫటేరియా పద్ధతి అనగా ఉద్యోగులకిచ్చే అలవెన్స్‌లు, ఉదాహరణకు, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, మెడికల్ బెనిఫిట్, లీవ్ ట్రావెల్ కన్సెషన్, గ్రూప్ ఇన్సూరెన్స్, మెడిక్లెయిమ్ వంటి పెర్క్స్ సాధారణంగా క్యాడర్‌ను బట్టి అమలవుతుంటాయి. ఇవన్నీ అన్ని రకాల ఏజ్ గ్రూప్ వాళ్లకి ఒకే రకంగా ఉపయోగపడకపోవచ్చు. అందుచేత కెఫెటేరియా పద్ధతి ద్వారా ఎవరికి ఏ అలవెన్సు కావాలో దాన్ని ఎంచుకోవచ్చు. మొత్తం అలవెన్స్‌లకు గరిష్ట పరిమితి ఉంటుంది. దానికి లోబడే ఎంచుకోవాల్సి ఉంటుంది.

దీనిద్వారా ఒక క్యాడర్ ఆధారంగా నిర్ణయించబడిన వేతనాలు అలవెన్సుల విధానానికి స్వస్తి పలకడానికి రంగం సిద్ధమైందన్న మాట. ఈరోజు అలవెన్సులకు మాత్రమే పరిమితమైన కెఫెటేరియా పద్ధతి రేపు వేతనాలకు ఆ తర్వాత సామూహిక వేతన స్కేళ్లకూ వర్తింపజేయవచ్చు.

ప్రస్తుతం కరువు భత్యం కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సిపిఐ) ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆరు నెలలకు ఒక సారిస్తారు దాన్ని అసంఘటిత రంగంలో అందరికి వర్తించడం లేదు కాబట్టి ప్రత్యామ్నాయ పద్ధతి ఏమైనా ఉందా అని సమాధానాన్ని కోరారు. అంటే త్వరలోనే డిఏ ఎత్తి వేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉన్నదని, వివరించాల్సిన అవసరం లేదనుకుంటా.

అనేక డిపార్ట్మెంట్‌లో నియామకాలు ఎంట్రీ లెవల్‌లోనే జరుగుతాయి. అలా కాకుండా ఎంట్రీ లెవల్‌లో, మిడిల్ లెవల్‌లో, టాప్ లెవల్‌లో కూడా ఔట్‌సోర్సింగ్ ద్వారా అర్హులైన వారిని తగిన పారితోషికమిస్తూ ఎంపిక చేస్తే ఎలా ఉంటుంది అంటూ సమాధానాన్ని కోరారు. దీనిద్వారా తమ అనుయాయులను, అవసరం అనుకున్నప్పుడు, అవసరమైన స్థానాలు నింపుకునే అవకాశానికి బాట వేసుకుంటున్నారని అర్థం చేసుకోవాలి.

ఈ మధ్యకాలంలో బ్యాంకులు ఇన్సూరెన్స్ రంగాలలో డైరెక్టర్ స్థాయిలో సరాసరి కార్పొరేట్ సెక్టర్ నుండి నియమించుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను కేంద్రం జారీ చేసింది. ఇకనుండి అన్ని ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌లో ఇలాంటి నియామకాలు చేపడుతున్నారన్నమాట! అనగా రాజ్యాంగం ప్రకారం అర్హులైన వారందరికీ ఆకాశం కల్పిస్తూ నోటిఫికేషన్ జారీచేసి ప్రతిభావంతులకు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైనవారిని తగు వృత్తిలో నియమించే ప్రక్రియకు చరమగీతం పాడి దొడ్డిదారిన కొందరిని ఎక్కువ మొత్తాలకు నియమించుకునే ప్రక్రియకు ఇది అవకాశం ఇస్తోంది.

మరోప్రశ్న ఏమంటే 'ప్రయివేట్ సెక్టార్‌తో పోలిస్తే ప్రభుత్వ ఉద్యోగులకు జాబ్ సెక్యూరిటీ ఎక్కువ కదా? దాన్ని దృష్టిలో పెట్టుకొని వేతన సవరణ ఎలా ఉండాలో చెప్పండి' అని! ప్రయివేటు సెక్టారెందుకు, ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లలో ఐఏఎస్ మొదలు అందరికీ సమానంగా వేతనాలున్నాయా! ఈ పోలిక ఆనాలోచితమైనది.

దేశంలో 50 లక్షల మంది ఇన్ సర్వీస్ ఉద్యోగులు ఉంటే డెబ్బయి లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు, పెన్షన్ కాస్ట్ పెరుగుతుంది. అందుచేత పెన్షన్ మొత్తాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ వేతన సవరణ ఎలా ఉండాలో కూడా చెప్పండంటూ" మరో ప్రశ్న వేశారు. డిఫెన్స్ సెక్టార్‌లో మరింత ఎక్కువ మంది పెన్షనర్లు ఉండడంవల్ల వ్యయం పెరిగిపోతుందని కూడా ఇందులో పొందుపరిచారు. వీటి వెనుక సారాన్ని గమనించలేనంత అమాయకులెవరు? ఇలా అడిగిన ప్రశ్నలన్ని ప్రభుత్వ ఉద్యోగుల స్వతంత్రతను, చిత్తశుద్ధిని శంకించడమే కాకుండా వారి కంట్రిబ్యూషన్‌ను విస్మరించడమే. ప్రభుత్వ లేదా, ఆ రంగం ఉద్యోగుల ప్రత్యేకత ఏమిటి? ప్రభుత్వ లేదా ప్రభుత్వరంగ ఉద్యోగులు యాజమాన్యానికి ఒక రకమైన బానిసలే. వారు ఏ వృత్తిని చేపట్టడానికి వీలులేదు. 24 గంటలు అందుబాటులో ఉండాలి. తమ కుటుంబ సభ్యులు చేపట్టే ప్రతి వృత్తినీ యాజమాన్యానికి తెలియజేస్తూ ప్రతియేటా ఆస్తిపాస్తుల వివరాలను తప్పకుండా సమర్పించాలి. లేదంటే శిక్షార్హులు.

ఇలాంటి ఉద్యోగులందరికీ సామూహిక బాధ్యత ఉంటుంది. వ్యక్తిగత బాధ్యత కన్నా ప్రభుత్వ యంత్రాంగం అంటే ప్రజలకు సర్వీసును అందించే విభాగం. పార్లమెంట్ చట్టం ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలకు రూపకల్పన జరిగి, ఏ రకమైన ఇతర లావాదేవీలు జరపకుండా ఉండేందుకు సిద్ధమైన వారిని ఎంపిక చేయడం వెనుక ఉన్న ఉద్దేశం కూడా ప్రభుత్వంలో భాగమై పరిపాలన చేయాలి గానీ ప్రొడక్టివిటీ లింక్డ్ ఇన్సెంటివ్స్ కోసం పాకులాడే అపేక్ష ఉండరాదన్నది అందులోని మర్మం. డిఫెన్స్ సెక్టార్‌లో పనిచేసేవారి ప్రొడక్టివిటీ ఎలా కొలుస్తాం? లాంగ్ వీటి పెరిగింది కాబట్టి రిటైర్ అయిన తర్వాత ఎక్కువ రోజులు బతుకుతున్నారు. మిలటరీలో పనిచేసిన వాళ్లు నలభై ఏళ్లకే రిటైర్ అవుతారు. గనుక సహజంగా ఇన్ సర్విస్ వాళ్లకన్నా ఎక్స్ సర్విస్ వాళ్లు ఎక్కువమందే ఉండే అవకాశం ఉంది.

దేశ సరిహద్దుల్లో ఉండే జవాన్‌కు సహకరించాలంటే మీరు వెంటనే ఆదాయపన్ను కట్టండి అంటూ జవాన్ల పేరు చెప్పి రేడియోలో ఆదాయపన్ను కట్టించుకోవడానికి పన్నులు వసూలు చేసే ప్రభుత్వం, పదవీ విరమణ పొందిన జవాన్లకు పెన్షన్ చెల్లించడానికి మాత్రం తెగ బాధపడిపోతున్నది. దేశంలో ఉన్న యాభై లక్షల ఉద్యోగులకు అరవై లక్షల పైబడి ఉన్న పెన్షనర్లకు కలిపి చెల్లించే మొత్తం రమారమి ఐదు లక్షల కోట్ల రూపాయలే. మరి కోటీ యాభై లక్షల జనాభా కలిగిన దేశాన్ని నడిపించే ప్రక్రియలో నాలుగు వందల లక్షల కోట్ల జీడీపీ కలిగిన దేశంలో ఐదు లక్షల కోట్ల వార్షిక వేతనం ఎక్కువెలా అవుతుంది? వెరసి, ఈ ప్రశ్నల ద్వారా ఉద్యోగులను దోషులుగా నిలబెట్టే ప్రయత్నం జరిగింది. ప్రయివేట్ సెక్టార్‌తో పోల్చి అవమానపరిచే ప్రయత్నం ఇది. ప్రయివేట్ సెక్టార్ యాజమాన్యాలు దోచుకుంటున్నది కళ్లకు కనపడటం లేదా? అక్కడ జరుగుతున్న దోపిడీని అరికట్టే ప్రయత్నాలు చేయకుండా ఆర్థిక వ్యవస్థకు అండాగా నిలిచే వారి భవిష్యత్తుపై నీలినీడలు కమ్మే ప్రశ్నావళిని ముందుకు తీసుకురావడం ద్రోహపూరితం కాక మరేమిటి?

– నవ తెలంగాణ సౌజన్యంతో...

## ఐక్యఉపాధ్యాయ

| | | |
|---|---|---|
| సంవత్సరం చందా | రూ. | 200.00 |
| 2 సం॥ల చందా | రూ. | 375.00 |
| అర్ధ దశాబ్ది చందా (5 సం॥లు) | రూ. | 850.00 |

## ఐక్యఉపాధ్యాయలో ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| 4వ కలర్ పేజీ | రూ. | 30,000.00 |
| 2,3 కలర్ పేజీ | రూ. | 20,000.00 |
| లోపలి కలర్ పేజీ | రూ. | 15,000.00 |

# అమెరికన్ సామ్రాజ్యవాద వల



కె.సురేష్‌కుమార్
ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు

అమెరికాలో ఆర్థిక సంక్షోభం ఉధృతం అయ్యే కొద్దీ మూడో ప్రపంచ దేశాలపై తన సామ్రాజ్యవాద దాడిని మరింత తీవ్రతరం చేస్తున్నది. ఆ క్రమంలోనే భారత్ అలీన విధానానికి దూరమయ్యే కొలదీ అమెరికా తన సామ్రాజ్యవాద ఇండో – పసిఫిక్ వ్యూహాన్ని పదే పదే ప్రకటిస్తున్నది. గతంలో బైడెన్ ప్రకటించిన ఇండో – పసిఫిక్ స్ట్రాటజీ, గత సంవత్సరం ట్రంప్ ప్రకటించిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ, ప్రస్తుత నేషనల్ డిఫెన్స్ స్ట్రాటజీ అన్నీ అమెరికా దుష్ట పన్నాగాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఇండో పసిఫిక్ ప్రాంతం ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలక ప్రాంతం మాత్రమే గాక అమెరికా భద్రతకు కూడా ప్రభావవంతమైన ప్రాంతం. గనుక బయటికి ఏమి చెబుతున్నా అమెరికా తమ ప్రయోజనాల పరిరక్షణకు ఆ ప్రాంతంలో ఏమేమి చేయాలో ఈ వ్యూహంలో పొందుపరచింది. ఈ వ్యూహంలో ఇండియాను కూడా భాగస్వామిగా చూపుతుండడం ఆందోళనకర అంశం.

ఇప్పటికే తన కుట్రాజకీయంతో అనేక సంపద్వంతమైన దేశాలపై ఆధిపత్యం సాధించిన అమెరికా ప్రపంచం మొత్తం పై పట్టు సాధించాలంటే పశ్చిమాసియా, ఆర్కిటికక్ ప్రాంతం, యూరప్, ఇండో పసిఫిక్ ప్రాంతాలు ముఖ్యం. ఎలాగూ పశ్చిమార్ధగోళంలో వివిధ రకాల ఒప్పందాలతో పాగా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ ద్వారా తమ ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్నారు. తమ నాటో లో భాగస్వామి అయిన డెన్మార్క్ తో దెబ్బలాడి అయినా గ్రీన్ ల్యాండ్ ను స్వాధీనం చేసుకుంటే ఆర్కిటిక్ ప్రాంతంలో తిరుగుండదు. ఉక్రెయిన్ విషయంలో దాన్ని పణంగా పెట్టి అయినా సరే రాజీ పడితే రష్యాతో సమస్య ఉండదు. ఎటొచ్చీ ఇండో పసిఫిక్ ప్రాంతమే అత్యంత కీలకం కష్టతరం. అందుకే ఇన్ని వ్యూహాలు.


ఈ వ్యూహాలు ఫలిస్తే అమెరికా అగ్రస్థానానికి చేరుకోవచ్చు లేదా ఉన్న స్థానాన్ని నిలుపుకోవచ్చు మరియు చైనాను నిలువరించవచ్చు. దీనికి పావుగా ఇండియాను ఉపయోగించు కోవాలి. అందుకు సహకరించకపోతే నష్టదాయక వాణిజ్య ఒప్పందాలు, అధిక టారిఫ్ ల పేరుతో భారత్ ను లొంగదీసు కోవడమే ఈ వ్యూహంలో ప్రధాన అంశం.

అందుకే ఈ ప్రాంతంలో పాగా వేసి పోటీదారులకు వేర్వేరు దేశాల నుంచి ఇంధనంతో సహా వనరుల సేకరణకు, మార్కెట్లకు, పెట్టుబడులకు ఆటంకాలు కల్పించాలి. వాటిని తమ నియంత్రణలోకి తెచ్చుకుని, రాబోయే కాలంలో తమ అభివృద్ధిని వేగవంతం చేయాలి. సైన్స్, టెక్నాలజీ ఆధునికీకరణలు, వాటి ఆధారంగా ఆధునిక ఉత్ప త్తులు భవిష్యత్తుకు కీలకం అయినందున, ఆ రంగాలలో చైనా పురోగతి ఒక సవాలుగా మారినందున... ఆ విషయమై మరింత దృష్టి పెట్టాలి.

అన్ని వ్యూహాల్లోనూ చైనాను యుద్ధంతో కాక ఆర్థికంగా కట్టడి చేసి మరియు సైనిక శక్తి ద్వారా భయపెట్టి నిలువరించాలను కుంటున్నది. నాటో శక్తి మరింత పెంచుకొని చైనాను నియంత్రిం చేందుకు ఇండియాతో కూడిన 'క్వాడ్'ను యాక్టివేట్ చేస్తూ భారత్‌కు పొరుగు దేశంతో శతృత్వం పెంచుతున్నది.

మరోవైపు అమెరికా ట్రేడ్ డీల్ పేరుతో భారత్‌తో నష్టదాయక ఒప్పందం చేసుకున్నప్పటికీ, అమెరికా భారత్‌పై టారిఫ్‌ల పట్ల వైఖరి మరింత కఠినంగా ఉన్నది. అమెరికా టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్ట్ చివాట్లు పెట్టి వ్యతిరేక తీర్పులు వెల్లడించినప్పటికీ దాని వైఖరిలో ఏ మాత్రం మార్పు రాకుండా ట్రేడ్‌డీల్ విషయంలో ముందుకే పోతున్నప్పటికీ భారత పాలకులు లొంగుబాటు కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రజలు అప్రమత్తమై మేలుకోవలసిన సమయం ఆసన్నమైంది.

# పని చేస్తేనే - తినే హక్కు....



ఎన్.వెంకటేశ్వర్లు
యుటిఎఫ్ రాష్ట్ర

తల్లిదండ్రులు కూలి పని చేస్తున్నారు. ఆ చేలో ఉన్న కొబ్బరి చెట్టు నుండి కొబ్బరికాయ కింద పడింది. అప్పటికే పిల్లాడు ఆకలిగా ఉన్నాడు. కానీ ఆ పడ్డ కొబ్బరి కాయను తీసుకుని వెళ్లి ఆ పొలం యజమానికి ఇచ్చాడు. ఇదంతా గమనిస్తున్న యజమాని “నీకు ఆకలిగా ఉంది తినేయొచ్చు కదా నాకెందుకు ఇచ్చావు” అని అన్నాడట. అప్పుడు ఆ పిల్లాడు “మా అమ్మ నాయన పని చేస్తేనే తినాలి అని చెప్పారు” అని చెప్పాడు.

డిగ్రీ చదివే రోజులలో కెమిస్ట్రీ సారు వై. లక్ష్మీనారాయణ గారు “మీ వయసెంత అని అడిగేవారు. 20 సం॥లు అని మేము చెబితే... ఈ 20 సం॥ల్లో ఏమన్నా సాధించారా.. అసలు 20 సం॥లు ఏమీ సాధించకుండా ఎలా కాలాన్ని గడిపారు” అని ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు.

చిన్న తనంలో మా అమ్మ లేదా పెద్దలు ఏదైన పని మాతో చేయించుకోవాలంటే నీకు ఐదు పైసలు ఇస్తాను ఈ పని చేయి అని చెప్పేవారు.

ఈ అంశాలన్నీ పరిశీలించిన తర్వాత అనిపిస్తున్న ఒక్క మాట ఏమంటే “పని చేయకుండా, శ్రమ చేయకుండా, ఉత్పత్తిలో భాగస్వామి కాకుండా తినే హక్కు లేదు” అని. మరి ఇదే నిజమైతే అందరం పనిచేస్తున్నామా... పని అంటే శారీరక పని లేదా మానసిక పని అయి ఉండాలి.

రోజూ పొలంకి వెళ్లి తన పొలంలో పనిచేస్తున్నారు రైతులు. కర్మాగారంలో ఒక కార్మికుడు, పొలంలో వ్యవసాయ కూలి, బడిలో ఉపాధ్యాయుడు, కార్యాలయంలో ఉద్యోగులు తమకు కేటాయించిన పనిని చేస్తున్నారు. ఈ పనులు చేసినందుకు కొంత వేతనాన్ని ఇస్తున్నారు. ఈ వేతనంతో తనతోబాటు తన కుటుంబం జీవిస్తున్నారు. పనిచేసారు కనుక భుజిస్తున్నారు. ఇలా అందరూ చేస్తున్నారు కదా దీనిలో విశేషం ఏముంది అనిపిస్తుంది...కానీ లోతుగా అధ్యయనం చేస్తే కొన్ని విషయాలు తెలుస్తాయి.

**మానవ సమాజ ప్రారంభంలో**

మానవుడు ప్రారంభ దినాలలో వేట, ఆహార సేకరణ ద్వారా జీవనాన్ని కొనసాగించారు. నిటారుగా నిలబడడం, శరీర నిర్మాణంలో మార్పు, నిప్పును కనుగొనడం, చక్రాన్ని కనుగొనడం ద్వారా ప్రకృతిలో ఆహార సేకరణ నుంచి ఉత్పత్తి చేసుకోవడం మనిషిని జంతువు నుంచి వేరుపడేటట్లు చేసింది. మానవుని శ్రమ ద్వారా ఉత్పత్తిలో మిగులు ఏర్పడింది. ఈ మిగులుపై ఆధిపత్యం కోసం రకరకాల సూత్రాలు, సిద్ధాంతాలు, వాదాలు ముందుకు వచ్చాయి. ఆధిపత్యం సాధించిన వారు యజమానులుగా, ఉత్పత్తి చేసేవారు బానిసలుగా మారారు. బానిసల ద్వారా ఎక్కువ ఉత్పత్తి చేసుకోవడం తద్వారా ఎక్కువ సంపద పోగుపడింది. బానిసలు పనిచేసే వారు. యజమానులు పెత్తనం చేసేవారు. బానిసలు ఎదురు తిరగకుండా, ప్రశ్నించనీయకుండా వారికి రకరకాల స్మృతులు, కథలు, జన్మ రహస్యాలు, మంచి చెడులు అనే భావనలు, సిద్ధాంతాలు, సూత్రాలు అన్నిటిని ఈ కాలంలో ముందుకు తెచ్చారు.

తర్వాత కాలాలు మారినా, ఉత్పత్తి విధానాలు మారినా, బానిస వ్యవస్థ పోయినా ఈ బానిస వ్యవస్థ కాలపు ఆలోచన పద్ధతులు ఇప్పటికీ కొనసాగు తున్నాయి. ఇప్పటికీ ఆ యజమాని వర్గం తర్వాత కాలాలలో భూస్వామ్యవర్గంగా, పెట్టుబడిదారీ వర్గంగా మారినా, పెత్తనం చేసే వర్గంగానే ఉన్నారు. ఇంతకీ ఇప్పుడు పని చేయకుండా తినే వారు ఎవరు?

**పనిచేయని వారు....**

ఎవరికి కేటాయించిన పని వారు ఈరోజు చేసామా...లేదా చెక్ చేసుకోవాలి. పని చేయనివారు, పనిచేసేవారిని అజమాయిషీ చేస్తున్నారు. తాను పనిచేస్తూ ఇతరులను పని చేయమని అడగటంలో తప్పులేదు...అసలే పని చేయకుండా నీతులు చెబుతూ పని చేసే శ్రామికులను తులనాడుతున్నారు. పనిచేయకుండా తినకూడదు అని చిన్న పిల్లాడికి ఉన్న నీతి కూడా ఈరోజు పెద్ద పెద్ద మేధావులు అని చెప్పుకొనే వాళ్ళకి లేకుండా ఉంది. ఏ పని చేయని వారు, శారీరక లేదే మానసిక పని చేయని వారు, సమాజంలో పెత్తనం చేయాలని కోరుకునేవారు, సోమరిగా మారిపోయారు. వాళ్ళు పని దొంగలు. అనవసరంగా ఉచితం ఇచ్చి వారిని సోమరిగా మార్చేస్తున్నారు అని, పనిచేసేవారిని పొద్దస్తమానం విమర్శిస్తూ ఉంటారు. అసలు ఇలా విమర్శ చేసేవారు చేసేపని ఏమిటో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. నేను చేస్తున్న పని ఈ సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతుంది. శారీరక శ్రమగా లేదా మానసిక శ్రమగానా అనేది పరిశీలన చేసుకోకుండా ఎదుటివారిని విమర్శించడం, నీతులు చెప్పడం మాత్రమే పనిగా పెట్టుకున్న వారి పట్ల జాగ్రత్త అవసరం.

**ఇంతకీ పని చేయని వారు ఎవరు..**

ఇది తేలాలి. శ్రామికులా, రైతులా! ఉద్యోగ, ఉపాధ్యాయులా, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వారా, కార్పొరేట్ లాభాల కోసం పనిచేసే రాజకీయ నాయకులా, కష్ట జీవుల కోసం పనిచేసే రాజకీయ నాయకులా, కార్పొరేట్లవారా, కబుర్లు చెప్పి కాలం గడిపేవారా... ఎవరు? పని చేయకుండా తింటున్నది ఎవరు?

పొలం నుంచి వచ్చిన వాడిని పొయ్యి దగ్గర వేడి కాసుకునే వాడు కొట్టాడట అనేది ఒక సామెత. ఆ పొయ్యిలోకి వేడి కాసుకోవటానికి లేదా నోటికాడికి బువ్విచ్చేవాడు పొలంలో పనిచేసేవాడా లేదా పొయ్యివద్ద వేడి కాచుకొనేవాడా తెలుసు కోవాల్సింది మనమే. ఎవరి ప్రక్కన నిలబడతారో మధ్య తరగతి వర్గంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తేల్చుకోవాలి. ఎందుకంటే ఈరోజు పొలం నుంచి వచ్చిన వాళ్ళకి విలువ లేకుండా, వేడి పొయ్యి దగ్గర కూర్చుని కబుర్లు చెప్పే వాళ్ళకి విలువ ఇస్తున్న సమాజంలో ఉన్నాము. ఈరోజు మన ముందుంది నువ్వు ఎటువైపు ఉంటావో ఎవరి ప్రక్కన నిలబడతావో తేల్చుకోవాలి. ఇలా తేల్చుకోకుండా సన్నాయి నొక్కులు, సోది కబుర్లు చెప్తే ఉపయోగం లేదు.

# 12వ పిఆర్‌సి, ఆర్థిక సమస్యలపై ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, మంత్రులకు విజ్ఞాపనలు



మంత్రివర్యులు కింజరాపు అచ్చన్నాయుడు గారికి

శ్రీకాకుళం



పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గారికి



మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ గారికి

విజయనగరం



రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహనరావు గారికి



మంత్రివర్యుల శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి గారికి

పార్వతీపురం




పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గారికి



మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గారికి, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు గారికి

అనకాపల్లి



అనకాపల్లి నియోజవర్గ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గారికి



పాడేరు నియోజవర్గ ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వర రాజు గారికి



పోలవరం - రంపచోడవరం ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష గారికి


# 12వ పిఆర్‌సి, ఆర్థిక సమస్యలపై ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, మంత్రులకు విజ్ఞాపనలు



కాకినాడ పట్టణ నియోజకవర్గ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పి. రాజశేఖర్‌ల వారికి



అమలాపురం ఎమ్మెల్యే ఐ.ఆనందరావు గారికి



కోనసీమ జిల్లా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గారికి



తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు - మంత్రివర్యులు కందుల దుర్గేష్ గారికి



రాజమహేంద్రవరం (రూ) ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య గారికి


తూర్పుగోదావరి



రాజానగరం ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ గారికి



అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి గారికి



రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గారికి

ఏలూరు



ఎమ్మెల్యే బడేటి చంటి గారికి



చింతలపూడి ఎమ్మెల్యే ఎస్. రోషన్ కుమారి గారికి

# 12వ పిఆర్‌సి, ఆర్థిక సమస్యలపై ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, మంత్రులకు విజ్ఞాపనలు



కృష్ణా - మంత్రివర్యులు కొల్లు రవీంద్ర గారికి


బాపట్ల - చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య గారికి

ఎన్‌టిఆర్


పార్లమెంట్ సభ్యులు సుజనా చౌదరి గారికి


విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు గారికి


మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ గారికి


జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ గారికి

తూర్పుగోదావరి


ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు గారికి


పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర గారికి


పల్నాడు


గురజాల ఎమ్మెల్యే వై.శ్రీనివాసరావు గారికి


నర్సరావుపేట ఎమ్మెల్యే డా॥ చదలవాడ అరవిందబాబు గారికి

# 12వ పిఆర్‌సి, ఆర్థిక సమస్యలపై ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, మంత్రులకు విజ్ఞాపనలు


కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి గారికి


చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గారికి

నెల్లూరు



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కె.శ్రీధర్ రెడ్డి గారికి



సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారికి



మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారికి


పశ్చిమ రాయసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి గారికి



అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గారికి



ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారికి

శ్రీసత్యసాయి


మంత్రివర్యులు శ్రీమతి ఎస్.సవిత గారికి


కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారికి




# వాస్తవిక దృక్పథం
# స్త్రీ శక్తి సమస్య

వర్గ సమాజ అభివృద్ధిలోనే మహిళల పరాధీనతకు మూలాలు ఉన్నాయని భౌతిక వాదం గుర్తిస్తుంది. ఎంగెల్స్ తన ప్రఖ్యాత గ్రంథం "కుటుంబం, ప్రైవేటు ఆస్తి, రాజ్యం ఆవిర్భావం" లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, ఉత్పత్తి సాధనాలపై అదుపుకు సామాజిక సంబంధాలు రూపుదిద్దుకోవడానికి మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని స్పష్టం చేస్తారు.

ఎంగెల్స్ చెప్పినట్లు మానవ జాతి చరిత్రలో మొట్టమొదటి శ్రమవిభజన "పిల్లల పెంపకం కోసం స్త్రీకి, పురుషునికి మధ్య జరిగింది." తమ జాతులను సజీవంగా ఉంచుకోవడం అనేది ఆదిమ సమాజాలలో మొట్టమొదటి ప్రాధాన్యతగా ఉండేది. మానవులు తమ అదుపులో లేని, శక్తివంతమైన ప్రకృతి శక్తులను ఎదుర్కోవలసి వచ్చింది. సగటు ఆయుర్దాయం కూడ చాల తక్కువగా ఉండేది. ఈ స్థితిలో స్త్రీ పునరుత్పత్తి పాత్ర మానవ జాతి బ్రతికి బట్టకట్టడంలో కీలక పాత్ర వహించింది. కుటుంబ పోషణలోను, ఆహార సేకరణలోను, ఆ తర్వాత ఆదిమ వ్యవసాయంలోను, చేతి వృత్తుల్లోను మహిళలు కేంద్రస్థానంలో ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అవి అప్పటి మానవజాతి అభివృద్ధి దశలో ఉత్పత్తి సాధనాలపై మహిళల అదుపును సూచిస్తున్నాయి. ఆనాడు మహిళలు ఉన్నతస్థాయి గౌరవాన్ని పొందేవారు. "సామాజిక ఉత్పత్తిలో ప్రధాన పాత్ర వహించి, ఆ ఉత్పత్తిలో ప్రధాన బాధ్యతను నిర్వహించే వారే కాలక్రమంలో ఆ ఉత్పత్తిపై అదుపు సాధిస్తుందని చరిత్ర చెబుతున్నది. మాతృస్వామ్య సమాజంలో మహిళలే ఉత్పత్తిపై అదుపు కలిగినవారిగా గుర్తించబడిన కాలం ఉంది. దీనికి కారణం, ఆనాటి ఉత్పత్తి దశ అయిన పురాతన వ్యవసాయంలో మహిళలు ప్రధాన పాత్ర వహించడం, పురుషులు అడవుల్లోకి వేట కోసం వెళ్లడమే".


కె.సురేష్‌కుమార్
ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు

మానవ అవసరాలు, శ్రమ విజ్ఞాన పరిధులను అభివృద్ధి చేశాయి. ఉత్పత్తి సాధనాలన్నీ పురుషులు, స్త్రీలు ఇద్దరి ఆధీనంలో ఉండేవి. కాలక్రమేణా సంపద అంటే పశువుల మందలు అంతకంతకూ అధికంగా ఉనికిలోకి వచ్చింది. దీనితో ఒక స్థిరమైన మిగులు కనిపించసాగింది. ఫలితంగా మొదటి వర్గసమాజాలు ఆవిర్భవించాయి, మొదట పశువుల మందలను సమిష్టిగానే కలిగిఉండే వారు కాని ఆ తర్వాత పశుసంపద ప్రైవేటు ఆస్తిగా మారింది. పరిణామ క్రమంలో పశువుల మందలపై ప్రధానంగా పురుషులే యజమాన్యాన్ని సంపాదించారు. పశువుల మందలతో పచ్చిక బయళ్ల వెంట తిరగడం పురుషుల పనిగా ఉండటమే దీనికి కారణం. స్త్రీలు చేతి వృత్తులకే పరిమితమయ్యారు. దీనితో పురుషులు ఆర్థికంగాను, సామాజికంగాను స్త్రీలను మించిన స్థానాన్ని పొందగలిగారు. బానిస సమాజం ఏర్పడినపుడు ఆ బానిసలు కూడా నూతనంగా రూపుదిద్దుకున్న ఆస్తిపర వర్గాలలోని పురుషుల చేతుల్లోకే వెళ్లారు. పశువుల మందలకు యజమానిగా ఉన్న వ్యక్తే యుద్ధాలలో పట్టుబడిన బానిసలకు కూడా యజమాని అయ్యేవాడు. ఆ బానిసలను పశువుల పెంపకంలో వినియోగించే వాడు. ఉత్పత్తి సాధనాల అభివృద్ధి ఇంటి బయట జరగటంతో, ఇంటి లోపల మహిళ చేసే సేవలకు సామాజిక స్వభావం లేకుండా పోయింది. అవి కేవలం ప్రైవేటు సేవలుగా మిగిలి పోయాయి. ఇది స్త్రీ, పురుషుల మధ్య సంబంధాలలో మౌలిక మార్పులకు దారితీసింది.

రెండవ ముఖ్యమైన అంశం, వర్గసమాజం అభివృద్ధి కుటుంబ స్వరూపాన్ని మార్చడంలో చూపిన ప్రభావం. ప్రైవేటు ఆస్తి ఉనికిలోకి రావడంతో వారసత్వ హక్కును నిర్ధారించాల్సిన అవసరం ఏర్పడింది. పురుషుడు ఆస్తిపై హక్కును రక్షించుకోవాలంటే తన ద్వారా ఒక స్త్రీకి జన్మించిన వాడు తనకు నిజమైన వారసుడు అని చెప్పుకోగలగాలి. దీని కోసం మొదట పురుషుడు స్త్రీపై ఆధిపత్యాన్ని సంపాదించాలి. ఎంగెల్స్ ఇలా చెప్పారు: "సంతాన క్రమం తల్లి హక్కు ద్వారా గుర్తించబడి ఉన్నంత కాలం ఇది సాధ్యం కాదు. సంతాన క్రమాన్ని స్త్రీ ద్వారా గుర్తించడం, తల్లి ద్వారా వారసత్వ హక్కు సంక్రమించడం నిలిపి వేయబడింది. పురుష క్రమం, అలాగే తండ్రి ద్వారా వారసత్వం హక్కు స్థాపించబడినాయి." అప్పటివరకు కొనసాగిన గుంపు

వివాహాలు మహిళల స్థాయిని దిగజార్చడానికి, అణచివేతకు కారణమయ్యాయి. అందుచేతనే మహిళలు జంట వివాహాల పద్ధతిని అనుసరించారు. ప్రైవేటు ఆస్తి అభివృద్ధి చెందటంతో దంపతీ వివాహ పద్ధతి అమల్లోకి వచ్చింది. ఇది మహిళలపై అదుపుకు సాధనంగా తయారయింది. అలాంటి వివాహ పద్ధతికి దారితీసిన చారిత్రక పరిస్థితులే స్త్రీ పురుషుల మధ్య అసమానతల నుండి ఆవిర్భవించాయి.

“దంపతీ వివాహ పద్ధతి చారిత్రకంగా ఒక పెద్ద ముందడుగు. అదే సమయంలో అది బానిస వ్యవస్థ, ప్రైవేటు సంపదలతో పాటు ఉనికిలోకి వచ్చింది. ఈ యుగమే నేటికీ కొనసాగుతోంది. ఈ యుగంలో ముందుకు వేసిన ప్రతి అడుగూ సాపేక్షంగా వెనుకడుగే. కొందరు దారిద్ర్యాన్ని, అణచివేతను అనుభవించడం వలన మరికొందరికి సంపదలు, అభివృద్ధి సమకూరుతాయి.

చరిత్రలో మొట్టమొదటి సారిగా కనిపించే వర్గ వైషమ్యమూ, దంపతీ వివాహంలో స్త్రీ పురుషుల మధ్య తలెత్తిన వైషమ్యమూ ఏకకాలంలో సంభవించాయి. అదేవిధంగా స్త్రీ జాతిని పురుషజాతి అణచివేయడంతో పాటే మొట్టమొదటి వర్గపీడన తలెత్తింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి స్త్రీ, పురుషుల మధ్య శ్రమ విభజనలో అసమానతలను నిర్మూలించడానికి అవసరమైన ప్రాతిపదికను కల్పిస్తుంది. అయినప్పటికీ పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావం అంతర్గతంగా ఉండే వైరుధ్యాలు అలా జరగకుండా నిరోధిస్తుంది. స్త్రీలకు భారీ పరిశ్రమల్లో పని కల్పించడం ద్వారా వారు ఫ్యూడలిజం నుండి అనుభవిస్తూ వస్తున్న ఒంటరితనాన్ని, పరాధీనతల వలయాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ ఛేదిస్తుంది. కాని అదే సమయంలో ‘స్వేచ్ఛా కార్మికులు’గా మహిళలు పనిచేసే పరిస్థితులు అసమానంగానేపురుషాధిక్య సంస్కృతులను పెట్టుబడిదారీ వ్యవస్థ స్వీకరించి బలోపేతం చేస్తుంది. అలాంటి వాతావరణం స్త్రీ పురుష కార్మికుల వేతనాల్లో అసమానతలకు వీలు కల్పిస్తుంది; ఆ విధంగా మహిళల శ్రమను చౌకగా పెట్టుబడి దారులకు అందిస్తుంది: కార్మిక శక్తిలో గణనీయమైన భాగంగా ఉన్న మహిళల శ్రమ నుండి అధికంగా అదనపు విలువను గుంజుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. వేతనాల స్థాయిని తక్కువగా ఉంచేందుకు వీలు కల్పించే రిజర్వు నిరుద్యోగ సైన్యం పెరగడానికి మహిళలు కూడా ఉపయోగపడతారు.

అనేక అభివృద్ధి చెందిన దేశాలలో మాదిరిగానే భారత దేశంలో కూడా చౌకగా దొరుకుతున్న మహిళల శ్రమ భూస్వాముల, పెట్టుబడిదారుల లాభాలను పెంచడానికి పెద్ద ఎత్తున ఉపయోగ పడుతున్నది. మహిళలకు, పురుషులకు మధ్య వేతనాలలో వ్యత్యాసాలు తీవ్రంగా ఉండటం, మహిళలకు కనీస వేతనాలు చెల్లించక పోవడం గ్రామీణ ప్రాంతాల్లోని భూస్వాములతో సహా యజమానుల లాభాలను భారీగా పెంచుతున్నాయనడానికి కావలసినన్ని ఆధారాలు ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో లింగ ప్రాతిపదికన జరుగుతున్న శ్రమ విభజనలో మరొక అంశం ఉంది. కార్మిక వర్గ కుటుంబాలలో మహిళలు లెక్కలోకి రాని ఇంటిపనిద్వారా శ్రమశక్తి పునరుత్పత్తికి దోహదపడటం ఈ అంశం. సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాలలో సైతం మహిళలు ఇంటి చాకిరీలో అసమాన విభజనకు గురవుతుంటారు. దీన్ని ‘ప్రైవేటు’ వ్యవహారంగా చెప్పినప్పటికీ వస్తుగతంగా పెట్టుబడిదారీ సమాజంలో ఒక తప్పనిసరి అవసరం. ఒక కార్మికునికి లభించే వేతనం అతడు, లేదా ఆమె సృష్టించే సరుకుల విలువకు సమానం కాదని, అతడిని, ఆమెని లేదా పోషించడానికి, శ్రామిక శక్తిని తిరిగి ఉత్పత్తి చేయడానికి అవసరమైన సరుకుల విలువకు మాత్రమే సమానమైనదని మార్క్స్ చెప్పాడు. కార్మికుడు ఒక పనిరోజులో తన జీవనానికి అవసరమైన సరుకులను ఉత్పత్తి చేయడానికి పట్టే శ్రమను అవసర శ్రమ అని, దానికి మించి చేసే శ్రమను అదనపు శ్రమ అని మార్క్స్ నిర్వచించాడు. ఆ విధంగా మహిళలు చేసే ఇంటి పని కూడా అవసర శ్రమలో పైకి కనిపించని ఒక భాగం. అది కార్మికుని జీవనానికి అవసరమైన సరుకు విలువను తగ్గించడానికి ఉపయోగ పడుతుంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ ప్రక్రియలు దీన్ని మరింత తీవ్రం చేశాయి. లింగ ప్రాతిపదికన జరిగే శ్రమ విభజన నూతన రూపాలు సంతరించుకోవడంతో, రాజ్యం సంక్షేమాన్ని కల్పించాల్సిన కనీస బాధ్యతల నుండి ఉపసంహరించు కుంటుంది. అవసరమైన కుటుంబ, శిశు సంరక్షణ సేవలు ప్రైవేటీకరించబడటంతో వాటి ఖర్చులు పెరిగిపోతాయి. దానితో ఇంటిపనిలోను, కుటుంబ భద్రతలోను మహిళలు అధిక భారాన్ని మోయాల్సి వస్తుంది.పని ప్రదేశంలో మహిళలకు తక్కువ విలువ ఇవ్వడం కుటుంబం బయట లోపల కూడ వారి సామాజిక స్థాయి పైన ప్రతికూల ప్రభావం చూపుతుంది. పెట్టుబడిదారీ సమాజంలో మహిళలపై హింస విపరీతంగా పెరిగిపోయింది. పెరిగిన గృహహింస “కుటుంబం” అనేది మహిళలపై హింసకు స్థానంగా మారిందని చెపుతుంది.

మహిళా విముక్తి సాధ్యం, మౌలిక అవసరాలు ప్రైవేటు ఆస్తి నిర్మూలనపై ఆధారపడిన సోషలిస్టు సమాజంలో మాత్రమే నెరవేరతాయి. వీటిలో మొదటిది, మహిళలను పురుషులతో సమాన స్థాయిలో, సమాన అవకాశాలతో సామాజిక ఉత్పత్తి క్రమంలో భాగస్వాములను చేయడం. ఇది వారిని ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేలా చేస్తుంది, వారి ఒంటరి తనాన్ని ఛేదించి వారి శక్తి సామర్థ్యాలను, నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకునే అవకాశం కల్పిస్తుంది. ఉత్పాదక శ్రమ ఒక్కటే సమానత్వ సాధనకు దోహదం చేస్తుంది. రెండవది, ఈ వ్యవస్థలో ఇంటి చాకిరీని తప్పించడానికి ఇంటి పని బాధ్యత అంతా సామాజిక పరం చేయబడుతుంది.

సామూహిక కేటరింగ్ (భోజన) కేంద్రాలు, నర్సరీలు, శిశు రక్షణ కేంద్రాలు, పబ్లిక్ లాండ్రీలు, ఇంటి పనిని సులభతరం చేసే ఆధునిక సదుపాయాలు స్త్రీ పురుషులు దానిలో సమానంగా పాలుపంచుకునేందుకు వీలు కల్పిస్తాయి. మూడవది, సామాజిక జీవనంలో, ప్రజా జీవనంలో మహిళల స్వతంత్ర పాత్రకు సోషలిజం అవకాశం కల్పిస్తుంది.

పై విషయాలను క్రోడీకరిస్తే, చారిత్రకంగా వర్గ సమాజంలోనే పితృస్వామ్య భావజాలం, మహిళల పరాధీనత మొదలయ్యాయి. వర్గ దోపిడీపై ఆధారపడిన సమాజాలు, ప్రస్తుత పెట్టుబడిదారీ దశ, ముఖ్యంగా నయా ఉదారవాద విధానాలు మహిళల పరాధీనతలోని పితృస్వామ్య సంస్కృతులను అనేక విధాలుగా బలీయం చేస్తున్నాయి. మహిళాలోకం పురుషులతో సమాన ప్రాతిపదికన సామాజిక ఉత్పత్తిలో పాలు పంచుకున్నపుడు మహిళా విముక్తికి భౌతిక ప్రాతిపదిక ఏర్పడుతుంది. కేవలం సోషలిస్టు సమాజంలో మాత్రమే, ఉత్పత్తి సాధనాలు సామాజిక యాజమాన్యంలో ఉన్నపుడు మాత్రమే అది సాధ్యం. సోషలిస్టు సమాజంలో మాత్రమే వివిధ స్థాయిల్లో ప్రభుత్వ సంస్థలు శిశు సంరక్షణకు, ఇంటి పని సామాజికీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాయి. అవి అసమాన పని విభజనను నిర్మూలించడానికి, ప్రజా జీవనంలో మహిళలు సమాన భాగస్వాములు కావడానికి దోహదపడతాయి.

సోషలిస్టు దేశాలలో మహిళల అనుభవం ఈ వాస్తవాన్ని ధృవీకరిస్తున్నది. సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా దేశాలు కుప్పకూలినప్పటికీ, ఆ దేశాలలోను, ఇతర సోషలిస్టు దేశాలలోను పెట్టుబడిదారీ ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన ప్రజా స్వామ్యాలలో సైతం లేని విధంగా మహిళలు హక్కులు, సదుపాయా లు పొందారన్న సంగతి విస్మరించరాదు.

ఈనాటి భారతదేశంలో పెట్టుబడిదారీ భూస్వామ్య దోపిడీకి అత్యంత దారుణంగా బలవుతున్నవారు మహిళలే. గత దశాబ్దికాలంలో మొత్తంగా స్త్రీల ప్రతిపత్తి తీవ్రంగా క్షీణించింది. మరీ ముఖ్యంగా దళిత, ఆదివాసి, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళల విషయంలో ఇది మరింత ఎక్కువగా జరిగింది. ప్రభుత్వం ప్రకటించిన గణాంకాలే దిగజారుతున్న స్త్రీల పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయి.

ప్రపంచీకరణ నయా ఉదారవాద విధానాలు మొత్తం కార్మికులపై దోపిడీని పెంచి వారి హక్కులను దెబ్బతీశాయి. కాగా మహిళా శ్రామికులు మరింత ఘోరంగా నష్టపోయారు. దుర్భరమైన ఆర్థిక పరిస్థితి వల్ల మరింత ఎక్కువమంది మహిళలు శ్రామికులుగా మారవలసి వస్తున్నది.

చారిత్రకంగా చూస్తే వర్గపరమైన అసమానతలకు, స్త్రీలపై లైంగికపరమైన అణచివేతకు చట్టబద్ధత కల్పించడానికి మతం ఉపయోగపడింది. దీనికి తోడు భారతదేశంలో కుల వ్యవస్థ పై నుండి క్రింది వరకు పారంపరిక అసమానతలకు చట్టబద్ధమైన, ఆచారపరమైన ఆమోదముద్ర వేసింది. దీనికి ఆర్థిక సామాజిక కోణాలు రెండూ ఉన్నాయి. కుల భావజాలం కింది కులాల వారిని, అస్పృశ్యులను క్రూరమైన పద్ధతులలో లొంగదీసుకొనే పద్ధతిని బలపరుస్తోంది. మార్పు రాకుండా అడ్డుకునే అతి బలీయమైన చట్రాన్ని ఏర్పరుస్తుంది. దానిలో స్త్రీలు మాత్రం ప్రతి కులంలోనూ దిగువ స్థాయినే ఉంటారు. ఈ దొంతరలో అగ్ర కుల పురుషులు విధించిన పవిత్ర రక్తం షరతు అంతర్భాగంగా ఉంటుంది. ఇది స్త్రీలకు కఠోరమైన ప్రవర్తనా నియమావళిని నిర్దేశిస్తుంది. స్త్రీల లైంగికతను నియంత్రించడం దీనికి ప్రాతిపదిక. అనేక కారణాల వల్ల క్రింది కులాలలో ఉంటూ వచ్చిన మరింత ప్రజాతంత్రయుత సంబంధాలు కూడా క్రమేణా హరించుకు పోతున్నాయి.

దళిత స్త్రీలు మూడు విధాలుగా అసమానతలకు గురవుతారు. వర్గపరంగా వారంతా పీడిత వర్గాలకు చెందిన వారై ఉంటారు. అలాగే కులం, లింగ బేధం కూడా. భారతదేశ పరిస్థితులలో స్త్రీల విమోచన కుల వ్యవస్థల యొక్క సైద్ధాంతిక, భౌతిక ప్రాతిపదికలను నిర్మూలించడంపై ఆధారపడి ఉంది.

ప్రపంచీకరణ తెచ్చిపెట్టిన సంస్కృతులు స్త్రీలపై లైంగిక దాడుల పెరుగుదలకు దారితీస్తున్నాయి. పిల్లల పట్ల అనుచిత లైంగిక ప్రవర్తన, లైంగిక కుంభకోణాలు, బ్లాక్ మెయిలింగ్ లు వగైరాలు పెరిగిపోతున్నాయి. నయా ఉదారవాద విధానాల వల్ల వినియోగ విలువలు సర్వవ్యాపితమవుతున్న పరిస్థితులలో మీడియా స్త్రీని వస్తువుగా చిత్రించడం పెరిగిపోతున్నది. స్త్రీలను కించపరిచే విధంగా అసభ్యంగా చిత్రించే ధోరణులు సీరియళ్ళలోనూ, సినిమాలలోనూ విపరీతంగా పెరుగుతున్నాయి. దారిద్ర్యం కారణంగా ఎక్కువమంది స్త్రీలు వ్యభిచార వృత్తిలోకి నెట్టబడుతున్నారు. స్త్రీలు, బాలికల వ్యభిచారం ఎంతగానో పెరిగింది. స్త్రీ, శిశు, భ్రూణ హత్యలు దిగ్భ్రాంతికరంగా పెరగడానికి వెనుకప్రధాన కారణం ఇదే. అదే సమయంలో పెరిగిపోతున్న గృహ హింస పెద్ద సంఖ్యలో స్త్రీల ప్రాణాలు బలిగొంటుంది. వారి శారీరక, మానసిక ఆరోగ్యాలను హరిస్తున్నది. మూఢత్వం, అంధవిశ్వాస పద్ధతులు, త్వరితగతిన వ్యాపిస్తున్నాయి. ఇవి ప్రత్యేకించి మహిళలను దెబ్బతీస్తున్నాయి. మహిళలను తక్కువ స్థాయికి నెట్టడానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి ఆటంకాలవుతున్నాయి. వీటిని విశాల సమైక్య సమీకరణ ద్వారా తిప్పికొట్టాలి. శాస్త్రీయ అవగాహనను వ్యాపింపచేయాలి.

మతతత్వ భావాల చొరబాటుకు, మహిళల మతపరమైన మనోభావాలను దుర్వినియోగ పరచడానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర శక్తులు ప్రత్యేక దృష్టితో పోరాడాలి.

# మంచి బడి



ఆ బడిలో గత విద్యా సంవత్సరం 1046 విద్యార్థులు. అందరూ ఆడ పిల్లలే. 198 మంది 10వ తరగతి పరీక్షలు వ్రాస్తే వారిలో 169 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో అధిక మార్కులు 584తో కలిపి 500 పైగా మార్కులు సాధించిన 22 మందితో సహా మొత్తం 99 మంది ప్రథమ శ్రేణి సాధించారు. వారిలో నలుగురు ఐ.ఐ.ఐ.టి. సీట్లు సాధించారు. 500 పైగా మార్కులు సాధించిన వారిలో 13 మంది బి.సి. సంక్షేమ హాస్టల్ విద్యార్థినులు కావడం, అందులోని ఒక విద్యార్థిని 576 మార్కులతో రాష్ట్రం మొత్తంలో బి.సి. సంక్షేమ హాస్టల్ విద్యార్థినుల్లో ప్రథమురాలు కావడం గమనార్హం.

ఈ అంకెలు ఇలా చూస్తే ప్రత్యేకత కనిపించదు. అక్కడ పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులంతా "మేము మా చుట్టూ ఉన్న ఇతరుల్లాకాక మంచి విషయావగాహనతో ఎవ్వరినీ చూడకుండా పరీక్షలు వ్రాస్తున్నామని" కించిత్ గర్వంతో చెప్పడం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతుంది. పరీక్షల్లోనే కాదు, ఆటల్లోనూ, పాటల్లోనూ క్రియాశీలకంగా ఉంటారు. జూడో క్రీడలో రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. జిల్లా బాలోత్సవాల్లో జిల్లాలోనే ప్రథమ స్థానం దక్కించుకున్నారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం మరియు క్విజ్ వంటి అంశాల్లోనూ సత్తా చాటుతుంటారు. ఇంకేముంది? ఈ పాఠశాల గొప్పతనం ఆ నోటా ఈ నోటా తెలిసి ఉమ్మడి జిల్లాలోని దాదాపు 20 మండలాల్లోని 75 గ్రామాల నుండి పేద ప్రజలు వారి అమ్మాయిలను ఈ పాఠశాలలోనే చేర్చటంతో ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య 1215కు పెరిగింది. దగ్గరలో ఉన్న బి.సి. సంక్షేమ బాలికల వసతి గృహాలు ఖాళీ అయి ఈ ఊరి హాస్టల్ కు సిఫార్సులు పెరిగాయి. దాంతో హాస్టల్ లో 2023-24లో 300, 2024-25లో 530 గా ఉన్న విద్యార్థినుల సంఖ్య ఈ 2025-26లో 750 కి పెరిగింది. వసతి లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికార్ల జోక్యంతో మరో హాస్టల్ మంజూరైనప్పటికీ ప్రస్తుతానికి పాఠశాలలోనే వసతి ఏర్పాటు చేయబడింది. ఈ సంవత్సరం 20 మంది విద్యార్థినులు పేరున్న ప్రయివేట్ పాఠశాలల నుండి వచ్చి చేరడం, అందులోనూ స్థానిక ప్రైవేట్ పాఠశాల యజమానుల పిల్లలే ఈ పాఠశాలలో వచ్చి చేరడం పాఠశాల నాణ్యతకు నిదర్శనం. ఇదంతా ఒక ప్రభుత్వ బడి గురించే. అది కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి మండల కేంద్రంలో ఉన్న పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల. వారికి విద్యాబుద్ధులు చెప్పేందుకు గతంలో ఉన్న 28మంది ఉపాధ్యాయుల సంఖ్య ఇప్పుడు 38కి పెరిగింది.

ఇదంతా మా ప్రధానోపాధ్యాయురాలి సమర్థతేనని సగర్వంగా ఆ ఉపాధ్యాయులంటే... కాదు, మా ఉపాధ్యాయుల పనితనమేనని సగౌరవంగా ఆ ప్రధానోపాధ్యాయురాలనడం, వారి ఐక్యత, సమిష్టి కృషి, సవినయ సహకార భావానికి నిదర్శనం.

ఇది చూసి ముచ్చటేయడంతో పూర్వ విద్యార్థుల సంఘం కొంత సహకారం అందించడం మరియు ప్రగతి ప్రాజెక్ట్ వారు సైన్స్ ల్యాబ్, టాయిలెట్స్ నిర్మాణం, నిర్వహణతో పాటు వేల రూపాయల విలువైన మెరిట్ స్కాలర్ షిప్స్ అందిస్తున్నారు. ఈ పాఠశాలకు స్థానికుల మరియు ఎస్.ఎం.సి. సహకారంతో ఆటస్థలం సాధించుకున్నారు. డైనింగ్ ప్లాట్ ఫామ్, అద్భుతమైన కిచెన్ గార్డెన్, అనేక రకాల అరుదైన పూల మొక్కలతో పాఠశాల ఆవరణం అత్యంత ఆహ్లాద కరంగా ఉంటుంది. తరగతి గదులు, ఇంటిగ్రేటెడ్ ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, ఒకేషనల్ అంశాలు చాలా ప్రయోజన కరంగా తీర్చి దిద్దారు. విద్యార్థుల్లో శుభ్రత, క్రమశిక్షణ, మంచి నడవడికతో పాటు, మానవీయ విలువలు, జీవన నైపుణ్యాలు, రాజ్యాంగం పట్ల గౌరవం, దేశ సంస్కృతి పట్ల, వివిధ వర్గాల ప్రజల పట్ల సానుకూల భావనలు కలిగి ఉండటం, ప్రకృతి పట్ల శాస్త్రీయ అవగాహనను కలిగి ఉండటం వంటి విషయాలను ఉపాధ్యాయులే కాదు పాఠశాల పరిసరాలు కూడా నేర్పిస్తాయి. క్రమశిక్షణ, దేశభక్తిని నేర్పే భారత్ గైడ్స్‌లో 156 మంది ఉన్నారు. వారు ప్రతిష్ఠాత్మకమైన బ్యాండ్ పార్టీని కూడా కలిగి ఉన్నారు. సందర్భాన్ని బట్టి కార్యక్రమాలు నిర్వహించడమేగాక విజ్ఞాన యాత్రలు, క్షేత్ర పర్యటనలు కూడా వీరికి అనుభవమే.

మెగా పి.టి.ఎం., పాఠశాల వార్షికోత్సవాల వంటి కార్యక్రమాలు స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టరు, డి.ఇ.ఓ. వంటి అధికారుల మన్ననలు పొందిన సందర్భాలు అనేకం. విద్యార్థులకు ఇంటిని మరిపింపజేసే రుచి, శుచి కరమైన భోజన సదుపాయాలు, రక్షిత మంచినీరు, హాస్టల్ వార్డెన్‌తో సమన్వయము చేసుకుంటూ ప్రధానోపాధ్యాయిని పాఠశాలను నడిపిస్తున్న తీరు వల్ల పిల్లలకు చదువంటే భయం లేకపోగా మరింత ఆసక్తి, అందరికీ భిన్నంగా గణితంలో మరింత చురుకుగా ఉండటం వీరి ప్రత్యేకత. ఈ సంవత్సరం నలుగురు విద్యార్థులు ఎన్.ఎం.ఎం.ఎస్. స్కాలర్‌షిప్స్ సాధించారు.

ఈ విద్యార్థులందరి చేతి వ్రాత తెలుగు మరియు ఇంగ్లీష్‌లో ముత్యాల్లాగా అత్యద్భుతంగా ఉండడం మరో ప్రత్యేకత. దీని కోసం ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యేక శ్రద్ధతో కాలిగ్రఫీ శిక్షణ ఇప్పించడమే గాక ఉపాధ్యాయులంతా క్రమం తప్పకుండా సాధన చేయిస్తారు. అన్ని రంగాల్లో తమ పిల్లలు రాణించాలని ఉపాధ్యాయులు ఒకరికొకరు పోటీ పడి పనిచేయడం, వారి సెలవులు వాడుకోకపోవడమే గాక సెలవు దినాల్లో కూడా పని చేస్తూ, విద్యా సంవత్సరం ప్రారంభం నుండే ప్రతి రోజు పనిదినాల్లో కూడా ఉదయం, సాయంత్రం అదనపు పని గంటలు పని చేస్తారంటే నమ్మలేం. ఈ పాఠశాల క్లస్టర్ కేంద్రంగా ఉన్నందున అనేక మంది ఉపాధ్యాయులు ప్రేరణ పొందే విధంగా అక్కడి ఉపాధ్యా యుల పని తీరు ఉన్నది. ఈ సంవత్సరం 10వ తరగతిలో 210 మంది విద్యార్థులు ఉంటే అంతర్గత పరీక్షల్లో గత సంవత్సరం కన్నా ఎక్కువ మంది మంచి ఫలితాలు సాధించారు. ఫైనల్ పరీక్షల్లోనూ మంచి ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ఇటీవల జరిగినపాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పాఠశాల సాధించిన ప్రగతిని బట్టి విద్యార్థినులను, ఉపాధ్యాయ బృందాన్ని, ఎస్.ఎం.సి. ఛైర్మన్ ను ప్రత్యేకించి ప్రధానోపాధ్యాయురాలిని అభినందించి, జ్ఞాపికలతో సత్కరించి, ఈ రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్న పాఠశాలల్లో ఈ పాఠశాలనే 'ఉత్తమ పాఠశాల' అని ప్రశంసిస్తూ వారిని ప్రోత్సహిం చారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు నిర్వహించిన "పిఎంశ్రీ" పాఠశాలల తనిఖీలో అత్యంత సంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా అభినందించడం గమనార్హం.

మా విద్యార్థుల అంకిత భావముతో పాటు వారి తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ మరియు పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది సహకారం చాలా గొప్పదని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.చంద్రావతి చెప్పడం ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఉద్యమిస్తున్న ఉపాధ్యాయులందరికీ అత్యంత స్ఫూర్తి దాయకం మరియు మార్గదర్శకం.




**మార్చి 8** ప్రపంచవ్యాప్తంగా మహిళా దినోత్సవంగా జరుపుకోవడం వెనుక శతాబ్దకాల పోరాటాల చరిత్ర దాగి ఉంది. 1908లో న్యూయార్క్ నగరంలో మహిళా కార్మికులు సమాన హక్కులు, సమాన వేతనం, గౌరవప్రదమైన పని పరిస్థితుల కోసం చేసిన ఉద్యమమే ఈ దినోత్సవానికి మూలం. 1910లో కోపెన్‌హాగెన్ మహిళా సదస్సులో మార్చి 8 మహిళా హక్కుల దినంగా ప్రకటించారు. అప్పటి నుంచి ఐక్యరాజ్యసమితి నాయకత్వంలో ఈ రోజు మహిళల గౌరవానికి, సాధికారతకు అంతర్జాతీయ ప్రతీకగా నిలిచింది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2026 సందర్భంగా ఐక్యరాజ్య సమితి అధికారిక థీమ్ Rights, Justice, Action for All Women and Girls ప్రచార నినాదం **Give to Gain**.. ఇవ్వడం ద్వారా పొందడం.

ఈ ఏడాది ప్రకటించిన మహిళా దినోత్సవ థీమ్ **Give to Gain**.. సమాజానికి, కుటుంబానికి, విద్యార్థులకు మనం ఎంత ఇస్తే, అంతగా మన భవిష్యత్తు బలపడుతుందన్నది ఈ థీమ్ యొక్క సారాంశం. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న మహిళలకు ఈ భావన మరింత సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే తరగతి గదిలో మహిళా ఉపాధ్యాయురాలు రోజూ విద్యార్థులకు జ్ఞానం, సమయం, ప్రేమ, విలువలు అందిస్తుంది. ఆమె చెప్పే ప్రతి పాఠమూ రేపటి సమాజానికి చాలా ప్రయోజనకరం.

**ఉపాధ్యాయురాలు -- సేవా దాత, భవిష్యత్తు శిల్పి**

మార్చి 8... మహిళా దినోత్సవం. పూలతో, శుభాకాంక్షలతో పరిమితమయ్యే ఈ రోజు, నిజానికి ఆత్మవిమర్శకు, బాధ్యతలను గుర్తు చేసుకొని, కర్తవ్య పునరుద్ధరణకు అంకితమవ్వాల్సిన రోజు. సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించే మహిళా ఉపాధ్యాయురాలిని స్మరించుకునేందుకు ఇది అనువైన సందర్భం.

ఉపాధ్యాయురాలు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి మాత్రమే కాదు. ఆమె ఒక తల్లి, ఒక మార్గదర్శి, ఒక విలువల శిల్పి. తరగతి గది ఆమెకు కార్యాలయం మాత్రమే కాదు - అది దేశ భవిష్యత్తు రూపుదిద్దుకునే ప్రయోగశాల. చాక్ ముక్కతో ఆమె రాసే అక్షరాలే రేపటి సమాజాన్ని తీర్చిదిద్దే శిల్పాలుగా మారతాయి. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఆమె నిరంతరం తనను తాను "ఇవ్వడం" ద్వారానే నిజమైన ఫలితాన్ని "పొందుతుంది".

**కుటుంబ బాధ్యతలు - వృత్తికి ఆమె ఇచ్చే అదనపు బలం**

ఇంటి బాధ్యతలు, కుటుంబపు ఒత్తిళ్లు, కార్యాలయపు పరిమితులు-అన్నింటినీ సమతూకంగా నిర్వహిస్తూ విద్యార్థుల మనసుల్లో జ్ఞానదీపం వెలిగించే మహిళా ఉపాధ్యాయురాలి సేవ అమూల్యమైనది. ఎంతో ఓర్పుతో, సహనంతో, త్యాగంతో ఆమె తన వృత్తిని నిర్వర్తిస్తుంది. కుటుంబానికి ఆమె సమయం ఇవ్వడం వల్లే వృత్తిలో ప్రశాంతతను, స్థిరత్వాన్ని పొందుతుంది. ఇదే Give to Gain అనే ఆలోచనకు ప్రత్యక్ష ఉదాహరణ.

**మహిళా ఉపాధ్యాయుల అవసరాలు - ఇవ్వాల్సిన సహకారం**

మహిళా ఉపాధ్యాయులు సమాజానికి ఎంతో ఇచ్చినా, వారికి సరైన వృత్తి పరమైన వసతులు అందుతున్నాయా? అన్న ప్రశ్న ఈ రోజు మన ముందుంది. ఈ థీమ్ స్ఫూర్తితో ప్రభుత్వమూ మహిళలకు మరింతగా "ఇవ్వడం" ద్వారా విద్యారంగంలో గొప్ప "లాభాన్ని" పొందాల్సిన అవసరం ఉంది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని అవకాశాలు, రాయితీలు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకూ కల్పించాలి. ఉదా:కు మహిళ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం చిన్న పిల్లల సంరక్షణ నిమిత్తం 2 సం॥లు చైల్డ్‌కేర్ లీవు ఇచ్చింది. కాని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 6 నెలలు అంటే 180 రోజులు మాత్రమే చైల్డ్‌కేర్ లీవు ప్రకటించింది. అయితే సెలవు మంజూరు విషయంలో అధికారులు అనవసరమైన నిబంధనలు చూపుతూ తిరస్కరించడం, కుంటిసాకులు చెప్పడం చేస్తున్నారు.

ఒక్క చైల్డ్‌కేర్ లీవు మాత్రమే కాదు.. ఐదు రోజుల స్పెషల్ క్యాజువల్ లీవు, అబార్షన్ లీవు, మెటర్నిటి లీవు తదితర విషయాలలోనూ ఇబ్బంది పెడుతున్నారు. మహిళలకు సెలవు అవసరాన్ని గుర్తించి ఉదారంగా వ్యవహరించాలనే స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం జారీ చేయాలి. మహిళా టీచర్ల హక్కులను కాపాడాలి. అవసరమైన సందర్భాలలో సెలవుల వినియోగంపై ఆంక్షలు లేకుండా చూడాలి. ఇలాంటి చిన్న చిన్న హక్కులు, రాయితీలు ఇవ్వగలిగితే మహిళా ఉపాధ్యాయులు పూర్తి సామర్థ్యంతో పనిచేసి పాఠశాలలో మెరుగైన ఫలితాలు వచ్చేలా పనిచేస్తారు. తద్వారా పాఠశాలలు అభివృద్ధి చెందుతాయి.

**ప్రత్యేక స్టాఫ్‌రూమ్‌లు -- గౌరవ వసతిని ఇవ్వాలి**

ఇంకొక ప్రధాన అంశం.... పెద్ద హైస్కూల్స్‌లో మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన స్టాఫ్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలి. సరైన విశ్రాంతి గది, వ్యక్తిగత సౌకర్యాలు కల్పించడం ద్వారా మహిళలకు ప్రభుత్వం గౌరవాన్ని ఇస్తే, వారు మరింత ఉత్తమ సేవను అందించే లాభాన్ని విద్యాశాఖ పొందుతుంది. ఈ చిన్న చర్య కూడా Give to Gain థీమ్‌ను కార్యరూపంలో చూపుతుంది.

## కృష్ణా జిల్లా యుటియఫ్ ఉద్యమ నిర్మాత

# కా॥ మేచర్ల ఏసురత్నం 44వ వర్ధంతి



ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ కృష్ణా జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి మేచర్ల ఏసురత్నం 44వ వర్ధంతి ఫిబ్రవరి 10వ తేదీన ఉంగుటూరు (మం), తేలప్రోలులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో అప్పారి వెంకటస్వామి కుమారుడు, ప్రముఖ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఏసురత్నం మాస్టారు మరణించి 44 సం॥లు గడిచినప్పటికీ ఆయన జ్ఞాపకాలు, సమాజంపట్ల ఆయన చూపిన నిబద్ధత మరువలేనిదని పేర్కొన్నారు. ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి పోరాట మార్గం ద్వారా ఎంతోమంది ఉపాధ్యాయులకు హక్కులు సాధించుకోవడంపై మార్గదర్శిగా నిలిచారని పేర్కొన్నారు.

సంఘం పట్ల ఏ విధమైన నిబద్ధతతో హక్కులకోసం పోరాటం చేసారో అదే నిబద్ధతతో విద్యార్థులకు విద్యను బోధించడంలో, భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి అనే ముందుచూపును, సమాజానికి ఏ విధంగా సహాయపడగలరో అనే సామాజిక అంశాలను బోధించడంలో ఆయనకు ఆయనే సాటి అని పేర్కొన్నారు.

**జీవిత విశేషాలు :**

కా॥ మేచర్ల ఏసురత్నం 1935వ సం॥లో తేలప్రోలు గ్రామంలో అతి సామాన్య నిరుపేద కుటుంబీకులయిన కోటయ్య, కోటమ్మ దంపతులకు సంతానంగా జన్మించారు. వీరు తేలప్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యస్.యస్.యల్.సి. తరువాత పియుసిని పూర్తి చేసారు. బి.ఏ. కూడా చదివారు. తరువాత ఏలూరు దగ్గరలో గోపువాని పాలెంలోగల సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ కోర్సు కోసం గవర్నమెంట్ కాలేజిలో చేరి 1954-55 సం॥లో పూర్తిచేసారు.

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా కైకలూరు తాలూకాలోని రామచంద్రపురం గ్రామంలో ఉద్యోగ జీవితం ప్రారంభించారు. వీరు గోసాల గ్రామంలో పుట్టి నూజివీడులో పెరిగిన నాగరత్నం గారిని వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు సంతానం. పెద్ద అమ్మాయి శ్రీమతి కె. లీలావతి యఫ్.సి.ఐ.లో పనిచేసి ఏరియా మేనేజర్‌గా విజయవాడలో, పెద్ద అబ్బాయి ఆచార్య యం, ప్రసాదరావు ఆంధ్ర విశ్వ విద్యాలయ ంలో ఎకనామిక్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు, మరియొక అబ్బాయి శ్రీ యం. మోహనరావు పోలీస్ శాఖలో డి.యస్.పిగా, రెండవ అమ్మాయి ఆచార్య శ్రీమతి యం.ఉమాదేవి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

యుటియఫ్ ఉద్యమ నిర్మాతలలో ఒకరైన కీ.శే. నాదెళ్ళ సీతారామచారి గారి శిష్యునిగా ఏసురత్నం ముద్రపడ్డారు. గురు శిష్యులు ఇరువురూ ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితమై నిస్వార్థంగా సేవ చేసినవారే. యు.టి.యఫ్. తొలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అమరజీవి అప్పారి వెంకటస్వామి గారి సహచర్యం లో కృష్ణా జిల్లాలో యుటియఫ్ ఉద్య మాన్ని బలోపేతం చేసి ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పని చేసారు. ఉపాధ్యాయుల హృదయాలలో చెరగని ముద్రవేశారు.

ఏసురత్నం గారు యు.టి.యఫ్ కృష్ణా జిల్లా ప్రధానకార్యదర్శిగానే గాక తేలప్రోలు పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శిగా కూడా పనిచేసారు.

ఉపాధ్యాయుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నోటీసు ఇచ్చి తిరిగి వచ్చే దారిలో విపరీతమైన కడుపుపోటు కారణంగా గుడివాడ హాస్పటల్‌లో చేరారు. చికిత్స పొందుతూ ఫిబ్రవరి 10వ తేది 1982 సం॥లో తుదిశ్వాస విడిచారు. ఏసురత్నం గారి అంకితభావం, కార్యదీక్ష నేటి తరానికి మార్గదర్శకం. [

---

## బ్లాక్ బోర్డు నుంచి బంగారు భవిష్యత్తుకు

**మారుతున్న కాలానికి అనుగుణంగా -- విలువలు ఇవ్వడం**

ఈ రోజు మహిళా ఉపాధ్యాయురాలి కర్తవ్యం మరింత విస్తృతమైంది. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, నైతిక విలువలు, సమాజ బాధ్యత, లింగ సమానత్వం, ప్రజాస్వామ్య ఆలోచనలు... ఇవన్నీ విద్యార్థుల్లో నాటాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకంగా బాలికలకు ఆమె ఆత్మవిశ్వాసాన్ని, స్వాభిమానాన్ని ఇస్తే .... రేపటి తరం శక్తివంతమైన మహిళలుగా ఎదిగే లాభాన్ని దేశం పొందుతుంది.

**హక్కుల పరిరక్షణలో ధైర్యం -- వ్యవస్థకు ఆమె ఇచ్చే పాఠం**

అదేవిధంగా, ఉపాధ్యాయ వృత్తిలో ఎదురయ్యే అన్యాయాలపై మహిళా ఉపాధ్యాయురాలు మౌనంగా ఉండకూడదు. న్యాయానికి నిలబడే ధైర్యాన్ని ఆమె వ్యవస్థకు "ఇచ్చినప్పుడే", విద్యార్థుల్లో నైతిక చైతన్యాన్ని "పొందుతుంది". సమానత్వానికి, గౌరవానికి ఆమె నిలబడడం కూడా Give to Gain భావనకు మరో రూపం.

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు మన సందేశం ఒక్కటే....

**మీరు కేవలం ఉద్యోగులు కాదు...సమాజానికి నిరంతరం ఇచ్చే మహోన్నత సేవాదాతలు**

**మీరు బలహీనులు కాదు...మార్పును పొందేందుకు తరం మీద పెట్టుబడి పెట్టే మూలస్తంభాలు**

**మీ కర్తవ్యనిష్ఠే... Give to Gain స్ఫూర్తికి ప్రత్యక్ష ఉదాహరణ**

ఈ రోజున పూలతో కాదు, గౌరవంతో; శుభాకాంక్షలతో కాదు, సహకారంతో; మాటలతో కాదు, హక్కుల అమలుతో మహిళా ఉపాధ్యాయులను సత్కరించాల్సిన అవసరం ఉంది. మహిళా ఉపాధ్యాయులకు ప్రభుత్వం అవసరమైన సెలవులు, వసతులు, గౌరవప్రదమైన పని పరిస్థితులు "ఇవ్వగలిగితేనే", విద్యారంగం ద్వారా శక్తివంతమైన భారతాన్ని "పొందగలదు". అప్పుడే మహిళా దినోత్సవానికి, Give to gain నినాదానికి నిజమైన అర్థం లభిస్తుంది.

# అంతర్జాతీయ పాఠ్యాంశ పుస్తకాలలో లింగ అసమానత్వం




మొదటి సమాజం మాతృస్వామ్య సమాజంలో స్త్రీ, పురుషులు సమానంగా బ్రతక కలిగినారు ఉత్పత్తి పెరిగి వ్యక్తిగత సంపద పెరిగిన తర్వాత స్త్రీకి రక్షణ కల్పిస్తున్నమన్న భావన కల్పిస్తూ పురుషుడు స్త్రీని ఇంటికి పరిమితం చేసి వంటింటి కుందేలు చేయటం, పిల్లల్ని కని సంరక్షించడంలో స్త్రీ నిమగ్నమవ్వడం జరిగింది. తర్వాత సమాజంలో మనువాద శాస్త్రం ప్రకారం స్త్రీకి చదువుకునే హక్కు లేకపోవడం, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు సాంప్రదాయాల పేరిట స్త్రీని ద్వితీయ శ్రేణి పౌరులుగానే ఉండేటట్లుగా చేసింది

భారతదేశంలోనే కాదు అంతర్జాతీయంగా కూడా మహిళల పరిస్థితి ఇదే విధంగా కొనసాగింది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు సమాన పనికి సమాన వేతనం కావాలని, మహిళలకు పనిగంటలు తగ్గించాలని, ఓటు హక్కు కావాలని ఎన్నో పోరాటాలు చేసి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకునే అనుమతిని ఐక్యరాజ్య సమితి నుండి పొందగలిగారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వేదికగా చేసుకుని తమ హక్కుల కోసం, సమస్యల సాధనకు పోరాట, ఉద్యమాల తీర్మానాలు చేసుకోవాలని, నిర్ణయం చేసుకోవడం జరిగింది.

మార్చి 8, 2026 నాడు జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ Right...Justice... Action ..For All Women and Girl లింగ సమానత్వం, మహిళలు చట్టపరమైన హక్కులను బలోపేతం చేయడంపై దృష్టి పెడుతుంది. పక్షపాతం మూస పద్ధతులు మరియు వివక్షత విషయంలో మహిళా స్థితిపై ప్రపంచం యొక్క దృష్టిని కేంద్రీకరించటం లక్ష్యంగా పెట్టుకుంది.

భారతదేశంలో లింగ అసమానత్వాన్ని, మూస విధానాలను గమనిస్తే....

**ఇంట్లో లింగ వివక్షత:**

పిల్లల్ని చిన్నతనం నుండి ఆడ పని, మగ పని విడదీసి చెప్పి చేయించటం ,మగపిల్లల్ని స్వేచ్ఛగా బ్రతకనిస్తూ అధిక ప్రాధాన్యతో.. మెరుగైన విద్యను చెప్పించడం ,ఆర్థిక వెసులుబాటును బట్టి సౌకర్యాల కల్పించటం పోషకాహారం ఇవ్వటం జరుగుతుంది. ఆడపిల్లలను సర్దుకుపోయే తత్వం పెంచటం, ఇంటి పనులు, వంట పనులు నేర్పిస్తూ పనిలో తల్లికి సాయంగా ఉండేటట్లుగా పెంచటం.

**సమాజంలో:**

"మగ పిల్లవాడు తిరగక చెడతాడు ఆడపిల్ల తిరిగి చెడుతుంది" అనే సామెతలతో మగ పిల్లవాడిని దృఢంగా, ఆత్మస్థైర్యంతో పెంచుతారు. ఆడపిల్లల్ని భద్రత పేరుతో ఎక్కువ శాతం ఇంట్లో ఉంచి సుకుమారంగా, సౌకుమార్యంగా పెంచడం జరుగుతుంది. ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగం చేస్తున్న ఆడపిల్లలు కూడా ఎవరైనా లైంగికదాడికి పాల్పడి ఎదిరించే సామర్థ్యం, ధైర్యం లేకపోవడంతో అత్యాచారాలకు గురవుతుంటారు.

తల్లిదండ్రులు, ప్రభుత్వము బాలికలకు ప్రాథమిక పాఠశాల నుండి ఆత్మరక్షణ విద్యలు నేర్పిస్తే కొంతవరకు ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

**యూనెస్కో వారి పరిశోధన:**

ప్రపంచమంతటా బడి పుస్తకాల్లో మహిళలను పూర్తిగా విస్మరించడమో లేదంటే మూసపాత్రల్లో చిత్రీకరించడమో జరుగు తోంది. ఇది స్కూళ్లలో లింగ అసమానత్వాన్ని పెంచుతోందని ఒక పరిశోధనలో వెల్లడైంది.

హైతీలోని ఒక ప్రాథమిక పాఠశాల టెక్స్ట్ బుక్.. అమ్మలు "పిల్లల సంరక్షణ చూసుకుంటూ అన్నం వండుతారు" అని.. తండ్రులేమో "ఆఫీసుల్లో" పనిచేస్తారని పిల్లలకు నేర్పిస్తుంది.

ఇక పాకిస్తాన్‌లోని ఒక పాఠ్యపుస్తకంలో శక్తిమంతమైన, అధికారం గల రాజకీయవేత్తలందరినీ పురుషులుగానే చిత్రీకరించారు.

టర్కీలో ఒక బాలుడు తాను డాక్టర్ కావాలని కలగంటున్నట్లు చిత్రీకరించిన పాఠ్యపుస్తకం.. బాలిక తాను భవిష్యత్తులో తెల్ల గౌను ధరించిన పెళ్లికూతురుగా కలగంటున్నట్లు చూపుతోంది.

బాలిబాలికల ఆలోచనారీతులను చిన్న వయసు నుంచే వివక్షాపూరితంగా ప్రభావితంచేసే ఇలాంటి పాఠ్యాంశాల జాబితాకు అంతులేదు. ఈ జాడ్యానికి భౌగోళిక సరిహద్దులూ లేవు.

ప్రాథమిక పాఠశాలల పాఠ్యపుస్తకాల్లో లింగ వివక్ష చాలా తీవ్రంగా ఉంది. దిగ్భ్రాంతికరంగా భూమి మీద ప్రతి ఖండంలోనూ దాదాపు ప్రతి దేశంలోనూ ఇది ఒకే రీతిన ఉందని నిపుణులు చెప్తున్నారు. ఇది "కళ్ల ముందే ఉన్నా కనిపించని" సమస్య.

స్త్రీపురుషులకు వారి వారి జెండర్‌ను బట్టి సమాజంలో చిరకాలంగా ఖాయం చేసిన పాత్రలు ఉన్నాయనే ముసుగులో వారి వారి మూస నమూనాలను చిన్నారుల మెదళ్ల లోకి ఎక్కిస్తున్నారు" అని ప్రొఫెసర్ రే లెస్సర్ బ్లూమ్‌బర్గ్ పేర్కొన్నారు.

యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియాకు చెందిన సోషియాలజిస్ట్ బ్లూమ్‌బర్గ్.. ప్రపంచ వ్యాప్తంగా స్కూళ్లలో పాఠాలు చెప్పేందుకు ఉపయోగించే పాఠ్య పుస్తకాలను దశాబ్ద కాలంగా అధ్యయనం చేస్తున్నారు. ఆ పుస్తకాల్లో మహిళలను ప్రణాళికాబద్ధంగా విస్మరించడమో వారిని పరాధీన పాత్రల్లో చిత్రీకరించడమో చేస్తున్నారని ఆమె తెలిపారు. విద్యాంశాల్లో లింగ వివక్ష గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఎందుకంటే.. లక్షలాది మంది పిల్లలు స్కూలు విద్యకు దూరంగా ఉన్న పరిస్థితుల్లో అది పతాక శీర్షికలకు ఎక్కే విషయం కాదని భావిస్తున్నారు" అని ఆమె వివరించారు.

2000 సంవత్సరం నుంచీ స్కూళ్లలో చేరుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ.. ఇంకా ఆరు కోట్ల మందికి పైగా పిల్లలు ఎన్నడూ బడిలో అడుగు పెట్టలేదని.. అందులో 54% మంది బాలికలేనని యునెస్కో చెప్తోంది.

"ఈ పుస్తకాలు లింగ అసమానత్వాన్ని ప్రచారం చేస్తాయి. భావి ప్రపంచపు బాలికలకు గత కాలపు పుస్తకాలతో పాఠాలు చెప్పకూడదు" అని ప్రొఫెసర్ బ్లూమ్‌బర్గ్ అంటారు.

ఇరాన్‌లో విద్యాశాఖ రూపొందించిన పుస్తకాల్లో 80 శాతం పాత్రలు పురుషులవే. భారతదేశం రూపొందించిన పుస్తకాల్లో మహిళలను చూపే చిత్రాలు 6 శాతం మాత్రమే ఉన్నాయి. జార్జియాలో ఇది 7 శాతంగా ఉంది.

2007లో నిర్వహించిన ఒక అధ్యయనంలో కామెరూన్, ఐవరీ కోస్ట్, టోగో, ట్యునీసియాల్లోని గణిత పాఠ్యపుస్తకాల్లో పురుష పాత్రలతో పోల్చిచూసినపుడు మహిళల పాత్రలు 30 శాతం కన్నా తక్కువగా ఉన్నాయి.

యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్), చైనాలలో సైన్స్ పుస్తకాలను పరిశీలించి నపుడు.. 87% పాత్రలు పురుషులవేనని వెల్లడైంది. ఆస్ట్రేలియాలో 2009లో నిర్వహించిన ఒక అధ్యయనంలో.. పాఠ్యపుస్తకాల్లోని పాత్రల్లో 57 శాతం మంది పురుషులే ఉన్నారు. నిజానికి ఆ దేశంలో పురుషుల కన్నా మహిళల సంఖ్యే ఎక్కువ.

"అధికాదాయ దేశాల్లో పాఠ్యపుస్తకాలు కొంచెం ఎక్కువగా ప్రగతి దాయకంగా ఉంటాయని ఎవరైనా భావిస్తారు. కానీ ఆస్ట్రేలియాలో మేనేజర్ పోస్టుల్లో మహిళల కన్నా రెండింతల మంది పురుషులను చిత్రీకరించారు. ఇక రాజకీయాలు, ప్రభుత్వం విషయానికొస్తే మహిళల కన్నా పురుషులను నాలుగు రెట్లు ఎక్కువగా చిత్రీకరించారు" అని ప్రొఫెసర్ జేర్ వివరించారు.

"ఇక ఒక చైనా పుస్తకం మరీ విడ్డూరంగా ఉంది. అందులో 1949 కమ్యూనిస్టు విప్లవంలో కేవలం ఒకే ఒక్క కథానాయకిని చూపించారు" అని ప్రొఫెసర్ బ్లూమ్‌బర్గ్ తెలిపారు. పైగా ఆమెను చట్టం కోసం పోరాడుతున్నట్లు గానో, మావోతో కలిసి ముందు వరుసలో పోరాటం చేస్తున్నట్లుగానో చూపలేదు. వర్షంలో నిలుచున్న ఒక పురుష గార్డుకి ఆ మహిళ పాత్ర గొడుగు అందిస్తుంది.. అంతే" అని ఆమె వివరించారు.

సమస్య ఇప్పటిది కాదు. అభివృద్ధి చెందిన దేశాల్లో సంస్కరణల కోసం స్త్రీవాదం ఒత్తిడి తెచ్చిన 1980ల నుంచీ పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు.

2011లో అమెరికా చేపట్టిన ఒక అధ్యయనంలో.. శీర్షికల్లో మహిళల కన్నా రెండు రెట్లు ఎక్కువగా పురుషుల ప్రాతినిధ్యం ఉందని, ప్రధాన పాత్రల్లో మహిళల కన్నా పురుషుల ప్రాతినిధ్యం 1.6 శాతం అధికంగా ఉందని అంచనా వేశారు. 20వ శతాబ్దంలో ప్రచురించిన 5,600 పైగా పిల్లల పుస్తకాలను పరిశీలించి నిర్వహించిన ఆ అధ్యయనాన్ని ఈ రంగంలో నిర్వహించిన అతి పెద్ద పరిశోధనగా అభివర్ణిస్తుంటారు.

ఈ సమస్యను మొదట గుర్తించినప్పటి నుంచీ లింగ వివక్షను తగ్గించడంలో కొంత పురోగతి ఉంది కానీ అది "చాలా నెమ్మది"గా ఉందని నిపుణులు చెప్తున్నారు. పాఠ్యపుస్తకాల్లో లింగ వివక్ష ధోరణులు ఎంత లోతుగా ఉన్నా యంటే.. అవి బాలికల విద్యను నిర్లక్ష్యం చేయడంతో పాటు, వారి వృత్తి పరమైన, జీవన పరమైన ఆకాంక్షలను చాలా వరకు కుదించి వేస్తున్నాయని, లింగ సమానత్వాన్ని సాధించడానికి అవి "పరోక్షమైన అడ్డంకి"గా ఉన్నాయని యునెస్కో చెప్తోంది.

పాఠాల్లోని వాక్యాలు, పేర్లు పెట్టిన పాత్రలు, శీర్షికల్లో ప్రస్తావనలు, సూచికల్లో ప్రస్తావనలు, ఇతరత్రా అంశాల్లో లెక్కించి చూస్తే.. "పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా చాలా తక్కువగా ఉంది" అని యూనివర్సిటీ ఆఫ్ ఆల్బనీకి చెందిన ఆరన్ బెనావట్ పేర్కొన్నారు. యునెస్కో 2016 గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (జీఈఎం) నివేదికకు ఆమె డైరెక్టర్‌గా పనిచేశారు. ఇది ముప్పేట సమస్యని నిపుణులు చెప్తున్నారు.

ఇందులో చాలా ముఖ్యమైన కోణం.. మానవాళి మొత్తానికి ప్రతినిధిగా పురుషులను మాత్రమే ఉపయోగించే లింగ వివక్షతో కూడిన భాషను ఉప యోగించడం.

రెండో అంశం.. విస్మరణ. పాఠ్యాంశాల్లో తరచుగా మహిళలకు చోటు ఉండదు. చరిత్రలోనూ రోజువారీ జీవితంలోనూ మహిళల పాత్రలు కూడా పురుష పాత్రలలో కలిసిపోతాయి.

"నాకు ప్రత్యేకంగా గుర్తున్న ఒక పాఠ్యపుస్తకం ఉంది. అందులో ఉన్న ఏకైక మహిళ మేరీ క్యూరీ" అని ప్రొఫెసర్ బ్లూమ్‌బర్గ్ తెలిపారు.

"మరి ఆమె రేడియం కనుగొన్నట్లు చూపారా అంటే.. అదీ లేదు. ఆమె ఎంతో గొప్పగా కనిపిస్తున్న తన భర్త వెనుక బిడియంగా నిల్చుని ఉన్నట్లు.. అతడు ఎవరితోనో మాట్లాడుతుంటే ఆమె వెనుక నుంచి చూస్తున్నట్లు చిత్రించారు" అని బ్లూమ్‌బర్గ్ వివరించారు.

ఇక మూడో విషయం.. ఇంటా బయటా పురుషులు, స్త్రీలు చేసే పనుల గురించి సంప్రదాయ మూస పాత్రలు.. స్త్రీ, పురుషుల నుంచి ఆశిస్తున్నట్లుగా వ్యక్తీకరించే సామాజిక ఆకాంక్షలు, లింగాన్ని బట్టి ఆపాదించే లక్షణాలు. పిల్లల ప్రాపంచిక దృక్పథం మీద పాఠ్య పుస్తకాలు చూపగల ప్రభావాన్ని విద్యారంగ పరిశోధనలు ఇప్పటికే వివరంగా నమోదు చేశాయి.

ఉదాహరణకు ఇజ్రాయెల్‌లో మొదటి తరగతి విద్యార్థులను అధ్యయనం చేసినపుడు.. పురుషులను, మహిళలను సమానంగా చిత్రీకరించిన పుస్తకాలు చూసిన విద్యార్థులు.. చాలా వృత్తులు బాలురు, బాలికలు ఇద్దరికీ సరిపోతాయనే ఆలోచనలను వెలిబుచ్చారు. అయితే లింగ వివక్ష గల పాఠ్యపుస్తకాలను చదివిన వారు.. లింగపరమైన మూస పాత్రల కోణంలో ఆలోచిస్తున్నారు.

అలాగే.. ప్రపంచ వ్యాప్తంగా స్టెమ్ విద్యా రంగాలైన సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్ విద్యాభ్యాసం కోసం వెళ్లే బాలికల సంఖ్య తక్కువగా ఉండటానికి – పాఠ్యపుస్తకాల్లో మహిళా శాస్త్రవేత్తలను తక్కువగా చిత్రీకరిం చడానికి సంబంధం ఉందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**ప్రభావవంతమైన పాఠాలు:**

స్కూలు పిల్లలకు సమాజంలో మామూలు విషయాలు ఏమిటనే అవగాహనను ఈ పుస్తకాలు కల్పిస్తాయని, ఇది పిల్లల ఆలోచనలను వివక్షాపూరితంగా రూపొందిస్తాయని నిపుణులు చెప్తున్నారు. దేశంలోని విద్యారంగంలో పాఠ్యపుస్తకాలు శక్తిమంతమైన పనిముట్లు.

విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయి వరకు పాఠ్యపుస్తకాల్లో 32,000 పేజీలు చదువుతారని పరిశోధన చెప్తోంది. క్లాస్ వర్క్‌లో దాదాపు 75 శాతం, హోంవర్క్‌లో 90 శాతం విద్యార్థులే చేస్తారు. ఇంకా ఉపాధ్యాయుల ప్రణాళికలో చాలా వరకూ విద్యార్థులు పూర్తిచేస్తారు.

ఇంటర్నెట్, ఇతర డిజిటల్ వనరులు అందుబాటులోకి రావడం వల్ల అభ్యాస పరికరాల శ్రేణి విస్తృతమవుతున్నా కూడా.. "చాలా దేశాల్లో ప్రత్యేకించి పేద దేశాల్లో పాఠ్యపుస్తకాలే ప్రధానంగా ఉన్నాయి" అని ఆరన్ బెనావట్ పేర్కొన్నారు.

"బాలురు, బాలికలు ఏమేం చేయాలి అనే దాని మీద పాఠ్యపుస్తకాలు చాలా సంకుచిత భావనలను చూపుతున్నపుడు.. స్కూలు పిల్లలు సమాజం అలాగే ఉంటుందని, ఉండాలని భావిస్తారు" అని ప్రొఫెసర్ జేర్ వివరించారు.

**ప్రభుత్వం చేయాల్సిన కార్యక్రమం:**

1. లింగ వివక్షత లేని పాఠ్యాంశాలను ప్రవేశ పెట్టాలి
2. పాఠ్య పుస్తకాల్లో స్త్రీ పురుషులకు సమాన ప్రాధాన్యత కూడిన వృత్తి చిత్రాలతో రూపొందించాలి.

**ఉపాధ్యాయులుగా మనం చేయాల్సినవి:**

1. ఏ పాఠాన్ని బోధిస్తున్నా లింగ సమానత్వ అవసరాన్ని, అది లేకపోతే వచ్చే సమస్యలను విద్యార్థుల నుండి రాబట్టాలి,వాటికి తగిన ఉనికను ఇవ్వాలి.
2. విద్యార్థులకు ఆడ పని, మగ పని అని వేరుగా ఏ సందర్భంలోనూ వ్యక్తీకరించకుండా బోధన జరగాలి.
3. ప్రతి ఉపాధ్యాయుడు తానే భావి ప్రపంచ నిర్మాతనని, తాను, తనవారు విధిగా ఆ ప్రపంచంలోనే ఉండాలని, ఈ ప్రపంచం అద్దమని అది తన ప్రతిబింబాన్నే చూపుతుందని ఉల్లి మొక్కలు నాటి మల్లె పూవులు పూయమంటే పూయవని గుర్తు పెట్టుకుని, గుర్తెరిగి మసలాలి.

(చిన్న కథ)

# అమ్మా నేను వస్తున్నా



ఎం.జోగిరాజు
కృష్ణా జిల్లా

అరుణ, కిరణ్ ఇద్దరూ పెద్దలని ఎదిరించి ఇంట్లో ఇష్టం లేని పెళ్లి చేసుకున్నారు. అరుణ ఒక అనాధ కులమేమిటో, గోత్రమేమిటో తెలియని అమ్మాయిని చూస్తూ చూస్తూ ఇంటికి కోడలుగా ఎలా తెచ్చు కుంటాంరా అన్న కిరణ్ తల్లి మాటలు ఇంకా చెవుల్లో తిరుగుతూనే ఉన్నాయి తనకి. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదుగా.

అరుణ ఇపుడు ఒట్టిమనిషి కాదు మూడో నెల దాటిందంట వంశోద్ధారకుడు పుడితే ఇంటికి తెచ్చుకోవా వదినా అన్న మాటలు కిరణ్ తల్లి కాంతమ్మని కుదిపేసాయ్ ఎన్ని సినిమాలు చూడలేదు. నటించడం నాకు నేర్పాలా అనుకుంటూ కొడుకు గడప తొక్కింది కాంతమ్మ..

అరుణా అరుణా నా తల్లీ అరుణా అంటూ తలుపు కొట్టింది కోడల్ని ప్రేమగా పిలుస్తూ. తలుపు తీసి ఒక్కసారిగా అవాక్కయింది అరుణ..తేరుకొని రండి అత్తయ్యా అని లోపలికి పిలిచింది. అబ్బాయి లేడా ఇంకా రాలేదా నీ ఆరోగ్యం ఎలా ఉంది? ఇలా కూర్చో ఏ అచ్చట ముచ్చట నోచుకోని దానివి మా ఇంటికి తీసుకుని వెళదామని వచ్చాను అని మాటల వర్షం కురిపించి కూర్చుంది. కిరణ్ రావటంతో ఒక్కసారిగా ఎక్కడ లేని ప్రేమ వొలకపోసింది.

ఒరేయ్ నేను చాలా పెద్ద తప్పు చేశాను మిమ్మల్ని ఇలా వొదిలేసి పదండ్రా మనింటికి అంటూ ఏడుపు నటించింది. కరిగిపోయిన కిరణ్ అరుణని ఒప్పించాడు. అరుణ కాదనలేకపోయింది. ఇంటికి తీసుకుని వెళ్లి హారతి ఇచ్చి మరీ స్వాగతం పలికింది కాంతమ్మ. తల్లి లేని బిడ్డవు నువ్వు ఈరోజు నుండి నేనే నీకు తల్లిని నన్ను అత్తయ్యా అని పిలవద్దు అమ్మా అని పిలువు అరుణా అని కొత్త నాటకానికి తెర తీసింది. రేపు ఉదయమే నీకు శ్రీమంతం. ఏ అచ్చటా ముచ్చటా తీరని నీకు నేనే చేస్తాను అని కరుణ రసం కురిపించింది.

సీమంతం అట్టహాసంగా ముగిసింది. స్కానింగ్ కోసం డాక్టర్ దగ్గరకి వెళ్ళాలి రేపు ఉదయం అన్నాడు కిరణ్. మరుసటి రోజు ఉదయాన్నే డాక్టర్ దగ్గరికి వెళదామని ఆటో పిలుచుకొని వచ్చాడు. అరుణని ఆటోలో కూర్చోబెట్టి వాటర్ బాటిల్ తీసుకువస్తానని ఇంట్లోకి వెళ్ళాడు. ఒక్కమాటు ఇటు రమ్మని పిలిచింది కాంతమ్మ కొడుకుని. ఏంటమ్మా అన్న మాటలు వినపడ్డాయి అరుణకి. ఏమనుకుంటున్నావ్ అని అడిగింది. దేని గురించమ్మా అన్నాడు కొడుకు ప్రశ్నార్థకంగా.

ఎవరు పుడతారు అని అనుకుంటున్నావు అంది విశదంగా. ఏమిటమ్మా నువ్వు కూడా ఈరోజుల్లో అన్నాడు తేలిగ్గా కొట్టి పారేసినట్టు. ఇప్పుడే మేలుకోవాలిరా పిచ్చోడా అంది కాంతమ్మ. అమ్మా ఐతే ఇప్పుడేమంటావు నన్ను ఎందుకు పిలిచావ్, మేము ఏమి చెయ్యాలి అని గుక్క తిప్పుకోకుండా ప్రశ్నలతో హడావుడి చేసాడు కిరణ్. అలా అడిగావ్ బాగుంది. అమ్మ మాట విను బాగు పడతావ్, ఇష్టం లేని పెళ్లి చేసుకున్నావ్ కాదనలేదు, అలా అని నాకు ఇష్టంలేని ఆడపిల్లని కనొద్దు ఈ అమ్మ మాట వినరా అంది తల్లి కాంతమ్మ. అమ్మా!అంటూ ఒక్కసారిగా బయటికి వెళ్లి ఆటో ఎక్కాడు అరుణ కి నీళ్ల సీసా ఇచ్చి. ఏంటండీ ఇంత సేపు ఉన్నారు ఇంట్లో అనడిగింది అరుణ వాళ్ళ మాటలు విని కూడా విననట్టు అసహనంగా. ఏమి లేదు అని తిన్నగా హాస్పిటల్‌కి పోనివ్వు అన్నాడు డ్రైవర్‌తో. స్కానింగ్ ఐపోయింది బేబీ హెల్దీగా ఉంది, డాక్టర్ గారు మిమ్మల్ని వెళ్లొచ్చు అన్నారు అంది సిస్టర్. బయటికొచ్చి ఇంటి లోపల ఏమి జరిగిందో కాంతమ్మ ఏమి మాట్లాడిందో అరుణకి చెప్పాడు కిరణ్. తన భర్త నిజాయితీకి లోలోపల నవ్వుకుంది అరుణ. మరి ఇపుడు ఏమి చేద్దాం అని అడిగింది భర్తని ఏమి ఎరుగని దానిలా. ఏదో చేసేవాడ్ని .. అయితే డాక్టర్ గారిని బేబీ ఎలా ఉంది అని అడిగాను కానీ పాపా, బాబా అని అడగలేదు కదా అన్నాడు కిరణ్.

మరి ఆడపిల్ల పుడితే కాంతమ్మ అని పేరు పెట్టటానికి సిద్ధం అయ్యారన్న మాట అని నవ్వుతూ అడిగింది అరుణ. ఎవరు పుట్టినా సమ్మతమే, నువ్వు అన్నట్టు అమ్మాయి పుడితే మాత్రం కాంతమ్మ అని కాదు శాంతమ్మ అని పేరు పెడదాము అని కిరణ్ అనేసరికి ఒక్కసారిగా అరుణ తన తల్లిని ఎరక్క పోయినా ఆ పేరు మాత్రం తన ఎదను తాకింది.

ఆటో అబ్బాయి సార్ ఎటు తిరగాలి అని అడిగేసరికి రైట్ సైడ్ మా ఇంటికి పోనివ్వు అన్నాడు కిరణ్. ఆటో అబ్బాయి అర్థమైంది సార్ అనేశాడు ఆనందంగా. ఇవన్నీ లోపల నుండి వింటున్న ఫిమేల్ బేబీ మాత్రం హమ్మయ్య నన్ను మా అమ్మ నాన్న పుట్టనిస్తారు బ్రతకనిస్తారులే ఏమి భయం లేదు అనుకుంటూ ఎంచక్కా నోట్లో వేలు వేసుకుని నిద్రలోకి జారుకుంది. నెలలు నిండి నేను వచ్చేస్తున్నా అంటూ ఈ సుందర ప్రపంచంలోకి లోపల ఉండి విన్నవన్నీ మర్చి పోయి క్యార్ అంటూ అడుగు పెట్టింది.



## ఐక్యఉపాధ్యాయ

| | | |
|---|---|---|
| సంవత్సరం చందా | రూ. | 200.00 |
| 2 సం॥ల చందా | రూ. | 375.00 |
| అర్థ దశాబ్ది చందా (5 సం॥లు) | రూ. | 850.00 |

## ఐక్యఉపాధ్యాయలో ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| 4వ కలర్ పేజీ | రూ. | 30,000.00 |
| 2,3 కలర్ పేజీ | రూ. | 20,000.00 |
| లోపలి కలర్ పేజీ | రూ. | 15,000.00 |


# వివక్షతను విడనాడితేనే వికసిత భారత్ సాధ్యం




అంతర్జాతీయ జాతి వివక్షతా నిర్మూలన దినోత్సవం మార్చి 21వ తేదీన జరుపుకుంటున్న నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా నేటికీ కొనసాగుతున్న అనేక వివక్షతలను ఈ సందర్భంగా మననం చేసుకుంటూ, ఈ రుగ్మతలను పారద్రోలటానికి ప్రపంచ దేశాలు చేయి చేయి కలిపి సమిష్టి కృషితో ముందుకు సాగాలి.మరియు ముఖ్యంగా మన దేశంలో ఉన్న అనేక అసమానతలు, వివక్షతలను సరైన కోణంలో విశ్లేషణ చేసి, రాజ్యాంగ ప్రకారం సమ న్యాయం,సమాన హక్కులు ప్రసాదించవలసిన బాధ్యత మన రాజ్యాంగ వ్యవస్థలతో పాటు, మన పాలకులు పైనా కూడా ఉంది అనే విషయాన్ని మరువకూడదు. అంతర్జాతీయ జాతి వివక్ష నిర్మూలన దినోత్సవం, ప్రతి సంవత్సరం మార్చి 21 నిర్వహించ బడుతోంది. 1960లో, వర్ణవివక్ష పాస్ చట్టాలకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలోని షార్ప్‌విల్లేలో జరిగిన శాంతియుత ర్యాలీపై పోలీసులు జరిపిన కాల్పులలో 69మంది మరణించగా, 180మంది గాయపడ్డారు. 1966లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అన్ని రకాల జాతి వివక్షలను తొలగించడానికి తన ప్రయత్నాలను రెట్టింపు చేయాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిస్తూ మార్చి 21వ తేదీని జాతి వివక్ష నిర్మూలన కోసం అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించింది.

ఈ భూగోళం మీద మన ఐక్యరాజ్యసమితి గుర్తించిన దేశాలు సుమారు 197 ఉన్నాయి.. వర్ణ వివక్షత, జాతి వివక్షత అనే మాటలు మనం అందరం తరచూ వింటూ ఉంటాం. దీని ప్రభావాన్ని ముందుగా చవిచూసింది నల్ల జాతీయులు.. దక్షిణ ఆఫ్రికా కేంద్రంగా జాతి వివక్షతపై అసమాన పోరాటం చేసిన యోధుడు నెల్సన్ మండేలా.. ఇదే విషయంలో అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ జరిపిన పోరాటం కూడా మరువరానిది... వీరి పోరాటాలు ఫలితంగానే సమానత్వం మొగ్గ తొడిగింది.. దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలు నేడు సౌభ్రాతృత్వం, సమానత్వం వంటి అంశాలు ఆధారంగా ముందుకు సాగుతున్నాయి... అయినప్పటికీ అప్పుడు అప్పుడు జాతి వివక్షత పడగ విప్పి అవహేళన చేస్తూ ఉండటం ఇటీవల కాలంలో కరోనా సమయంలో అమెరికాలో చూసాం..."జార్జ్ ఫ్లాయిడ్" అనే నల్ల జాతీయుడిని అమెరికా పోలీసులు అనాగరికంగా హింసించి, మరణించేటట్టు చేయడం జరిగింది. "ఐ కెన్నాట్ బ్రీత్" అంటూ ఆఖరి మాటలు పలుకుతూ మరణించిన జార్జ్ ఫ్లాయిడ్ మరణం మొత్తం ప్రపంచాన్ని జాతి వివక్షతపై, తెల్ల వారి అహంకారంపై నిరసన ఆగ్రహ జ్వాలలు ఉవ్వెత్తున లేచాయి... అదే విధంగా ఇటీవల కెనడాలో భారతీయులపై దాడులు జరిగాయి.. ఇంకా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో జాతి, వర్ణ వివక్షత ఆధారంగా కాల్పులు, దాడులు చేయడం జరుగుతుంది.. ఇక ఇటీవల కాలంలో "పెహల్గాం" కాల్పులు కూడా పాకిస్థాన్ ఉగ్ర వాదులు మత ఆధారంగా భారతీయులను దారుణంగా కాల్చి చంపారు...ఇక మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో హిందు వులపై దాడులు చేయడం జరుగుతుంది.. ఆఫ్ఘనిస్తాన్ లో, ఇరాన్‌లో లింగ వివక్షత ఆధారంగా మహిళలను అణిచివేయడం చూస్తూనే ఉన్నాం...ఇక ఈ విధంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో జాతి వర్ణ, మత, లింగ వివక్షతలు కొనసాగుతున్నాయి... జాతి/ వర్ణ వివక్షతకు గురవుతున్న వారిలో 37% శాతం ఆఫ్రికన్లు, 20%మంది ఆసియన్ ప్రజలు, 13% యూరోపియన్ యూనియన్ వారు, 14% ముస్లింలు, 10% ప్రయాణికులు, ఐరిష్ ప్రజలు కూడా వివక్షతలకు గురవుతున్నారు అని నివేదికలు చెబుతున్నాయి.. ఇక మన భారత దేశంలో అనేక వేల మంది రకరకాల వివక్షతలకు గురవుతున్నారు. మానసిక, శారీరక హింసలకు గురవుతున్నారు.. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతున్నారు.మన ఆంధ్రప్రదేశ్ లో కరోనా కాలంలో రకరకాల వివక్షతలకు గురై మరణించిన డాక్టర్ సుధాకర్ ఒకరు..

ఇక రెండో సారి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిరంకుశ విధానాలతో అమెరికా ఫస్ట్ అంటూ, జాతీయ వాదాన్ని, ఆధిపత్య ధోరణి ప్రదర్శించడం జరుగుతుంది... ముఖ్యంగా మన భారతీయులను అక్రమ వలసదారులు పేరిట హీనంగా చేతులు కట్టి, కళ్ళుమూసి యుద్ధ విమానాల్లో మనదేశానికి తరలించిన విషయం మన కళ్ళ ముందు కదలాడుతుంది... అయినా మన ప్రధాని నోరు విప్పకపోవడం బాధాకరం...ఇక గత మూడు సంవత్సరాలుగా మణిపూర్‌లో నాగా, కుకీల మధ్య జరుగుతున్న దాడులు ప్రేరేపితమైనవి అని గ్రహించాలి.. అయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కట్టడి చేయడానికి తగు చర్యలు చేపట్టకపోవడం శోచనీయం..



ఐ. ప్రసాదరావు
యుటిఎఫ్ సీనియర్ నాయకులు

ప్రస్తుతం గత పన్నెండు సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న నేటి పాలకులు అసలు భారతదేశ ఔన్నత్యం "భిన్నత్వంలో ఏకత్వం" అనే విషయాన్ని మరిచి అన్ని " ఒకే" అనే భావనతో ముడిపెడుతూ మత పరమైన అంశాలు జోడిస్తూ, స్వయంగా కొన్ని కార్యక్రమాలు చేపడుతూ మిగిలిన మతాలను తక్కువగా చూస్తూ పాలన చేయడం జరుగుతుంది... ఇది ఏమాత్రం శ్రేయస్కరం కాదు అని గ్రహించాలి. తరచూ ప్రజల మధ్య కుల, మత, భాష, లింగ, ప్రాంతాలవారీగా వివక్షత, విద్వేషాలు ప్రోత్సహించడం జరుగుతుంది. అధికారం చేపట్టడానికి ఆ,యా రాష్ట్రాల్లో సున్నితమైన అంశాలను రెచ్చగొట్టే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.. ఇటువంటి అంశాల వల్ల కూడా ముఖ్యంగా మనదేశంలో ఐక్యతకు భంగం కలుగుతుంది. ఎవరైనా అడిగితే అర్బన్ నక్సలైట్లు అని ముద్ర వేసి, నిర్బంధం చేయడం జరుగుతుంది... ఇక ఇటీవల కాలంలో ఉత్తర భారతదేశం/ దక్షిణ భారతదేశం అనే విభజన తరచూ మనకు కనిపిస్తుంది... నేటి పాలకులు ఎక్కువగా నిధులు, ప్రాజెక్టులు ఉత్తర భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు ఎక్కువగా కేటాయించడం స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే హిందీ భాషను బలవంతంగా రుద్దడానికి ప్రయత్నాలు చేస్తున్నారు... బడ్జెట్ కేటాయింపులు కూడా ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాలకు ముఖ్యంగా యన్.డి.ఏ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఎక్కువగా కేటాయించడం, ఎన్నికల జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఉత్తర/ దక్షిణ అనే వివక్షత నేటి పాలకుల హయాంలో స్పష్టంగా కనిపిస్తుంది... గతంలో జాతి వివక్షత అనే విషయం ప్రపంచ వ్యాప్తంగా అలజడి సృష్టిస్తే, నేడు అనేక దుర్భర వివక్షతలు పుట్టుకొచ్చాయి.. దీంతో అనేక దేశాలు అంతర్గత కలహాలు, అంతర్యుద్ధాలతో అతలాకుతలం అవుతున్నాయి. మయన్మార్, బంగ్లాదేశ్, సుడాన్, పాకిస్థాన్ ఇలా పలు దేశాలు సంక్షోభాలతో తల్లడిల్లు తున్నాయి.

ఇక మనదేశంలో ఉన్న అనేక కుల, మత, భాష, లింగ ప్రాంతీయ వివక్షతలను జ్యోతిరావు పూలే, నారాయణ గురు, సావిత్రి బాయ్ పూలే, అంబేద్కర్, రఘుపతి వెంకటరత్నం నాయుడు, వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటి అనేక సంఘసంస్కర్తలు రూపుమాపేందుకు ప్రయత్నం చేశారు.. సమానత్వం, ప్రజాస్వామ్యం, సమాన హక్కులు, మానవ హక్కులు, ఏకత్వం, సహనం, వైవిధ్యం పట్ల గౌరవం, న్యాయం, సామ్యవాదం, లౌకిక వాదం అంటి అనేక అంశాలు యావత్ భారత ప్రజానీకాన్ని ఒకటిగా చేసాయి... దీని ద్వారానే బ్రిటిష్ ప్రభుత్వాన్ని పడదోసి, స్వతంత్ర భారతాన్ని నిర్మించుకోవడం జరిగింది... దీనికి తగ్గట్టుగానే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం తయారు చేసి, మన అందరికీ ప్రసాదించారు. రాజ్యాంగం ఆధారంగా గత డెబ్బై ఎనిమిది సంవత్సరాలుగా మన దేశం ప్రయాణం చేస్తుంది... అయితే ఇటీవల పాలకులు "ఒకే" అనే భావన ప్రోత్సహించడం వలన కొన్ని వివక్షతలు పుట్టుకొస్తున్నాయి. ఇటువంటి ధోరణలు ప్రమాదకరం అని గ్రహించాలి... వివక్షత, విద్వేష, విభజనలు వల్ల ఏ దేశమూ అభివృద్ధి కాదు అని గ్రహించాలి... ముఖ్యంగా ఈ అంతర్జాతీయ జాతి వివక్షత నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాలు అన్నియు సమ న్యాయం, ప్రజాస్వామ్యం, సౌభ్రాతృత్వం సమానత్వం మానవత్వం వంటి ఆలోచనలతో ముందుకు సాగాలి... మరి ముఖ్యంగా మనం భారత రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా నడుచుకోవడం ఉత్తమం. వివక్షతను విడనాడితేనే వికసిత భారత్ సాధ్యం అని పాలకులు గ్రహించాలి...

# ప్రశ్నోత్తరాలు



E-Mail Id ikyopadhyaya1975@gmail.com
నిర్వహణ : టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు
రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్

**ప్రశ్న :** ఒక జూనియర్ ఉపాధ్యాయుడు సీనియర్ ఉపాధ్యాయునికన్నా ఎక్కువ వేతనం పొందుతుంటే జూనియర్‌కి పదోన్నతి వచ్చిన 5 సం॥లోపు మాత్రమే స్టెప్‌అప్ పెట్టుకోమంటున్నారు. వాస్తవమేనా?

– **కె.హనుమంతరావు,** బాపట్ల

**జవాబు :** వాస్తవమే. స్టెప్‌అప్ ఉన్న షరతులతో పాటుగా ఈ షరతుకూడా పాటించవలసి ఉంటుంది.

**ప్రశ్న :** ఇంటర్ టిటిసి అర్హతలు గల ఎస్‌జిటి 12 సం॥ల స్కేలు పొందాలంటే పిఏటి పాస్‌కావాలా? పిఏటి పాస్ అయితే 24 సం॥ల స్కేలు కూడా ఇస్తారా?

– **శ్రీనివాసరావు,** విజయవాడ

**జవాబు :** సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయుడు ఎలాంటి అదనపు అర్హతలు లేకుండానే 12 సం॥ల స్కేలు పొందవచ్చు. సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయునికి 12 సం॥ల స్కేలు అంటే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా స్కేలు సదరు పోస్టుకు అర్హత ఇంటర్ టిటిసి. కావున 12 సం॥ల స్కేలుకు ఎలాంటి అదనపు అర్హతలు అవసరం లేదు. కాని ఎస్‌జిటికి 24 సం॥ల స్కేలు అంటే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని స్కేలు. దీనికి అర్హతలు డిగ్రీ, బిఇడి డిపార్ట్‌మెంట్ టెస్టులు. మీరు పేర్కొన్న ఉపాధ్యాయునికి 24 సం॥ల స్కేలు ఇవ్వబడదు.

**ప్రశ్న :** ఇంటర్ టిటిసిలో ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జిటిలు 12, 24 సం॥ల స్కేలు పొందాలంటే ఎలాంటి అర్హతలు ఉండాలా? తెలియజేయగలరు.

– **కె.కేశవరావు,** గుంటూరు

**జవాబు :** ఇంటర్ టిటిసి ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జిటిలకు 12 సం॥ల స్కేలు పొందాలంటే ఆ మేనేజ్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఉంటే పిఏటి పాస్‌కావాలి. స్కూల్ అసిస్టెంట్ పోస్టు లేకపోతే ఎలాంటి అదనపు అర్హతలు అవసరం లేదు. అదే విధంగా 24 సం॥ల స్కేలు పొందాలంటే డిగ్రీ బిఇడి హెడ్మాష్టర్ అకౌంట్ టెస్ట్ పాస్‌కావాలి. ఆ మేనేజ్ మెంట్‌లో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని పోస్టు లేకపోతే ఎలాంటి అదనపు అర్హతలు అవసరం లేదు.

**ప్రశ్న :** ఇంటర్, టిటిసి అర్హతలున్న ఎల్.ఎఫ్.ఎల్ ప్రధానోపాధ్యాయుడు 6 సం॥ల స్కేలు పొందాలంటే అదనపు అర్హతలు ఏమి కావాలి? ఆయన ఎస్‌జిటి కేడర్‌లో 24 సం॥ల స్కేలు తీసుకున్నారు.

– **కె.కృష్ణ,** ఎ.ఎస్.ఆర్.జిల్లా

**జవాబు :** 6 సం॥ల స్కేలు కొరకు అదనపు అర్హతలు ఏమీ అవసరం లేదు. కాని ఆయన క్రింది కేడర్‌లో 24 సం॥ల స్కేలు తీసుకున్నారు కాబట్టి ప్రస్తుత కేడర్‌లో 6 సం॥ల స్కేలు ఇవ్వబడదు.

**ప్రశ్న :** మా స్కూల్ లో ఒక ఉపాధ్యాయిని ఎస్‌జిటి నుండి ఎస్ఏగా పదోన్నతి పొంది 12సంవత్సరముల సర్వీసు పూర్తి చేసారు. ఆమె జిఓ & పిఏటి టెస్ట్ పాస్ అయినారు. ఇ.ఓ. పాస్ కాలేదు. 55సం॥ల వయస్సు. 12 సం॥ల స్కేల్‌కు నేను అర్హత కాబట్టి 12 సం॥ల స్కేలు వర్తింప చెయ్యమని అడుగు తున్నారు. చేయవచ్చా?

– **వాసు,** దుగ్గిరాల

**జవాబు :** చేయకూడదు. ప్రమోషన్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ అయిన ఉపాధ్యాయులు 12 సం॥ల స్కేలు తీసుకోవాలంటే ఇ.ఓ., జిఓ పాస్ అయి ఉండాలి. వయసు మినహాయింపు వర్తించదు.

**ప్రశ్న :** ఒక ఉపాధ్యాయుడు ఇంకా 10 నెలల సర్వీసు వుండగా మరణించారు. వారి భార్యకు కుటుంబ పెన్షన్ ఎలా చెల్లిస్తారు?

– **శ్రీనివాసు,** నిజాంపట్నం

**జవాబు :** జిఓ ఎంఎస్ నం. 2, తేదీ. 17.01.2022 ప్రకారం సర్వీస్‌లో ఉండగా చనిపోయిన వారి భార్య / భర్తకు కుటుంబ పెన్షన్ ఆ ఉపాధ్యాయుడు చనిపోయిన తేదీ నుండి 10 సం॥లు లేదా ఉపాధ్యాయునికి 67 సం॥ల వయస్సు వచ్చేవరకు ఏది ముందు అయితే అంతవరకు ఉద్యోగ విరమణ చేస్తే వచ్చే పెన్షన్ చెల్లిస్తారు. ఆ తర్వాత చివరి వేతనంలో 30% కుటుంబ పెన్షన్‌గా చెల్లిస్తారు.

**ప్రశ్న :** విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగులను రిజర్వేషన్ కేవలం నియామకాలకేనా? పదోన్నతులకు కూడా వర్తిస్తుందా? ఎంత శాతం?

– **బి.నరసింహం,** చిత్తూరు

**జవాబు :** విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగులకు నియామకాలతో పాటు పదోన్నతులలో కూడా 4% రిజర్వేషన్ వర్తిస్తుంది.

# ప్రభుత్వ ఉత్తర్వులు

**GOVERNMENT OF ANDHRA PRADESH**

**ABSTRACT**

School Education - Inter District Transfer of Teachers on Spouse and Mutual grounds -Orders - Issued.

**SCHOOL EDUCATION (SER.II) DEPARTMENT**

**G.O.Rt.No.16** **Dated: 11-02-2026**

**Read the following:-**

1. Circular Memo.No.7232/MC-I/2011-1, dated 04.08.2011.
2. From the Director of School Education, Lr.Rc.No.ESE02-14/211/2025- E-VI, Dated 27.10.2025.
3. From the Director of School Education, Lr.Rc.No.ESE02-14/211/2025-E-VI -Part(I), Dated .16.11. 2025

***

**ORDER:**

In the references 2nd and 3rd read above, the Director of School Education, has submitted proposals for Inter District transfers of (22) teachers on Spouse grounds and (4) teaches under mutual grounds, in accordance with 5(2)(c) and 5(2)(d) of Presidential Orders.

2. Government, after careful examination of the matter, hereby order to effect the Inter District Transfer of (26) Teachers, including (22) on spouse grounds under 5(2)(c) and (4) on mutual grounds under 5(2)(d) of Presidential Orders, as Annexed (Annexure-I and Annexure-II), to this G.O, subject to assign last rank next to the last regular candidates in the new units of appointment and forego seniority as well as lien in the existing units and also subject to post them on need basis in Category-(3) and Category-(4) schools.
3. The teachers who are transferred on both mutual grounds and Spouse basis will be posted in Category-(3) and Category-(4) Schools on need basis, upon reporting before the Competent Authority i.e., the District Educational Officers, for further posting.
4. The District Educational Officers concerned are therefore, directed to post the teachers who are transferred on mutual and spouse grounds on need basis in Category-(3) and Category-( 4) schools.
5. The individuals effected in the Inter District Transfers are not entitled for any TA, DA etc., as the transfers are ordered on their request basis.
6. The Director of School Education, shall take further necessary action accordingly, in the matter.
7. This order issues with the concurrence of the Finance (HR. I-Pig. & Policy) Department, vide their U.O. No.FIN01-HROPDPP(TRPO)/174/2025-HR-I (C.No:2995100), dated:05.02.2026.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**KONA SASIDHAR**

SECRETARY TO GOVERNMENT

***

**GOVERNMENT OF ANDHRA PRADESH**

**ABSTRACT**

Provident Fund - Interest rate on General Provident Fund (Andhra Pradesh) for the subscribers of GPF and other similar funds at the rate of 7.1% (Seven point One percent) per annum with effect from 1st January 2026 to 31st March 2026 for the C.F.Y. 2025-26 – Orders - Issued.

**FINANCE (HR-III- PENSION & GPF) DEPARTMENT**

**G.O.RT.No. 395** **Dated: 24-02-2026**

**Read the following:-**

1. G.O.RT.No.2930,Finance(HR-III-PENSION &GPF) Department,Dt:08.12.2025.
2. Resolution F.No.5(3)-B(PD)/2023, Government of India, Ministry of Finance, Department of Economic Affairs (Budget Division), dt:9th January 2026.

**O R D E R:**

According to Rule 13(1) of General Provident Fund (Andhra Pradesh) Rules 1935, Government shall pay to the credit of the account of a subscriber interest at such rate as may be determined for each year according to the method of calculation prescribed from time to time by the Government of India for payment of interest on subscription to the General Provident Fund in respect of Central Services.

2. In the G.O.1st read above, the State Government have adopted the interest at 7.1% (Seven point One percent) per annum for the period from 1st October 2025 to 31st December 2025 for the 3rd quarter of the C.F.Y.2025-26 on the following Provident Funds and other similar funds maintained by the Government of Andhra Pradesh on par with rates of Government of India.

a. The General Provident Fund (Andhra Pradesh) Rules1935
b. The Electricity Department Provident Fund Rules.
c. Emergency Cut and Compulsory Saving Rules, 1949.
d. Government Distilleries Employees Provident Fund
e. Andhra Pradesh Government Life Insurance Fund.
f. Andhra Pradesh Employees Welfare Fund Rules.

3. In the reference 2nd read above, the Government of India have announced that, during the year 2025-26, accumulations at the credit of subscribers to the General Provident Fund and other similar funds shall carry interest at the rate of 7.1% (Seven point one percent) w.e.f. 1 st January 2026 to 31st March 2026. This rate will be in force w.e.f. 1st January 2026.

4. Government after careful examination of the matter hereby order to adopt the rate of interest at 7.1% (Seven Point One percent) per annum for the period from 1st January 2026 to 31st March 2026 for the 4th quarter of the of the C.F.Y.2025-26 on the following Provident Funds and other similar funds maintained by the Government of Andhra Pradesh on par with rates of Government of India. This rate will be in force w.e.f 1st January 2026.
a. The General Provident Fund (Andhra Pradesh) Rules 1935
b. The Electricity Department Provident Fund Rules.
c. Emergency Cut and Compulsory Saving Rules, 1949.
d. Government Distilleries Employees Provident Fund
e. Andhra Pradesh Government Life Insurance Fund.
f. Andhra Pradesh Employees Welfare Fund Rules.

5. This order is available online and can be accessed at https://goir.ap.gov.in//

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**PEEYUSH KUMAR**

PRINCIPAL SECRETARY TO GOVERNMENT

***

**GOVERNMENT OF ANDHRAPRADESH**
**FINANCE (HR.m ·PENSIONS & GPFI DEPARTMENT**
**Memo.No.2459024/FINO1-HROMISC/86/ 2024-HR-U1 Dt:04.02.2026**

**Sub:** Draft Andhra Pradesh Civil Services Pension Rules, 2026 - Feedback from Recognised Employee Associations - Reg.

*******

Finance Department has prepared the Andhra Pradesh Civil Services Pension Rules, 2026 after a thorough examination of the existing processes as per Andhra Pradesh Revised Pension Rules, 1980 and various instructions issued from time to time. the draft rules are seen by Law Department and General Administration department and the feedback given by the two departments is incorporated appropriately.

2 . In order to ensure wider consultation and to obtain constructive inputs from all stakeholders, the draft rules are hereby shared with the Recognised Service Associations for their feedback and suggestions.

3. The Recognised Service Associations are requested to examine the draft rules in detail and furnish their views, comments and suggestions in writing, if any, by 20th Feb 2026, to enable the Government to take further action in the matter.

**VADAREVU VINAY CHAND**

SECRETARY TO GOVERNMENT (HR & EXPR)

***

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**TREASURIES AND ACCOUNTS DEPARTMENT,**
**AMARAVATI AT MANGALAGIRI**
**Cir.Memo.No.FIN02-14060/23/2026-D SECDTA (C.No.3149739); Dt.19-02-2026**

**Sub:** P.S-T&A Dept.,- Retirement Benefits Processing System (RBPS) – Streamlined & integrated online delivery of retirement benefits on NIDHI- Instructions- Issued.

**Ref:** G.O.Ms.No. 10 dtd.14.02.2026 of FINANCE (HR-II-PENSION & GPF) DEPARTMENT.

***

Attention of all the DT&AOs in the state , the ATO, APCRT, Mangalagiri and all the HOOs(JDs/CAOs/AOs/AAOs/JAOs) of Accounts Branches in various HODs is drawn to the reference cited, wherein, the Government have introduced Retirement Benefits Processing System (RBPS) to the state Government employees making pension and Pensionery benefits online right from submission of application to payment of benefits.

In this connection, it is informed that the following documents are essential to process the application in RBPS.

1. Updation of SR with reference to the data available in HRMS/CFMS.

# ఊరి బడిని కాపాడుకుందాం... ప్రాంతీయ సదస్సులు

"ఊరి బడిని కాపాడుకుందాం" అనే నినాదంతో రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయి సదస్సులు జరిపి ప్రభుత్వ బడుల్లో ఎన్రోల్మెంట్ పెంచాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించు కోవాలనే రాష్ట్ర కౌన్సిల్ పిలుపు మేరకు జనవరి 31న విజయవాడ, ఫిబ్రవరి 1న విజయనగరం, తిరుపతి మరియు ఫిబ్రవరి 8న రాజమండ్రి, అనంతపురం లలో సదస్సులు జరిగాయి. ఆ,యా జిల్లాల్లో ప్రాంతీయ సదస్సులు కూడా జరిగాయి. సదస్సుల్లో రాష్ట్ర మరియు జిల్లాల నాయకులు పాల్గొని కార్యాచారణలు రూపొందించారు.

వాటి ప్రకారం మనం చేపట్టిన ఉద్యమం విజయవంతం కావాలని అన్ని కేంద్రాల్లో పోస్టర్లు విడుదల చేయడమే గాక వివిధ కూడళ్లలో అతికించి ప్రచారం చేశారు. ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేశారు. వివిధ రకాల ప్రజలకు కూడా కరపత్రాలు పంపిణీ చేయాలని, బడి ఈడు పిల్లల సర్వే నిర్వహించి, అడ్మిషన్లు పెంచాలని, తల్లిదండ్రులకు మన బడిపై నమ్మకం కలిగే విధంగా పాఠశాలల్లో 1 గంట అదనంగా పనిచేయాలనే పిలుపును ముందుగా మన కార్యకర్తలే అమలు చేయాలని, మనం పనిచేసే పాఠశాలల్లో విద్యార్థులందరికీ ఇంగ్లీషు, తెలుగులో చదవడం, వ్రాయడం, మాట్లాడడంతో బాటు చతుర్విధ ప్రక్రియలు నేర్పాలని నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# తెలుగు భాష

- పి.వెంకటశైలజ, వెలగలేరు.

**కం.**
**తేనియ లూరెడి తెలుగుయె**
**వీణియ నాదమ్ము వోలె వీనుల సోకున్**
**కానీ, దానిని బలుకుట**
**మానుచు నాంగ్లమ్ము నేర్వ మార్గము బట్టెన్.**

**కం.**
**చక్కెర కలసిన తెలుగును**
**చక్కగ నేర్చినను బాల జ్ఞానము బెరుగున్**
**చక్కని పలుకుల తెలుగుయె**
**మిక్కిలి కీర్తిని బడసెను మేదిని యందున్.**

**సీసము.**
**ఏ భాష వెలుగొందె నిలను సత్యమ్ముగ**
**ఆ భాష మన తెల్గు అమ్మలార!**
**ఏ భాష వీనుల కింపును గూర్చునో**
**ఆ భాష మన తెల్గు అయ్యలార!**
**ఏ భాష కీరుతులెల్లలు దాటెనో**
**ఆ భాష మన తెల్గు అన్నలార!**
**ఏ భాష కావ్యమ్ము లెదలందు నిల్చునో**
**ఆ భాష మన తెల్గు అక్కలార!**

**తే.గీ**
**తమ్ములార! చెల్లియలార! ధరణి యందు**
**తెలుగు భాషామ తల్లికి వెలుగు నిడను**
**మమత తోడను నేర్వుము మరువకుండ**
**ఆదరించును అమ్మయై యాంధ్ర భాష.**

2. Nomination for DCRG/Commutation/GPF/APGLI/GIS/ EEL/ Death Relief/ Life Time Arrears etc.
3. Family Members Declaration with Biometric authentication
4. Home Town Declaration.
5. Service Verification certificate from time to time
6. GIS entry certificate
7. Leave entries upto date
8. Any other necessary entries/updations, if required.

Further, they are hereby directed to visit the NIDHI portal and verify the HRMS/CFMS data with reference to Service Registers and update the same through competent authority, by submitting required documents and see that there is no variation between the data available in the system with reference to the Service Register.

It is also directed to submit the SR of the employee who ever going to retire within two years from the date of issue of above G.O to the Pension Authorizing Authority (PAA) for PRSV (Pre-Retirement Service Verification) through NIDHI portal duly submitting the Physical SR for certification from the PAA.

Therefore all the DT&AOs/all the HOOs(JDs/CAOs/ AOs/AAOs/JAOs) of Accounts Branches in various HODs are directed to instruct all the DDOs/STOs under their jurisdiction to verify the SRs of the staff members and obtain applications/ required data from them and take suitable action for correction of data, updation of SR etc. promptly as per the orders issued in the reference cited.

This shall be treated as most urgent.

**Encl:** Ref. above

**PADMAJA KARE**
Director of Treasuries and Accounts(i/c)

***

# యుటియఫ్ రణభేరి 2.0


యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు


యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్


యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి ఆర్. మోహనరావు


యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా


యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్ కుమార్


యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు


యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.ఎస్.నాయుడు


సాంస్కృతిక బృందం


యుటీయఫ్ రణభేరి ధర్నా కార్యక్రమం విజయవంతంలో తోడ్పాటు ఇచ్చిన ఉపాధ్యాయులకు, కార్యకర్తలకు, అభిమానులకు రాష్ట్ర సంఘం తరపున కృతజ్ఞతలు

RNI : APMUL/2019/80460 VOL - 7 ISSUE - 02 KRISHNA/VIJAYAWADA PAGES - 36 Date of Pub: 02/03/2026 Date of Posting : 5,6 /03/2026 Lic.No.D/VJ/159/2024-26

# యుటియఫ్ రణభేరి 2.0





TO